లోపలి పేజీల్లో
2004
రౌండప్ ప్రత్యేకం

ఆదివారం
ప్రజాశక్తి
డిసెంబర్ 26, 2004

Entered

కొత్త(ఏడాది)కి స్వాగతం?!

2005

హ్యాపీ బర్త్‌డే

(26-12-2004 నుంచి 1-1-2005వరకు)

ఎం. సాయి ప్రసాద్
3సం॥, 26.12.2001
రాజరాజేశ్వరి-శ్రీనివాసరావు
పెమబల్లి-ఖమ్మం

జశ్వంత్
1సం॥, 26.12.2003
వసంత-శ్రీను
విక్రమ్‌స్పిన్స్-శ్రీకాకుళం

నేహ
6సం॥, 26.12.1998
సరిత-శ్రీకాంత్
కావలి-నెల్లూరు

కె. లావణ్య
3సం॥, 26.12.2001
లక్ష్మి-త్రినాథరావు
కర్రవీధి-శ్రీకాకుళం

హష్మ సుచిత్‌రెడ్డి
1సం॥, 26.12.2003
గీత-మల్లారెడ్డి
తుంబావి-నల్లగొండ

దివ్యరెడ్డి
డిసెంబర్-26
ఆదిలక్ష్మి-శేషిరెడ్డి
వెంకటేశ్వరనగర్-ఒంగోలు

సౌమ్య
డిసెంబర్-27
లక్ష్మి-నర్సింహారెడ్డి
ఆత్మకూరు

ఉషాసాయిశ్రీ
3సం॥, 27.12.2001
మాలతి-రామకృష్ణ
ప॥గో

ఉష
2సం॥, 27.12.2002
సరిత-నాగేష్
పులిమామిడి-రంగారెడ్డి

నవీన్‌కుమార్
2సం॥, 27.12.2002
దానమ్మ-నరసింహారావు
పొదిలి-ప్రకాశం

వెంకటసాయికిరణ్
3సం॥, 28.12.2001
శ్రీలక్ష్మి-విజయకుమార్
ఉప్పుగుండూరు-ప్రకాశం

ఆకాశ్
డిసెంబర్-28
అనురాధ-శ్యామ్‌సుందర్
వినాయక్‌నగర్-విశాఖ

ఎం.రమ
4సం॥, 28.12.2000
పద్మిని-రాంబాబు
రవీంద్రనగర్-సికింద్రాబాద్

అలేఖ్య
డిసెంబర్-28
వనజ-దీక్షితులు
పామూరు-ప్రకాశం

వి. సాయికృష్ణభార్గవ్(తేజ)
డిసెంబర్-29
రేవతి-ప్రసాదరావు
పెనుబల్లి-ఖమ్మం

శ్రీకాంత్
6సం॥, 29.12.1998
సదాశివకుమార్
రేణిగుంట-చిత్తూరు

కె. స్వాతి
1సం॥, 29.12.2003
పద్మ-నర్సింహ్మ
మిర్‌ఖాన్‌పేట-రంగారెడ్డి

తారకలక్ష్మి(తులసి)
2సం॥, 29.12.2002
నీరజ-చంద్రరావు
మచిలీపట్నం-కృష్ణా

ఎం.గాయత్రి
3సం॥, 30.12.2001
భ్రమరాంబిక-సూర్యనారాయణ
రవీంద్రనగర్-సికింద్రాబాద్

సాయికిరణ్-సాయిరామ్ కిషోర్
డిసెంబర్-30
రోజ-శ్రీనివాసరావు
ఖమ్మం

మహ్మద్ అబ్దుల్ అజీజ్
4సం॥, 1.1.2000
ఫాతిమాబేగం-మహ్మద్ సర్తాజ్ అజీజ్
విశాఖ

గీతాంజలి
జనవరి-1
శారద-రాజగోపాల్
కామాటివీధి-నెల్లూరు

ప్రజ్ఞ(మేఘమాల)
1సం॥, 30.12.2003
కాంచనమాల-మల్లేశ్వరరావు
వంగపల్లిపేట-విజయనగరం

స్వామి సూర్య అవినాష్
డిసెంబర్-30
అనంతలక్ష్మి-నాగేశ్వరరావు
మోరంపల్లి బంజర-ఖమ్మం

నాసీరా
8సం॥, 3012.1996
అఫ్రీషా-ఫయాజ్
వెంకటేశ్వరాపురం-నెల్లూరు

మరికొన్ని ఫోటోలు మూడవ కవర్‌పేజీలో చూడండి

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం



చలికోట్లు

12వ తేదీ కవర్‌స్టోరీగా రాసిన "చలి...చలి...చలికోట్లు" బాగుంది. ఎండకు చెప్పులు, వానకు గొడుగు, చలికి నేపాలీ స్వెట్టరే నేటి మానవునికి అండ. ఊరు, భాష, సంస్కృతి తెలియని ప్రాంతంలోకి నేపాలీలు ఉన్ని, సెమీ ఉన్ని, నారతో తయారయ్యే స్వెట్టర్లు అమ్ముతూ వారు మాత్రం నెలల తరబడి చలిలో ఫుట్‌పాత్‌ల మీద గుడారాలలో నివసిస్తారని వారి గురించి వివరించిన తీరు ఆకట్టుకుంది. అయితే నిర్దిష్టధర అంటూ లేకపోవటంతో అక్కడక్కడా అధికచమురు వదిలించుకోవలసివస్తోంది.

-యర్రమోతు ధర్మరాజు,
ధవళేశ్వరం, తూ.గో.జిల్లా

కవర్‌స్టోరీ బాగుంది

చలికోట్లు, వాటిని సుదూర ప్రాంతాలనుంచి తీసుకొచ్చి మనకు అమ్ముతున్న నేపాలీ, అస్సాం, టిబెటెన్ల గురించి చక్కటి కవర్‌స్టోరీ అందించారు. చాలా అంశాలు తెలుసుకున్నాం. ఈ సంచికలో 'జడలో మసాలా వడ' కథ, 'బాహుకాలం' గురించి ముందుమాట, రియల్‌స్టోరీలో సు'దూరదర్శిని', టూరిస్ట్‌గైడ్‌లో 'ప్రకృతిలో భాగం జోగ్‌జలపాతం', కళాసాహితిలో 'బొమ్మలాటకు జీవం పోస్తున్న తాతా' ఇలా అన్ని శీర్షికల రచనలూ ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయా అన్నంతగా బాగున్నాయి. పాఠకులను ఆలోచింపజేశాయి.

-సిరిపురపు రామకోటేశ్వరరావు,
ఎనికేపాడు, విజయవాడ రూరల్.

టీవీ డబ్బ పాడుగాను!



నం వృద్ధి శీర్షికలో ప్రచురించిన 'టీవీ డబ్బ పాడుగాను' ఎంతో బాగుంది. చదువుతుంటే ఎంత వాస్తవం అనిపించింది. పోరగాల్ల సదువులు ఖరాబైతాయని డబ్బును మూలకుపెడితే వారి మనసులు ఈగల్లా దానిసుట్టె తిరుగవట్టె. ఇగ ఆ ఇంట్లోని ఆడవాల్లయితే గోమార్ల తీరుగ దాన్ని పట్టుకొనే వుంటదైరి. దానినుంచి నేర్చుకునుడా...పాడా? సమయం వృథాయే. ఇంగ ఇంట్లకచ్చిన సుట్టాలు-పక్కాలతోని ముచ్చట్ల సంగతి మరిసిరి. మన ఇంట్ల పుస్తకమనేదుంటే మన ఇష్టమొచ్చినప్పుడు చదువుకొని జ్ఞానాన్ని పొందుతాం. అందుకే నేనంటా పుస్తకమే నయం.

-వి. చారి, పెండోట, బస్వపడగ,వరంగల్‌జిల్లా.

ప్రతిమాపురి ఆదర్శం

రియల్‌స్టోరీలో వచ్చిన "సుదూరదర్శిని" వ్యాసం స్ఫూర్తిదాయకంగా ఉంది. ఆ రోజులలో స్త్రీలు గడపదాటి బయటకు రావాలంటే సందేహపడేవారు. అటువంటి స్థితిలో ప్రతిమాపురి పురుషులతో సమానంగా ఉద్యోగం చేయాలన్న పట్టుదలతో తన లక్ష్యం నెరవేర్చుకుంది. మహిళలు చేయలేని పని అంటూ ఏమీలేదు అని నిరూపించింది. ప్రతీ స్త్రీ ప్రతిమాపురిలాంటివారిని ఆదర్శంగా తీసుకోవాలి.

-కొడిశాల లత, మణుగూర్,
ఖమ్మంజిల్లా.

కవిత బాగుంది

కళాసాహితిలో మంచిమంచి కవితలు ప్రచురిస్తున్నారు. ప్రతీవారం కవితలను తప్పకుండా చదివి, వాటిని దాచిపెట్టుకుంటున్నాను. ఈ వారం సోమేపల్లి వెంకటసుబ్బయ్యగారి కవిత గురజాడను, వారు రాసిన దేశమంటే మట్టికాదోయ్ అనే రచన గుర్తుకు తెచ్చింది. బాలలకథలో కూడా మంచిమంచి కథలు ప్రచురిస్తున్నందుకు ధన్యవాదాలు. మా పిల్లలు ప్రతీవారం ఆ కథలను చదువుతున్నారు.

-పెండోట వెంకటేశ్వర్లు,
మక్త లక్ష్మాపురం

గుల్జార్ కథలు

పుస్తకపరిచయంలో 'గుల్జార్ కథలు' పుస్తకసమీక్ష ఆసక్తిదాయకంగా ఉంది. ప్రఖ్యాత సినీగేయ రచయిత, కవి, దర్శక-నిర్మాత అయిన గుల్జార్ ఇంగ్లీషులో రాసిన పుస్తకం తెలుగు అనువాదంతో మన ముందుకు రావడం ప్రశంసనీయం. పరిచయవ్యాసం, ఈ కథల పుస్తకాన్ని కొని చదవాలన్న జిజ్ఞాసను కలిగించింది. ఆదివారం అనుబంధం పేజీలు మరిన్ని పెంచితే బాగుంటుంది.

-ఎండి ముస్తఖీమ్, కొల్లాపూర్,
మహబూబ్‌నగర్‌జిల్లా.

పాత... ! కొత్త... !!!

"పాత ఒక రోత...కొత్త ఒక వింత"

ఈ సామెత వినీవినీ... అనీఅనీ... మహా పాతదైపోయింది కదండీ.

అయినా... ఈ సంవత్సరం చివరి రోజుల్లో ఆ సామెతకు ఒక విధమైన తాజాదనం వస్తుందిలేండి!

బస్టాపులో నిలబడ్డప్పుడు 'కొత్త కేలండరో... కొత్త కేలండరో' అంటూ అమ్మొస్తే ఆ కొత్తదాన్ని కొనుక్కుంటాం.

కొద్దోగొప్పో మన డబ్బులు దాచుకున్న బ్యాంకువారు తమ కాలెండరంటూ ఇచ్చినా ఆ కొత్తదాన్ని తెస్తాం.

ఏ చిట్‌ఫండ్‌వాడో తమ చిట్ సంస్థ ఎప్పుడూ గుర్తొస్తూంటుందని మనకో కేలండర్ దయచేస్తాడు. అదీ కొత్తకొత్తగా మనింటికొస్తుంది.

కొత్తదాన్ని పట్టుకుని పాతకాలెండరు వంక పాతచూపొకటి పడేస్తాం.

నలిగినలిగి, చివరిపేజీ ముఖంతో దిగాలుగా కనబడుతుంది. దాని ముఖంనిండా పాలవాడి నాగాలు, చాకలికేసిన బట్టల వివరాలు, ఇంటద్దె-కరెంటు రీడింగుల తాలూకు ఎర్ర-నీలం రంగు రీఫిల్ గీతల వాతలు.

కాస్తంత ప్రేమకలిగి ఆ పాతదాని పేజీలు తిరగేశామంటే...మనింటి, మన ఇంటిబయిటి దేశంలోని సంగతులు...రీళ్ళన్నీ వెనక్కితిరిగి ఫ్లాష్‌బ్యాక్కేస్తాయి.

మన బతుకులమీద ధరల బండలో, పన్నుపోట్లో వేసే ఆసాములు ఐదేళ్ళకోసారి మారుతుంటారు కదండీ... అలాంటి మార్పు పాతబడ్డ ఈ కేలండర్‌లోనే జరిగిందండీ!

పాతకేలండరు పదవింకా ఊడనేలేదు...గోడకున్న మేకు నుండి దిగడానికింకా ఐదురోజులుండగానే ఇంటిల్లిపాదీ కొత్త కేలెండర్‌ను తిరగేయటమే ఓ వినోదంగా మారింది.

అందరూ...అన్నిళ్ళల్లోనూ కొత్త కేలండరు తిరగేసి మరగేసి పండుగలు, శలవులు, తమతమ పుట్టినరోజులు ఎప్పుడొచ్చాయని చూసుకునే ముచ్చట జరుగుతుంటది కదా!

నాలుగు శతాబ్దాల క్రితం ఈ కేలెండర్ విషయంలో మా గొప్ప పంచాయితీ జరిగిందట. సంవత్సరానికి 365 రోజులమీద పావురోజు. అందుకని నాలుగేళ్ళకో రోజు ఫిబ్రవరి నెలకిచ్చారు కదా. అవే కాదు ఏవో నిముషాలూ, సెకెండ్లు కూడా చిల్లర్లున్నాయనీ.. ఆ చిల్లర్లు లెక్కకడితే పదకొండు రోజులు గల్లంతయ్యాయని గోలపెట్టారుట!

ఇప్పుడా గోల మనకొద్దులేండి. ఎందుకంటే ఆ పదకొండు రోజులు కలిపితే కొందరికీ, కలపకపోతే వేరేవాళ్ళకు నష్టం అని తేలుద్ది.

అంచేత...గమ్మునుండిపోయి...

హేపీ క్రిస్‌మస్... అనేసుకున్నాం.

హేపీ న్యూ ఇయర్ అనికూడా అనేసుకుందాం.

✤

ఈ సంచికలో . . .

ఓరా!	3
కార్టూన్ కదంబం...	4
కవర్ స్టోరీ	5
బాలల కథ	11
బాలనేస్తాలు	12
జీవనశైలి	16
నువ్వద్ది	17
ఆరోగ్యం	18
పుస్తక పరిచయం	20
న్యాయసలహాలు	24

ఇంకా...

చెరువు కథ ... 8, 9, 10



రక్షకుడు పుట్టిన సీన్...!
రియల్ స్టోరీ ... 14, 15



కనువిందు చేసే 'కాన్హా'
టూరిస్ట్‌గైడ్ . . . 21

యాభై ఏళ్ళ కళాఖండం పథేర్ పాంచాలి
కళాసాహితి . . . 22, 23

ఓరా!



తిండిపోతులకు పోటీ!!!

అమెరికా కదా...ఏ పోటీలకైనా గిరాకియే! బ్రూక్లిన్‌లోని కోనీ ఐలెండ్‌లో "నాథన్స్ హాట్ డాగ్ ఈటింగ్ కాంటెస్ట్" లో కుక్కలా సప్పసప్పమంటూ తినే "వేగపు తిండిపోటీ" పెట్టారు. ఆ పోటీలో జపాన్‌కి చెందిన 'టకేరూ కొబయాషి' అనే 26సంవత్సరాల తిండిపోతు 50 హామ్‌బర్గర్లు 12నిముషాల్లో తినిపడేశాడు. మరో పోటీలో కేవలం ఎనిమిది నిముషాల్లోనే 69 హామ్‌బర్గర్‌లు తినేశాడు. తిని తేన్చి, పదివేల డాలర్లు పందెం గెలుచుకున్న మహాతిండి దృశ్యం అమెరికన్ ప్రజలు చూసే భాగ్యం కల్పించాడీ "కుక్కతిండి"(Hot Dog Eating)విజేత.

యథా బావా... తథా బామ్మర్దీస్!

"అలా చూస్తే ఎలా బావా? మేమేం అన్నామని?! రబ్రక్కయ్యకు లాగే మా సతీమణులకూ్కడా పార్టీ టిక్కెట్టివ్వమంటున్నాం" అనంటున్నారు బీహారీ బావగారి బావమరుదులిద్దరూ. లాలూయాదవ్‌గారి బావమరుదులు సుభాష్ యాదవ్, సాధూ యాదవ్‌లు బావగారి ఆశీస్సులతో ఎంపీలయ్యారు కదా! ఇంటివద్ద తమ సతీమణులకు ఏం తోచదు, అందునిమిత్తమై రాబోయే బీహార్ ఎన్నికల్లో కనీసం ఎమ్మెల్యే టిక్కెట్లన్నా ఇవ్వాల్సిందేనని గారాలుపోతున్నారట. ఎద్దు రుచికరమైన 'దాణా' మేస్తుంటే... పక్కనే ఉన్న దూడలు ఎండుగడ్డి తింటాయా...ఏంటీ?!

పౌరోహిత్యమ్ ఇన్ ఇంగ్లీష్



"ఇంగ్లీషు మంత్రాలతో మీ పెళ్ళి చేయబడును" అని లేటెస్టుగా పురోహితులు బోర్డులు పెట్టుకునే వేళాయె మరి! ఎంచేతనంటే...విదేశాల్లో స్థిరపడ్డ, స్థిరపడబోయే పెళ్ళికొడుకో, పెళ్ళికూతురో తమ పెళ్ళి వేడుకను అక్కడి అన్యభాషా మిత్రసమూహానికి చూపించాలని ఉబలాటపడేవాళ్ళు పెరిగిపోయార్ట. అందుమూలంగా సంస్కృత మంత్రాలను వల్లె వేసే పురోహితులు అర్జంటుగా అదే వేదఘోషను ఇంగ్లీషులో పలికిఛావటమెలాగో తెగ నేర్చేసుకుంటున్నారు. "యజమానుష్యా...రామచంద్రావు నామధేయస్యా...ఐ మీనూ ది పేరెంటు నేముడు రామ్‌చందరింగ్...సపుత్రికా...మై ఓన్ డాటరూ...కన్యాదానం కరిష్యే...ఇట్ మీన్సూ...బ్రైడ్ డొనేషన్ హేజ్ డన్ బై మి...ఐ స్వోర్న్ బిఫోరు ది గాడ్ ఆఫ్ ఫైరు...మమః ...ఓకే!" అని తెంగ్లీషు ఛాంటింగ్ మన ఆంధ్రా పురోహితులు అదరగొట్టేస్తున్నారు.

కార్టూన్ కదంబం



టెండర్లు
టెండర్లు
టెండ..
అసెంబ్లీలో 'టెండర్' అన్నాడే
టెండర్ల వ్యవహారం ప్రజల్లోకి: టిడిపి



అవును, ఒక్కొక్కరు ఒక్కొక్కటి త్యాగం చేశారు మరి...
త్యాగులకే పదవులు — వైఎస్



జనవరి 2004:
ఏదిఏమైనా ఈ ఏడాది ఆఖరికల్లా సైన్యాధ్యక్షపదవి నుండి తప్పుకుంటా
ముషార్రఫ్
డిసెంబర్ 2004:
నా వల్లే కాశ్మీర్ సాధ్యం సైన్యాధ్యక్షుడిగా నేనే ఉంటా

డిసెంబర్ 31 రాత్రి రాబోతోంది. "హ్యాపీ న్యూ ఇయర్" అంటూ కేరింతలు కొట్టే రోజు దగ్గర్లోనే ఉంది. జనవరి ఫస్ట్ గ్రీటింగ్ కార్డులు కొని పోస్టు చేసేవాళ్లు ఇప్పటికే బిజీబిజీ. ఇంటర్నెట్టు ఇచ్చిన మహదవకాశంతో అందులోనే గ్రీటింగ్ ఇమేజ్‌ను సెలెక్ట్ & క్లిక్ చేసేసి తమతమ స్నేహితుల ఇ-మెయిల్ అడ్రస్సులకు "సెండ్" కొట్టేవాళ్ళు కొడుతున్నారు. సెల్‌ఫోన్ కంపెనీలు ఇచ్చే ఎస్సెమ్మెస్ సౌకర్యమున్నవారు ఆ రోజు కోసం కాచుకుని మిన్నకున్నారు.

కొత్త (ఏడాది)కి స్వాగతం?!

వరప్రసాద్

2004 కేలెండర్ తూకానికి వెళ్ళబోయే పాత న్యూస్ పేపర్ల కట్టలోకి వెళ్ళబోతోంది. మరో ఐదు రోజుల్లో కొత్త కొత్త ఆశలను మోసుకుని కొత్త సంవత్సరం మనల్ని పలకరించేందుకు సిద్ధంగా వుంది. ప్రతి ఏడాదీ రాబోయే కాలంపైన మనిషి ఆశలు పెంచుకోవటం సహజమే అయినా, ఈ ఏడాది సాధించిన మంచి, చెడులను ఒక్కసారి మననం చేసుకుని తప్పొప్పులను సరిదిద్దుకునే దిశగా రాబోయే కాలానికి సరైన ప్రణాళిక రూపొందించుకోవటం అవసరం. గత నెలలో హిందువులు దీపావళిని, ముస్లింలు రంజాన్ పండుగలను భక్తితో జరుపుకున్నారు. ఇక క్రైస్తవ సోదరసోదరీమణులు క్రిస్మస్ పండుగను ఆనందోత్సాహాలతో పూర్తి చేసుకుని కొత్త సంవత్సరం 2005కి స్వాగతం పలికేందుకు సరికొత్త ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నారు.

ఛానెళ్ళూ, పబ్‌ల హడావుడి

స్టార్ సిరీస్ ఛానెళ్ళు తదితర విదేశీ ఛానెళ్ళకు ధీటుగా దేశీయ టీవీ ఛానెళ్ళూ తమ వంతు హడావుడి చేయబోతున్నట్టు ముందస్తు క్లిప్పింగ్స్ హోరెత్తుతున్నాయి. ప్రభుత్వ ఛానెల్ కూడా అందుకేమీ వెనుకబడలేదంటూ 31 అర్ధరాత్రి ప్రోగ్రాముల ఊరింపు క్లిప్పింగ్స్ ప్రసారం చేస్తున్నది. మన రాష్ట్రానికొస్తే...దాదాపు అన్ని తెలుగు ప్రభుత్వ-ప్రైవేటు ఛానెల్స్ నూతన సంవత్సర సంరంభ వేడుకల ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించుకుని రెడీగా ఉన్నాయి. హైదరాబాద్, ఇప్పుడిప్పుడే వ్యాప్తిచెందుతున్న విశాఖలాంటి నగరాలలో పబ్‌లు, డిస్కోథెక్‌లు, రిసార్ట్‌లు, రెస్టారెంటులు, స్టార్ హోటల్స్ అన్నీ... 31 అర్ధరాత్రి ప్యాకేజీలు, ర్యాప్-రెయిన్‌డ్యాన్స్, మ్యూజికల్ నైట్స్ తదితర హంగామాతో "హ్యాపీ న్యూ ఇయర్" అనిపించబోతున్నాయి. ఒక్కమాటలో నూతన సంవత్సర ఆనందహేలలో యువతరాన్ని ఓలలాడించడానికి ఎన్నెన్నో కొత్తకొత్త థీమ్ పార్టీలు వేచి ఉన్నాయి. ఆ ఆనందాల మాటున మరెంతో వ్యాపారం పొంచి వుంది.

ఓహో...మా రెండువేల ఐదా...
కొత్త సంవత్సరమా...
నీ ఆహ్వాన వేడుకల్లో ఈసారి ఏ కొత్తదనమో?!

కొత్త సంవత్సర వేడుకల ప్రారంభం

కొత్త సంవత్సరానికి స్వాగత వేడుకలు జరుపుకోవటం అత్యంత పురాతనమైన సంప్రదాయం. తొలుత నాలుగువేల ఏళ్ళ క్రితం బాబిలోనీయులు దీనికి

పునాది వేశారు. క్రీస్తు పూర్వం 2000 సంవత్సరంలో వసంత ఋతువు తొలిరోజున కనిపించే చంద్ర దర్శనం నాడు ఈ వేడుకను ప్రారంభించారు. వసంతకాలం ప్రారంభం కావటాన్ని కొత్త ఏడాదికి సూచనగా వారు పరిగణించారు. అన్ని ఋతువులూ ఇప్పటి నుంచి తిరిగి తమ గమనాన్ని ప్రారంభిస్తాయన్నది వారి విశ్వాసం. అయితే దీనికి జ్యోతిష్యపరంగా లేదా వ్యవసాయపరంగా ఎటువంటి ప్రాముఖ్యతా లేదు. కేవలం విశ్వాసంపై ఆధారపడి మాత్రమే ఈ వేడుకలను జరుపుకునేవారు. రోమన్లు తమ నూతన సంవత్సరాదిని మార్చిలో ప్రారంభించేవారు. అయితే తరువాత వారు సూర్య గమనానికి అనుగుణంగా తమ కేలండర్‌ను సవరించుకున్నారు. దీనిని క్రమబద్ధీకరించే క్రమంలో క్రీస్తు పూర్వం 153 వ సంవత్సరంలో రోమన్ సెనేట్ జనవరి 1వ తేదీని కొత్త సంవత్సరం ప్రారంభ దినంగా నిర్ధారించింది. ఈ సంప్రదాయానికి క్రీ.పూ 46లో జూలియస్ సీజర్ గండికొట్టాడు. ఆయన తన పేరిట జూలియన్ కేలండర్‌ను ప్రకటించి దానిని అమలులోకి తీసుకువచ్చాడు. ఇందులో కూడా జనవరి 1వ తేదీనే కొత్త ఏడాదికి ప్రారంభ దినంగా ప్రకటించటం విశేషం. జనవరి 1వ తేదీని కొత్త సంవత్సరానికి ప్రారంభంగా పరిగణించే సంప్రదాయాన్ని క్రీ.పూ 567 పర్యాటక మండలి (కౌన్సిల్ ఆఫ్ టూర్స్) రద్దు చేసి, మార్చి ప్రారంభం నుంచి కొత్త ఏడాదిని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ విధంగా కొత్త సంవత్సర వేడుకలు పలుమార్లు ముందు వెనుకలకు జరిగి చివరిగా జనవరి 1 వద్దనే స్థిరపడటం విశేషం. 1582లో 13వ పోప్ గ్రెగరీ "గ్రెగోరియన్ కేలండర్"ను ప్రవేశపెట్టిన నాటి నుంచి ఇదే సంప్రదాయం స్థిరపడింది. క్రీస్తు జననానంతరం తొలి నాళ్ళలో పండుగ కార్యక్రమాలను జరుపుకోవటాన్ని రోమన్ క్యాథలిక్ చర్చి నిషేధించింది. అయితే క్రమంగా క్రైస్తవ మతానికి జనాదరణ పెరుగుతున్నకొద్దీ ఈ పండుగ విశేషాలను మత విశ్వాసాలతో మేళవించి నిర్వహించటం ప్రారంభించారు.

కేలెండర్ రూపకర్త పోప్ గ్రెగరీ

కొత్త ఏడాది ప్రారంభం రోజును సెలవు దినంగా ప్రకటించే సంప్రదాయాన్ని పాశ్చాత్య దేశాలన్నీ అనుసరిస్తూ వచ్చాయి. కొత్త ఏడాది ప్రారంభానికి చిహ్నంగా పసిపాప చిత్రాన్ని వినియోగించటం క్రీ.పూ 600 నాటి నుండి ప్రారంభమైంది. గ్రీకు దేశీయులు దీనికి నాంది పలికారు. కొత్త సంవత్సర ప్రారంభం రోజున "డయోనిసస్" పేరుగల దేవత పూలబుట్టలో పసిపాప రూపంలో తమ ఇళ్ళకు వస్తుందన్నది వారి విశ్వాసం. తమ భవిష్యత్ కార్యక్రమాలకు స్ఫూర్తిగా వారు ఈ సంప్రదాయాన్ని అనుసరించే వారని భావించవచ్చు. ఈజిప్టు దేశీయులు కూడా ఇదే తరహాలో పసిపాప చిత్రాన్ని తమ కొత్త సంవత్సర ప్రారంభానికి చిహ్నంగా పరిగణించే వారు. అమెరికన్ల ద్వారా జర్మనీ దేశీయులకు కూడా ఇదే సంప్రదాయ వాసనలు అబ్బాయి.

మొదటిరోజు సెంటిమెంటు

కొత్త సంవత్సర ప్రారంభాన్ని తమ అదృష్టాన్ని మలుపుతిప్పే రోజుగా పరిగణిస్తారు. ఈ కారణంవల్లే కొత్త సంవత్సరాదిని తమ బంధుమిత్రులతో కలిసి డిసెంబర్ 31 అర్ధరాత్రి సమయంలో జరుపుకుంటారు. డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి 12 గంటల సమయంలో పాత సంవత్సరానికి వీడ్కోలు ఇచ్చి కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ ఆనందోత్సాహాలతో వేడుకలు చేసుకుంటారు. కొత్త సంవత్సరం రోజున తమ ఇంటికి వచ్చే తొలి అతిథి తమకు అదృష్టాన్ని వెంట తీసుకువస్తారన్నది పలువురి విశ్వాసం. ఈ వ్యక్తి పొడవాటి నల్లటి జుట్టు కలిగిన వ్యక్తి అయితే ఏడాదంతా అదృష్టదేవత తమ వెంటే వుంటుందన్నది అమెరికన్ల ప్రగాఢ విశ్వాసం.

మత విశ్వాసాల జోడింపు

భారత్‌లో వివిధ ప్రాంతాల్లో వేర్వేరు దినాల్లో కొత్త సంవత్సర వేడుకలను జరుపుకోవటం సంప్రదాయంగా వస్తోంది. మన తెలుగువారు జరుపుకునే ఉగాది వసంత ఋతువులో వస్తుంది. ఎండి మోడువారిన మోడులు చిగురిస్తూ... కొత్త పచ్చదనంతో వెల్లివిరుస్తుంది. మార్చి-ఏప్రిల్ నెలల్లో వచ్చే ఈ ఉగాది రోజు మంచి కార్యక్రమాలను చేపడితే ఆ ఏడాదంతా మంచే జరుగుతుందన్న విశ్వాసాన్ని పలువురు అనుసరిస్తుంటారు. ఇందుకు అనుగుణంగానే కొత్త ఏడాది ప్రారంభం రోజున పరిశుభ్రంగా ముస్తాబై కొత్త దుస్తులు ధరించటం, తమ ఇష్ట దైవాన్ని ప్రార్థించేందుకు ఆయా మందిరాలకు వెళ్ళటం, బంధుమిత్రులతో ఆనందంగా గడపటం వంటివి చేస్తుంటారు. ఈ సంప్రదాయాన్ని ఇటీవలి కాలంలో ఆంగ్ల సంవత్సరాదికి కూడా వర్తింప చేస్తుండటం విశేషం. జనవరి ఒకటి రోజున ఆనందోత్సాహాలతో గడిపితే సంవత్సరం అంతా తాము అదేవిధంగా వుంటామన్న విశ్వాసంతో అనేక మంది జనవరి 1వ తేదీ ఉదయాన్నే ప్రార్థనా మందిరాలకు వెళ్లి ఇష్టదైవాన్ని పూజించటం, తమ పేర అర్చనలు చేయించుకోవడం, బంధుమిత్రులతో కలిసి ఆనందంగా గడపటం, కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం వంటి వాటిని చేస్తున్నారు. ఈ విధంగా జనవరి ఫస్ట్‌ను కూడా మత విశ్వాసాల పరిధిలోకి లాగటం విచిత్రంగా ఉంది కదూ!

మన దేశంలో కొత్త సంవత్సర వేడుకలు

తెలుగువారికి కొత్త సంవత్సరం ఉగాదితో ప్రారంభమవుతుందన్న విషయం మనందరికీ తెలిసిందే. ఉగాది రోజు అటు ప్రభుత్వపరంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం కావటంతో పాటు ఇటు ప్రజలు కూడా అనేక నూతన వృత్తి వ్యాపారాలకు శ్రీకారం చుడతారు. ఉగాది నాడు శుభారంభం జరిగితే ఇక తిరుగుండదన్నది మన విశ్వాసం. కేరళీయులు తమ కొత్త సంవత్సర వేడుకలను మేడం మాసం తొలిరోజున "విషు" పేరుతో జరుపుకుంటారు. సాధారణంగా ఇది ఏప్రిల్ 14వ తేదీన వస్తుంది. ఈ పండుగ వేడుకలను మలయాళీలు రాష్ట్రమంతటా సంప్రదాయ ఉత్సాహంతో జరుపుకుంటారు. ఈ వేడుకల్లో విషుక్కణి, విషు కైనీట్టం ప్రధానాంశాలు. ఒక ప్రత్యేక పాత్రలో పవిత్ర పదార్థాలైన ధాన్యం, కొబ్బరికాయ, తమలపాకులు, వక్కలు, అద్దం, పసుపు రంగు పువ్వులు వంటి వాటిని ఉంచుతారు. ఈ పాత్రను 'విషుక్కణి' అంటారు. ఈ పాత్రకు సమీపంలో 'నీలా విళక్కు' పేరుతో దీపాన్ని వెలిగించి ఉంచుతారు. విషు పండుగ రోజున పవిత్రమైన పదార్థాలను చూస్తే ఆ ఏడాదంతా తమకు శుభ ఫలితాలు సమకూరుతాయన్నది వారి ప్రగాఢ విశ్వాసం. పండుగ రోజు తెల్లవారు జామున వీరు ఈ పాత్రకు పూజ చేసి తమ ఇష్టదైవాలకు తీపి పదార్థాలను నివేదిస్తారు.



కుటుంబ పెద్దలు తమ పిల్లలకు క్రైనీట్టం (బహుమతిగా కొంత మొత్తం నగదు) అందచేస్తారు. ఇక మరాఠీలు తమ నూతన వత్సర వేడుకలను "గుడి పడ్వా" పేరుతో జరుపుకుంటారు. హిందూ మత క్యాలెండర్ ప్రకారం చైత్ర మాసం తొలిరోజును వీరు గుడి పడ్వా అని వ్యవహరిస్తారు. ఇదే రోజును ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో ఉగాది పేరుతో వేడుకలు జరుపుకుంటారు. పండుగ సన్నాహాల్లో భాగంగా వీరంతా తమ ఇళ్ళను శుభ్రం చేసుకుని రంగు రంగుల ముగ్గులతో అలంకరించుకుంటారు. కుటుంబ సభ్యులంతా ఆ రోజు కొత్త దుస్తులు ధరించి ఇష్టమైన పిండి వంటలతో రోజంతా ఉత్సాహంగా గడుపుతారు. ఈ పండుగ రోజు తెలుగు వారి మాదిరిగానే వీరు కూడా ఉగాది పచ్చడితో తమ దైనందిన కార్యక్రమాలను ప్రారంభిస్తారు. అయితే ఇందులో మనం ఉపయోగించే వేపపువ్వుకు బదులుగా లేత వేప ఆకులను వినియోగిస్తారు. ఈ రోజున వారు తమ ఇళ్ళ ముందర లేదా విశాలమైన ప్రదేశాల్లో గుడి పేరుతో ఒక స్థంభాన్ని నిలబెడతారు. దీనిపై ఇత్తడి లేదా వెండి పాత్ర (కలశం)ను బోర్లించి దానిని మామిడాకులు, పూవులు, కొబ్బరికాయలతో అలంకరిస్తారు. ఈ గుడిని చందనం, పసుపు వంటి సుగంధ ద్రవ్యాలతో అర్చించిన అనంతరం పిల్లలు, యువతీ యువకులు దాని ముందు పిరమిడ్ ఆకారంలో నిలిచి కలశం పైన వుండే కొబ్బరికాయను పగులకొట్టే ప్రయత్నం చేస్తారు. గుడి పాడ్వాను ఎంతో పవిత్రమైన రోజుగా పరిగణించే మరాఠీ ప్రజలు ఈ రోజున కొత్త కొత్త కార్యక్రమాలను ప్రారంభిస్తారు. పలువురు ఈ రోజున బంగారం, వెండి, ఆస్తుల వంటి వాటిని కొనుగోలు చేస్తారు. ఇక టిబెటన్లు లోసార్ పేరుతో జరుపుకునే కొత్త సంవత్సరాది సాధారణంగా ఫిబ్రవరి 21వ తేదీన వస్తుంది. బెంగుళూరుకు 180 కి.మీ దూరంలో వున్న బైలకుప్పె గ్రామంలో నివశించే టిబెటన్లు ఈ పండుగను వినోద భరితంగా జరుపుకుంటారు.

అయితే ఇంతకీ మనం ఏ కొత్తకు స్వాగతం చెప్పాలి?

ఇదే మన ముందున్న ప్రశ్న. ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్‌లలో రెండేళ్ళ క్రితం అమెరికా రేపిన మంటలు ఇప్పటికీ చల్లారలేదు. లక్షలాది మంది అమాయక పౌరులు, వేలాది మంది సైనికులు తమ ప్రాణాలను కోల్పోతున్నారు. ఈ దారుణ మారణకాండకు అంతం ఈ కొత్త సంవత్సరమన్నా పలుకుతుందా? అంతేకాదు చెచెన్యా, పాలస్తీనా, కాంగో వంటి ప్రదేశాల్లో ప్రజలెందరో ప్రాణాలను గుప్పిట పట్టుకుని తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. కొంతలో కొంత నయం... భారత్ పాకిస్తాన్‌లు శాంతి మంత్రాన్ని జపిస్తూ ఆ బాటలో ముందుకు సాగే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఉత్తర ఐర్లండ్, బోస్నియా, కొసావో వంటి దేశాలు కూడా ఇప్పుడు శాంతి మార్గంలో పయనించేందుకు ముందుకు వస్తున్నాయి. శాంతి బాటలో ముందుకు పోయేందుకు సాగే ఈ కృషి సత్ఫలితాలనందించేందుకు 2005వ సంవత్సరం ఓ వేదికయితే బాగుండు! బలవంతుడు బలహీనుడిని దోపిడీ చేయటానికి వీలులేని మంచిరోజు కోసం మనం "హ్యాపీ న్యూ ఇయిర్" అందాం. అందరూ శాంతియుత సహజీవనం గడిపే సరికొత్త ప్రపంచానికి, మంచి భవిష్యత్తుకు మనం స్వాగతం పలుకుదాం. మతం పేరిట జరిగే మారణహోమంలో అమాయక జీవులు ధన, మాన, ప్రాణాలను పోగొట్టుకుని అభాగ్యులుగా మిగులుతున్నారు. మతాలకు అతీతంగా మానవత్వాన్ని ఆచరిస్తూ బంగారు భవిష్యత్తును స్వాగతిద్దాం. విశ్వశాంతి కోసం విధాతను పూజించే హిందువులు దేశంలోని ఫాసిస్టు శక్తులను తరిమికొట్టేందుకు, కనీసం 2004 ఎన్నికల్లోలాగా తిరస్కరించడానికి పూనుకోవాలి. క్రీస్తు బోధనలను అనుసరించే క్రైస్తవులు విశ్వశాంతి కోసం పాటుపడాలి. శాంతి కోసం పాటుపడే బౌద్ధులు, జైనులు... ఇలా ఎందరో మానవ విలువలకు పట్టంకట్టే విధంగా ముందుకు రావాలి. అరాచకాన్ని, అకృత్యాలను తరిమి కొట్టాలి. చిన్న పిల్లలు కుటుంబ పోషణ బాధ్యతలను పంచుకునేందుకు పనులకు వెళ్లే రోజులు పోయి, తమ బాల్యాన్ని ఆనందంగా గడపగలిగే రోజులు రావాలి. రైతన్నల ఆత్మహత్యలు, నేతన్నల ఆకలి చావులు లేని మంచి రోజులు రావాలి. ఎయిడ్స్ వంటి అంటు వ్యాధుల మహమ్మారులను తరిమికొట్టి ప్రజలందరికీ సంపూర్ణారోగ్యాన్ని చేకూర్చే సరికొత్త ప్రపంచం మన ముందుకు రావాలి. ఇటువంటి శాంతియుత ప్రపంచాన్ని వాగ్దానం చేసే కొత్త సంవత్సరానికి మనం ఆనందంగా స్వాగతం చెబుదాం! మీరేమంటారు!! ✤

హ్యాపీ న్యూ ఇయర్!!

మరో కొత్త ఏడాది మన ముందుకు వచ్చేందుకు ఉవ్విళ్లూరుతోంది. మిత్రులకు, బంధువులకు, సన్నిహితులకు శుభాకాంక్షలతో గ్రీటింగ్స్ చెప్పేందుకు ఇప్పటికే అనేక మంది గ్రీటింగ్ కార్డులను సిద్ధం చేసుకుంటున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తరువాత సాంప్రదాయక గ్రీటింగ్ కార్డులకు డిమాండ్ తగ్గింది. గతంలో కొత్త ఏడాది ప్రారంభానికి రెండు నెలల ముందు నుండే షాపుల్లో గ్రీటింగ్ కార్డుల హడావుడి మొదలయ్యేది. జనవరి 1 దగ్గర పడుతున్నకొద్దీ ఈ గ్రీటింగ్ కార్డుల విక్రయాలు జోరుగా సాగేవి. దీనితో స్వల్ప కాలమే అయినా అనేక మందికి కొంత మేర ఉపాధి లభించేది. ఇప్పుడు సెల్‌ఫోన్‌ల ద్వారా ఎస్ఎంఎస్, ఇంటర్నెట్ ద్వారా ఇ-మెయిల్స్, టెలిఫోన్‌ల వంటి వాటి ద్వారా అభినందన సందేశాలు పంపటం సర్వసామాన్యంగా మారిపోయింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వచ్చి పేదల ఉపాధి తీసినందుకు విచారించాలో, ప్రజలకు సౌలభ్యాన్ని సమకూర్చినందుకు సంతోషించాలో తెలియని అయోమయ పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. ఈ గ్రీటింగ్ కార్డుల వ్యాపారంలో అటు ప్రింటింగ్ ప్రెస్‌ల వారి నుంచి రోడ్డు పక్కన అమ్ముకునే వారి వరకూ వారి స్థాయికి తగినట్లు ఎంతో కొంత ఆదాయాన్ని పొందేవారు. దీనికి సెల్‌ఫోన్‌లు గండికొట్టాయంటే అతిశయోక్తి కాబోదు.

చెరువు



ఏ అర్జునుడో లేదా రాముడో ఆగ్నేయాస్త్రం సంధించాడేమో తెలియదు, వందేళ్ళకు పైగా వయసున్న ఆ ఊరి 'శుభం చెరువు' ఎండిపోయింది. క్రమంగా అడుగంటుతున్న నీటి స్థాయిని చూస్తూ వృద్ధులు కంగారుపడ్డారు. వాళ్ళ బాల్యం నుంచి నేటి వరకు కూడా ఆ చెరువులోని అక్షయజలం కనీసం దోసెడైనా తగ్గేదికాదు. ఎన్నో రహస్యాలను తనలో దాచుకుని: ఎన్నో కార్యక్రమాలకు వేదికగా నిలిచి గతిశీలత, చల్లదనంవల్ల, పరోక్షంగా దీని ప్రభావం అనేక మందిపై పడింది. అందరికంటే ఎక్కువగా, ప్రత్యక్షంగా ప్రభావం పడినది "కొచాయి మండల్" పైనే. చెరువు ఎండిపోవడంతో ఆయన జీవితంలోని అన్ని వనరులు నశించాయి. ఆ చెరువే ఆయనకు సంజీవిని, కర్మస్థలం, జీవనాధారం అన్నీను. ఆ చెరువే లేకపోతే ఆయన కూడా లేనట్టే - వేళ్ళతో సహా పెకిలించిన మొక్కలా, కదిలిపోయిన పునాదిలా! కొచాయి కుటుంబ సభ్యులు మాత్రం శుభం చెరువు ఎండిపోవడాన్ని బాధాకరమైన సంఘటనలా కాకుండా, ఓ శుభసూచకంగా భావించడం ఆయనను మరింత కృంగదీస్తోంది.

ఆయన పెద్ద కొడుకు నిమాయి, "ఈ భూమిని ఇంతకాలానికి సక్రమంగా ఉపయోగించుకోగలుగుతున్నందుకు మనం సంతోషించాలి. దీనితో ఊరందరి మేలు ముడిపడి ఉన్నందున ఇన్నాళ్ళు ఈ భూమిని వాడుకోలేకపోయాం. చెరువు దానంతట అదే ఎండిపోయింది కాబట్టి మనల్ని కాదనే వాళ్ళుండరు. ఈ విలువైన భూమిని సొంతం చేసుకోడానికి మనకో సాకు దొరికింది. రాత్రికి రాత్రి లక్షాధికారులమై పోవచ్చు..." అన్నాడు.

తన భార్య రాధామని కూడ ఈ విషయంలో పిల్లల పక్షానే ఉందని కొచాయికి తెలుసు. ఇంకా చదువుకుంటున్న రెండో కొడుకు కూడా, వంశపారంపర్యంగా చెరువు మీద పడవ నడుపుతూ బ్రతికే తమ వృత్తిని అసహ్యించుకుంటూ... "ఈ వృత్తి మన మొత్తం వంశాన్నే తక్కువ చేసి, మనం తరతరాలుగా పేదరికంలో మగ్గేటట్లు చేసింది. చేపలు పట్టుకుని, పడవ నడిపి ఏ పూటకా పూట తిండి తప్ప మనం సంపాదించింది ఏ పాటి? నేనీ వృత్తిని మానేస్తాను. వేరే ఏదైనా పని చూసుకుంటా. నీటికి సంబంధించిన ఏ పనీ చేయను. మన అదృష్టాన్ని నేలపైన కాకుండా నీళ్ళలోనే ఎందుకు వెదుక్కోవాలి?" అని అన్నాడు.

రాధామని తన కొడుకును వెనకేసుకొచ్చింది. "మంచి నిర్ణయం తీసుకున్నావురా అబ్బాయ్! మీ నాన్న పై చేసినట్లు కాకుండా, ఆ దెయ్యం చెరువు మీ పై స్వారీ చేయకూడదనే నేనూ అనుకున్నాను. నాకెప్పుడూ అనిపిస్తూ ఉంటుంది- ఈ పెద్ద మనిషి నన్ను కాకుండా, ఆ చెరువునే పెళ్ళాడాడేమోనని! ఆ చెరువుతో నాకు సవతి పోరు తప్పలేదు. ఈయన నేలపై కన్నా, ఎక్కువ సమయం నీటిలోనే గడిపారు. నా పిల్లల్ని బాగా చదివిస్తానని, నీటికి వీలైనంత దూరంగా ఉంచుతానని నేనెప్పుడో నిర్ణయించుకున్నాను" అని అంది.

"అమ్మా, నీటి నుంచి మా దారిని మళ్ళించడంలో చదువు ఉపయోగపడితే మంచిదే. ఇప్పుడీ నేలను అమ్ముకోవాలంటే ముందుగా మనం కొంచెం ఖర్చు చేయాల్సిందే. దాదాపు ఎనిమిదిన్నర ఎకరాల భూమి మన ప్రాంతంలో లక్షలు... కాదు కాదు కోట్ల విలువ చేస్తుంది. చుట్టూ ఎన్నో కాలనీలు లేస్తున్నాయి. ఎన్నో పరిశ్రమలు వస్తున్నాయి. మనం అడిగినంత ధర ఇచ్చి తీరుతారు" చెప్పాడు నిమాయి తన ఆలోచనల గుర్రాలను మరింత వేగంగా పరుగెత్తిస్తూ.

హిందీ మూలం: జైనందన్
అనువాదం: కొల్లూరి సోమశంకర్

కొచాయికి కోపం రాదు. పైగా వాదప్రతివాదాలలో పాల్గొనడం ఇష్టం లేదు. ఇలాంటి మాటలను, చాలా శాంతంగా విని ఊరుకుంటారాయన. జరిగేది జరగక మానదని అనుకుంటూ, తన పని తాను చేసుకుపోతారు. కొచాయి తన తాతగారు రాసుకున్న డైరీ లోంచి ఓ కాగితం తెచ్చి, నిమాయికిచ్చి చదవమన్నారు. అందులో "చెరువు విలువను రూపాయలలోను, పైసలలోను లెక్క కట్టలేం. రూపాయలలో లెక్కించాలంటే, ఆ నీటి వల్ల కలిగే పరోపకారం వెల కోటానుకోట్లు ఉంటుంది. ఏదైనా బావి కాని, చెరువుగాని ఒకరి వ్యక్తిగత ఆస్తి కాదు, అది ఊరుమ్మడి ఆస్తి" అని రాసుంది.

నిమాయి ఆ కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చింపేశాడు.

"నేనెప్పటినుంచో చెబుతున్నాను... ఈ చెరువులోని నీళ్ళను తోడేసి, ఆ భూమిని అమ్ముకుంటే, ఎన్నో తరాలుగా పట్టుకున్న మన దరిద్రం వదిలిపోతుందని. కానీ మీ నాన్న పట్టుదలకి, ఆ చెరువు పట్ల ఆయనకున్న అభిమానానికి లొంగి నేనేమి చేయలేకపోయాను. మీరు ఎప్పుడు ఎదుగుతారాఅని ఎదురు చూశాను. అంతా భగవంతుని లీల! మన ప్రార్థనని మన్నించాడు. చెరువులో నీరు దానంతటదే మాయమైంది" అంది రాధామని.

తన భార్యాబిడ్డల విజయ గర్వాన్ని చూసి కొచాయి స్థాణువులా ఉండిపోయాడు. నీటితో ఎంతో అనుబంధం ఉన్న కొచాయికి ఈ పరిస్థితి ఎదురవుతుందని ఎవరూ ఊహించలేదు.

* * *

కొచాయి జీవితం నీటితో ముడిపడి ఉంది. ఆయన నేలపై కన్నా, ఎక్కువ సమయం నీటిలోనే గడిపారు. తనని తాను నీటికి కాపలాదారుగా భావించుకుంటారాయన. గ్రామస్తులంతా ఆయనను 'కప్ప' అని పిలుస్తుంటారు. నీటి లోపల లేదా నీటి పైన ఏదైనా పని చేయాల్సి వస్తే, కొచాయి కంటే ఉపయోగపడే వ్యక్తి మరొకరుండరు. చెరువులో గాని, నదిలో గాని లేదా సముద్రంలో గాని ఏదైనా దుర్ఘటన జరిగితే, కొచాయికి వెంటనే పిలుపొస్తుంది. నౌకాదళంలోని గజ ఈతగాళ్ళు కూడా సాధించలేని పనిని కొచాయి సులువుగా సాధిస్తాడని అంటుంటారు. ఈ విషయంలో ఆయన పేరు చాలా దూరం వరకు వ్యాపించింది. ఏదైనా బస్సు నదిలో పడి కొందరు గల్లంతయ్యారంటే, కొచాయికి కబురుపెడితే సరి! ఎవరైనా నదిలో దూకి ఆత్మహత్య చేసుకుని, శవం కనిపించడంలేదంటే, దాన్ని వెలికితీయడం కొచాయికి కొట్టినపిండి. ఎక్కడైనా హఠాత్తుగా వరదలు వచ్చి, నీటిలో చిక్కుకుపోయినవారిని రక్షించాలంటే, పంచె ముడేసి ఠక్కున నీళ్ళలోకి దూకేస్తాడు కొచాయి. విలువైన వస్తువేదైనా నీటిలోతుల్లో మునిగిపోతే, పాతాళంలోంచైనా దాన్ని బయటకు తీయడంలో కొచాయి నిష్ణాతులు.

నీటిలో దిగుతూనే ఆయన శక్తి పెరిగిపోతుందనే పుకారు కూడా ఉంది. నీటిలో ఆయన బాగా చూడగలుగుతారు. మైళ్ళ కొద్దీ ఈదగలరు. వాసనను బట్టి జలచరాలను గుర్తించగలుగుతారు. ఆయన శరీరానికి నీరు తగిలితేనే, విద్యుత్ లాంటి శక్తి జనిస్తుంది. అనలాయన జలచరాలలో పుట్టుండాల్సిందని, పొరపాటున మానవజన్మ ఎత్తారని కొందరు గ్రామస్థులు అంటుంటారు. ఒక జలకన్య కొచాయిని ఇష్టపడిందని, నీటిలోకి దిగగానే ఆమె ద్వారా దైవికశక్తులు కొచాయిలో ప్రవేశిస్తాయని మరికొందరు కథలల్లుతారు.

నీరు కొచాయిని వేదాంతిగా మార్చింది. ఏ విధంగా నీరుబాహ్య మలినాలను శుభ్రం చేస్తుందో, అదే విధంగా ఏ మనిషైనా ఒక వారంపాటు నీటిలో గడిపితే, అతడి మనోమాలిన్యాలు కూడా శుద్ధమైపోతాయని కొచాయి అంటాడు. దయ, కరుణ, మమత, ఆత్మీయత భావాలకు పర్యాయపదం నీరు. మనిషిని సరళంగాను, నిశ్చలంగాను చేస్తుంది. నీళ్ళలో ఎన్నో గుణాలున్నాయి. కావాలంటే ఎవరైనా నీరు మాత్రమే తాగుతూ పూర్తికాలం జీవించవచ్చు. ఎన్నో జలచరాలు ఏమీ తినకుండా, కేవలం నీరు తాగి జీవిస్తున్నాయి. నీటికి బాగా అలవాటైనవారు, దానికి దూరంగా ఉండలేరు. నీటికి దూరంగా వెడితే, ప్రాణాలు పోయినట్లు భావిస్తారు.

శుభం చెరువు కొచాయికి వారసత్వంగా వచ్చింది. ఆ చెరువు 'జమాయికేలా' సంస్థానాధీశుడు రాణా కౌతుక్ సింహ్‌దని, కొచాయి ముత్తాతైన 'సుతారు మండల్' కున్న స్వామి భక్తికి, చెరువుకి చేసిన సేవలకు సంతసించి, ఆ చెరువును 'సుతారు మండల్' కు కానుకగా ఇచ్చాడని ప్రతీతి. దాదాపు ఎనిమిదిన్నర ఎకరాల ఈ చెరువు కొండ పక్కనే ఉంది. వానాకాలంలో కొండపై కురిసే వర్షపునీరంతా ఒక కాలువగా ఏర్పడుతుంది. వానలు ముగిశాక కూడ ఈ కాలువలో నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. తన చెరువు నిండా నీరుండాలని, ఆ కాలువ దిశని చెరువు వైపు మళ్ళించారు కొచాయి. ఈ చెరువు తప్ప ఆయనకు వేరే భూమంటూ ఏదీ లేదు. ఈ చెరువే ఆయనకు ఆధారం, గుర్తింపు కూడ!

ఆ చెరువు లోతు యాభై అడుగులకి పైగా ఉంటుందని, చెరువు మధ్యలో ఒకచోటికివెడితే, ఇక తిరిగి బయటకు రాలేరని, అది పాతాళానికి దారని కొందరు అంటుంటారు. చెరువులోని నీటికి ఓ విశిష్టత ఉంది. నియమానుసారంగా ఈ చెరువులో స్నానం చేస్తే, చర్మరోగాలు మటుమాయమవుతాయని గ్రామస్తుల విశ్వాసం, కొందరైతే తమకెటువంటి చర్మరోగాలు రాకూడదని మొక్కుకుంటూ *ముందస్తుగానే* చెరువులో స్నానాలు చేసేస్తుంటారు. ఈ చెరువులో స్నానం చేస్తే, ఏ రోగమూ దరికి రాదని, సకల శుభాలు కలుగుతాయని ప్రజల నమ్మకం. అందుకని ఈ చెరువుని 'శుభం చెరువు' అని పిలవసాగారు. కొండపైనుంచి వచ్చే నీరు, తనతో పాటు వనమూలికలను చెరువులోకి తెచ్చేది



కాబోలు. అందుకే నీటికా ప్రభావం! ఐతే ప్రజలు చిన్న చిన్న విషయాలని పెద్దవి చేసేస్తుంటారు.

ఆ చెరువులో సాధారణ ప్రజలే కాక, రాణివాసపు స్త్రీలు కూడా స్నానం చేసేవారట! వారు స్నానానికి వచ్చినప్పుడు వారి సంరక్షణా బాధ్యత సుతారు మండల్‌దేనట. వారికి ఈతంటే మోజని, గంటల తరబడి చెరువులో జలకాలాడుతూండిపోయేవారని అంటుంటారు. ఆ సమయంలో ఒక్క సుతారు తప్ప అక్కడ ఎవ్వరూ ఉండేవారు కారట. సుతారు ఎటువంటి ఉద్రేకాలకు లోనవకుండా, నిర్వికారంగా కాపలా కాసేవాడట. సుతారు సత్ప్రవర్తనకి మెచ్చే కాబోలు, చెరువును బహుమతిగా ఇచ్చారు. రాచరికం ఉన్నంత కాలం, సంస్థానం వాళ్ళు ఈ చెరువునుంచే నీళ్ళు, చేపలు తీసుకెళ్ళేవారు. రాచరికం నశించాక, ఆయా ఆస్తులను తమ విశ్వాసపాత్రులకు దానం చేసి రాణా కౌతుక్‌సింహ్ భువనేశ్వర్‌లో స్థిరపడ్డారు.

సుతారు మండల్ నుంచి చెరువు బాధ్యత మూడో తరానికి చేరింది. కొచాయికి తన తాతగారి హయాం గుర్తులేదు కాని, తన తండ్రి జ్ఞాపకాలు మాత్రం ఆయనలో చాలా ఉన్నాయి. కాస్త ఊహ తెలిసినప్పటి నుంచి, తండ్రి దోసిళ్ళతో చెరువు నీరు తాగారు కొచాయి. ఈత కొట్టడం, లోతైన నీటిలో మునగడం, పడవ నడపడం, వల విసరడం వంటి విద్యలు కొచాయి తన తండ్రి వద్దే నేర్చుకున్నారు. వల లేకుండా పెద్ద పెద్ద చేపలను పట్టుకునే కళను ఆయన అభ్యసించారు. చేపల కోసం 'ఎర'లను తయారు చేయడంలోను, చేపల కూర చేయడంలోను దిట్టనిపించుకున్నాడు కొచాయి.

* * *

తమ ప్రాంతంలో వేగంగా జరుగుతున్న 'పట్టణీకరణ' వల్ల శుభం చెరువు ఉనికికి కలుగుతున్న ముప్పు పట్ల కొచాయి ఎంతో కలత చెందాడు. పిల్లల్ని ఉద్దేశించి మాట్లాడుతూ "చూడండి అబ్బాయిలూ, చెరువంటే కేవలం నీటి భాండాగారం మాత్రమే కాదు, అది మన సంస్కృతిలో ఒక భాగం! ఒక వ్యక్తికి చెందినదైనప్పటికీ, అది ఊరుమ్మడి సొత్తు, దాన్ని చుట్టు పక్కల ప్రజలందరూ వాడుకోవచ్చు. ఎవరైనా తమ భూమిలో మొక్కను నాటితే, అది పెరిగి పెద్దయ్యాక దాని నీడ, ఫలాలు అందరికీ చెందుతాయి. ఆ చెట్టు కొమ్మల మీద ఎన్నో పక్షులు గూళ్ళు కట్టుకుంటాయి. అలాగే చెరువు వల్ల చుట్టు పక్కల ప్రాంతాలలో నీటిమట్టం స్థిరంగా ఉంటుంది. చేలల్లో తడి ఉంటుంది. వాతావరణంలో తేమ ఉంటుంది. స్నానపానాదులకు తగినంత నీరు లభిస్తుంది. చేపలు దొరుకుతాయి. మనుష్యుల మధ్య సహజీవనం కొనసాగుతుంది. చెరువు పైన మనకు అధికారం ఉన్నప్పటికీ, దాన్ని మార్పు చేయడానికి గాని, నష్ట పరచడానికిగాని మనకి హక్కు లేదని రాజుగారు ఎప్పుడో చెప్పారు" అని అన్నారు కొచాయి. కొడుకులా మాటలను వినీవిననట్లుగా ఊరుకున్నారు.

కొచాయి తాత, తండ్రి రాజుగారి మాటల్ని వేదవాక్కులా పాటించారు. చెరువును తమ సొంత ఆస్తి అన్నట్లు వారెన్నడూ ప్రవర్తించలేదు. అందరినీ ఆ నీటిని వాడుకోనిచ్చేవారు. మరింత మందిని ఆకర్షించడానికి, ఆ చెరువుని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచేవారు. వారు కేవలం చేపల మీద, పడవపై గట్టు దాటించడంపైనే తమ హక్కులను ఉంచుకున్నారు.

కొండపై నుంచి వచ్చే కాలువ రోజురోజుకు క్షీణించడం గత కొద్దికాలంగా కొచాయి గమనిస్తున్నారు. కొండ పక్కన, చెరువు చుట్టుపక్కలా త్వరితగతిన విస్తరిస్తున్న జనావాసాల వల్ల, వాటిల్లో నివసిస్తున్న ప్రజల నిర్లక్ష్యం వల్ల, కొండపైనున్న ప్రకృతి సహజమైన అడవి హరించుకుపోతోంది. కొండ తన ఆకుపచ్చని చీరని పోగొట్టుకుని నగ్నంగా మారిపోయింది. కాలువ ఓ చిన్న నీటి పాయగా మిగిలిపోయింది. రాబోయే అవాంతరాన్ని కొచాయి ఊహించినా, మరీ ఇంత త్వరగా వస్తుందని మాత్రం అనుకోలేదు. పర్యావరణాన్ని నాశనం చేయడం వల్ల కలిగే ముప్పును ప్రజలు తక్కువగా అంచనా వేసిన ఫలితమిది.

శుభం చెరువు క్రమక్రమంగా ఎండిపోసాగింది. కొంతమంది ఔత్సాహికులు చెరువు గురించి ఎప్పుడూ తాము వినే కథల గురించి చర్చించుకోసాగారు. "ఇందులో ఉండే జలకన్య ఏమైందో? నీరు లేకపోవడం వల్ల చనిపోయిందా? మరి శవమేది? పాతాళానికి దారితీసే ఆ మార్గం ఏమైంది? ఎంతో పెద్దగా ఉండే చేపలేమయ్యాయి?" లాంటి

ప్రశ్నలెన్నో వారి మనసుల్లో ఉదయించాయి.

కొచాయిలో ఉదాసీనత తలెత్తింది. ఎవరితోనూ మాట్లాడడంలేదు. ఇందుకు భిన్నంగా, ఆయన కుటుంబ సభ్యులలో మాత్రం ఉత్సాహం వెల్లివిరుస్తోంది. అనేక మంది కార్లలోను, జీపులలోను వచ్చి ఆయన పెద్ద కొడుకును కలిసి వెడుతున్నారు. వాళ్ళ ఉద్దేశాలను కొచాయి గ్రహించారు. "నేను బ్రతికున్నంత వరకు చెరువు భూమిపై వేరే ఏ పనీ చేయలేరు. ఆ కాలువ తిరిగి ప్రవహిస్తుందని నా ప్రగాఢ విశ్వాసం! నేను కొండపై మొక్కలు నాటి, తిరిగి అడవి పెరిగేలా చేస్తాను" అని అంటూ తన దృఢ నిశ్చయాన్ని ప్రకటించారు. తల్లీకొడుకులు ఒకరి ముఖాలొకరు చూస్తూండిపోయారు. " ఈ మనిషికేమైనా వెర్రా" అని అనుకున్నారు. కాని నిశ్శబ్దంగా వారు సమాలోచనలు జరుపుకున్నారు.

కొచాయి వెళ్ళి చెరువుగట్టున, ఓ చెట్టు కింద కూర్చున్నారు. ఆయునకు దుఃఖం ముంచుకొచ్చింది. ఎదురుగా క్షణక్షణానికి కృశించిపోతూ, మరణానికి సిద్ధమవుతున్న ప్రియుబంధువులా చెరువు! దాహంతో చెరువు వద్దకి వచ్చి, నీళ్ళు లేకపోవడం చూసి వెనుదిరుగుతున్నాయి కొన్ని జంతువులు. జల విహారం చేసే కొన్ని పక్షులు, కొమ్మల మీద నుంచే చెరువు దుర్దశను గమనించి ఎగిరిపోతున్నాయి. చెరువులో మిగిలిన కొద్దిపాటి నీళ్ళు సరిపోక పెద్ద చేపలు గిలగిలా కొట్టుకుంటున్నాయి. ఈ ప్రళయం పట్టణంలో కొంతమందికి ఉత్సవంలా మారింది. సమయం దొరకగానే వచ్చి చేపలు పట్టుకుపోతున్నారు.

చెరువు నీటితో నిండి ఉన్నప్పుడు పరిస్థితి ఎంత భిన్నంగా ఉండేదో! కొందరు స్నానాలు చేస్తుండేవారు. కొందరు తూర్పు దిశగా ఉన్న శివాలయానికి నీళ్ళు మోస్తుండేవారు. స్త్రీలు బిందెలతో నీళ్ళు ఇంటికి తీసుకెళ్ళేవారు. పాత్రలను కడిగేవారు. పిల్లలకి సబ్బు రుద్ది రుద్దీ స్నానం చేయించేవారు. చెరువు నీటితో కొందరు పంటలు పండించుకునేవారు. చెరువులో చేపలు ఏదో రాగం వినిపిస్తున్నట్లు అటు ఇటు తిరుగుతూండేవి. కొచాయి నియమించిన నలుగురైదుగురు జాలర్లు అక్కడక్కడ వలలు విసురుతూండేవారు. ఇప్పుడిక ఇదంతా గతం!

* * *

కొచాయి బాధకి అంతే లేదు. ఐతే ఆయన కుటుంబ సభ్యులకు మాత్రం ఏ బెంగా లేదు. పైగా ఈ మధ్య మరింత నిశ్చింతగా కనబడుతున్నారు. మూడో కొడుకు, కూతురు కూడ పూర్వం లానే, ఏ బెంగా లేకుండా హాయిగా బడికి వెడుతున్నారు.

ఒక రోజు ఓ వ్యక్తి వచ్చి కొచాయిని కలిశాడు. తనని తాను పరిచయం చేసుకుంటూ ఓ 'షిప్పింగ్ కంపెనీ' యజమానినని చెప్పాడు. "నా పేరు ప్రదీప్ డోగ్రే. నాకు మీ సేవలు కావాలి. నా ఓడ ఒకటి బంగాళాఖాతంలో మునిగిపోయింది. ఆ ఓడలో బంగారు ఇటుకలున్న పెట్టెలు ఐదు ఉన్నాయి. వాటి విలువ యాభై కోట్ల రూపాయలకంటే ఎక్కువే. కొంతమంది గజ ఈతగాళ్ళు ప్రయత్నించారు. కాని వాటిని బయటకు తేలేకపోయారు. మీ గురించి మాకు ఈ మధ్యే తెలిసింది. నీటిపై మీకు పూర్తి పట్టు ఉందని విన్నాను. మీరు దేన్నైతే మనస్ఫూర్తిగా కోరుకుంటారో దాన్ని సాధిస్తారని కూడ విన్నాను. నీరు మిమ్మల్ని దగా చేయదు. మీరు ఈ సవాలును స్వీకరిస్తే, ఎంత డబ్బయినా ఇస్తాను" అని అన్నాడు.

కొచాయి తన కుటుంబ సభ్యులకేసి చూసారు. ఈ ప్రతిపాదనని అంగీకరించమని వాళ్ళందరూ చెబుతున్నట్లుగా ఆయనకి తోచింది.

"డోగ్రే గారు సరిగ్గానే చెప్పారు. ఇది మీకిష్టమైన పనే కదా. ఎలానూ మీరిప్పుడు ఖాళీగానే ఉంటున్నారుగా. వెళ్ళిరండి. మనసుకి ఉత్సాహంగా ఉంటుంది. కాస్త ఆదాయమూ వస్తుంది. పైగా ఇల్లు నడపడానికి డబ్బు కావాలిగదా..." అని అంది రాధామని.

కొచాయికి ఆమె మాటలు సబబుగానే తోచాయి. చెరువుని చూస్తుంటే దుఃఖం మరీ ఎక్కువవుతోంది. పైగా నీళ్ళలో మునగక నెలలు గడుస్తున్నాయి. దాంతో తన శరీరంలోని కణాలన్నీ నిర్జీవమైపోతున్నట్లు ఆయనకి అనిపించింది. "సరే" అని అన్నారు. డోగ్రే వెంటనే లక్ష రూపాయలకి చెక్కు రాసిచ్చాడు. కొచాయి నిర్ఘాంతపోయారు. జీవితంలో తనకెవరూ ఎప్పుడూ ఇంత మొత్తం ఇవ్వలేదు.

కొచాయిని తీసుకుని డోగ్రే బయల్దేరాడు. తమ షిప్పింగ్ కంపెనీ ప్రధాన కార్యాలయం ఉన్న ఊరికి కొచాయిని పంపించాడు. ఆ కంపెనీ ఉద్యోగులు కొందరు కొచాయిని పడవలో సముద్రంలోకి తీసుకెళ్ళారు. నీటిలో మునిగేడప్పుడు ధరించే దుస్తులు వేసుకుని, 'ఆక్సిజన్ మాస్క్' తగిలించుకుని, ఓడ మునిగిపోయిన ప్రదేశంలో దూకారు కొచాయి. ఆయన గతంలో రెండు మూడు సార్లు సముద్రంలో దూకిన సంఘటనలు ఉన్నాయి. కాని అప్పట్లో తక్కువ లోతుకి మాత్రమే వెళ్ళొచ్చారు. ఈసారి మాత్రం ఆయనను దాదాపు ఒకటిన్నర నెలలు సముద్రంలోనే ఉంచేసారు. దాదాపు 10-12 సార్లు చాలా లోతులకి వెళ్ళొచ్చారు. అక్కడి ప్రపంచం ఆయనకి ఆశ్చర్యాన్ని కల్గించింది. ఎన్నో రంగు రంగుల మొక్కలు, విచిత్రమైన జలచరాలు ఆయనకి ఆనందాన్ని కల్గించాయి. బయటి ప్రపంచం కన్నా, ఈ లోపలి ప్రపంచమే బాగుందాయనకి. తాను కూడా ఈ సముద్ర జీవుల మధ్య ఉండిపోగలిగితే ఎంత బాగుంటుందో అని అనిపించిందాయనకి. ఎంత వెదికినా, ఓడ తాలుకు అవశేషాలేవీ ఆయనకు కనిపించలేదు.

ఒకరోజు డోగ్రే వచ్చి "కొచాయి గారు, మీరు ఇక మీ ఊరికి వెళ్ళిపొండి" అని అన్నాడు. కొచాయి సిగ్గు పడుతూ, "క్షమించండి. ఎంత వెదికినా ఏమీ దొరకలేదు" అని బదులు చెప్పారు. "పరవాలేదు. మీరు సముద్రంలో గడపడం వ్యర్థం కాలేదు. మీరు నీటిలో ఉన్నప్పుడు మాకు కావల్సింది మేము పొందాము" అని అన్నాడు డోగ్రే. కొచాయికి ఏమీ అర్థం కాలేదు.

'ఇంటికి వెళ్ళాలి' అనుకోగానే, ఆయనను దిగులు ఆవరించింది. చెరువీపాటికి పూర్తిగా ఎండిపోయుంటుంది. వర్షాకాలం రాగానే కొండ మీద మొక్కలను నాటాలి, ఎంత కష్టమైనా సరే కాలువను తిరిగి ప్రవహింపజేయాలి' అని నిశ్చయించుకున్నారాయన. "చెరువును తిరిగి నీటితో నింపితేగాని నాకు మనశ్శాంతి లేదు" అని అనుకున్నారు.

ఊర్లోకి అడుగుపెడుతూనే, ఆయన పాదాలు అప్రయత్నంగా చెరువువైపు దారితీసాయి. దార్లో డజన్ల కొద్దీ డంపర్లు, బుల్‌డోజర్లు, ట్రక్కులు కనిపించాయి. ఆయన భృకుటి ముడిపడింది. చెరువును సమీపించగానే, దాని పరిస్థితి కళ్ళకు కట్టినట్లుగా కనిపించింది. ఒక ఒడ్డున 'ఈ స్థలం డోగ్రే బిల్డర్స్ మరియు కాంట్రాక్టర్స్ కు చెందినది' అని రాసున్న బోర్డు కనిపించింది. చుట్టుపక్కల ఉన్న పరిశ్రమల చెత్తతోను, పొలాలలోని మట్టి తోను చెరువును పూడ్చేస్తున్నారు. ఆ క్షణంలో చెరువును కాక, తననే సజీవ సమాధి చేస్తున్నట్లు కొచాయికి అనిపించింది. డోగ్రే మాటల అర్థం ఇప్పుడు స్ఫురించింది. బంగారం వెదకడానికి కాకుండా, తన సర్వస్వం పోగొట్టుకోడానికే సముద్రంలోకి వెళ్ళినట్లనిపించిందాయనకు. ఆయన కళ్ళ నుండి నీళ్ళు బొటబొటా కారాయి.

స్వార్థపరుల కుత్సితానికి బలై, ఆయన గుండె చెరువయ్యింది.

* * *



(నీటితో మానవులకుండాల్సిన మానవీయ సంబంధాన్ని చిత్రించిన ఈ కథలో నీరుపై వ్యక్తమయిన కొన్ని అభిప్రాయాలు రచయితవి. -సంపాదకుడు)

ఏడు లడ్డూలు

మేకల మదన్‌మోహన్‌రావు

మధ్యప్రదేశ్‌లో అదొక మారుమూల పల్లె. అక్కడ వృద్ధ దంపతులు ఇద్దరు నివసించేవారు. వారికి తీపి వంటకాలంటే మహా ఇష్టం. అందులోనూ లడ్డూలంటే మరీ మరీ ఇష్టం. ఎప్పటినుంచో లడ్డూలు చేసుకుని తినాలని వారికి కోరికగా వుంది. కానీ పేదరికం వల్ల ఆ కోరిక నెరవేరలేదు.

ఎలాగైనా సరే లడ్డూలు వండుకు తినాల్సిందేనని వారు గట్టిగా నిర్ణయించుకున్నారు. అందుకోసం పైసాపైసా కూడబెట్టారు. ఎట్టకేలకు ఒకసారి ఆ వృద్ధురాలు ఏడు లడ్డూలు చేసింది. భర్తకు మూడు పెట్టి, తన కోసం నాలుగు దాచుకుంది.

"ఇది న్యాయమేనా? నేను ఈ ఇంటి యజమానిని. నాకు మూడు లడ్డూలు ఇవ్వటమేంటి? నువ్వు నాలుగు లడ్డూలు దాచుకోవటమేంటి?" అడిగాడు భర్త.

"తయారుచేసింది నేను. కష్టపడింది నేను. కాబట్టి నాకు ఇష్టమైనన్ని తీసుకునే హక్కు నాకుంది" అంది భార్య.

అలా వాళ్లిద్దరి వాదన అంతకంతకూ పెరిగింది. ఆరోపణలు, ప్రత్యారోపణలు ప్రవాహంలా సాగాయి.

చివరకు భర్త కోపం పట్టలేక ఆమెను కొట్టబోయాడు. మళ్లీ తమాయించుకుని, "ఇక వాదన అనవసరం. నేను మాట్లాడటం ఆపిన తర్వాత ముందు ఎవరు మాట్లాడితే వారి వాటా ఇంకొకరికి దక్కుతుంది" అన్నాడు.

ఆమె 'సరే' అనబోయి, ఆగి తల వూపింది. ఆ క్షణం నుండి ఇద్దరూ మూగవాళ్లలా అయిపోయారు.

"ఒకరితో ఒకరు మాత్రమే మాట్లాడకూడదా? లేక ఇతరులతో కూడా మాట్లాడకూడదా?" అనే సందేహం ఇద్దరికీ వచ్చింది. కానీ ఎవరూ ముందుగా మాట్లాడే సాహసం చేయలేదు.

వంట చేయడానికి ముసలావిడ వంట గదిలోకి వెళ్లింది. కానీ బియ్యం నిండుకున్నాయి. ఆ సంగతి ఆమె భర్తతో చెప్పలేదు.

"ఈవెం వంట ఎందుకు చెయ్యడం లేదు?" అన్న అనుమానం భర్తకు వచ్చింది. కానీ 'నన్ను మాట్లాడేలా చెయ్యటానికే ఈ ఎత్తు వేసి వుంటుంది. నేనెందుకు అడుగుతాను' అనుకుని ఆయన తన నోటిని ఇంకా గట్టిగా మూసుకున్నాడు.

"ఎప్పుడూ ఏదో ఒక విషయంలో ముసలి వాళ్లిద్దరూ కీచులాడుకుంటూ వుంటారు. అలాంటిది ఇవాళేంటి వాళ్ల ఇంట్లో నుండి అస్సలు శబ్దమే రావడంలేదు. కారణమేంటి?" అని పొరుగువారు ఆశ్చర్యపోయారు. వాళ్లు కిటికీలో నుండి తొంగి చేస్తే భార్య ఒక మూలకు, భర్త మరో మూలకు చచ్చిన వాళ్లలా పడుకుని వున్నారు. అది చూసి తలుపులు విరగ్గొట్టి, లోపలికి వచ్చారు పొరుగువారు.

"తాతగారూ! బాగున్నారా?" అని వాళ్లు అడిగారు. కానీ ఆయన బదులు పలకలేదు.

"అవ్వా! బాగున్నావా?" అని వృద్ధురాలిని అడిగారు. ఆమె కూడా మారు మాట్లాడలేదు.

"సందేహం లేదు. వాళ్లిద్దరూ చచ్చిపోయారు. శవాలు మాత్రమే ఇలా బిర్రబిగుసుకుని వుంటాయి. చనిపోయినవారినెందరినో చూశాను" అన్నాడు ఒకతను.

'శవాలను ఇలా ఎంతకాలం ఇంట్లో పెట్టుకుంటాం. ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా వాటిని వెంటనే దహనం చెయ్యాలి' అని నిర్ణయించుకున్నారు.

భర్త పాడెను నలుగురు, భార్య పాడెను ముగ్గురు ఎత్తుకున్నారు.

(ముగింపు వాచ్చే వారం)



చిన్నారి చిత్రకారులు

మీరూ ఈ నేస్తాలకు మల్లే చక్కటి బొమ్మలు వెయ్యగలరా! మరి ఆలస్యం ఎందుకు? ఎంచక్కా వేసి మాకు పంపిస్తే ప్రచురిస్తాం. మా చిరునామా: **చిన్నారి చిత్రకారులు,** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

వి.వీరేందర్, 3వ తరగతి, సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్, నకిరేకల్, నల్గొండ.



కె.రాము, 9వ తరగతి, రెల్లవరం, వైరా, ఖమ్మం.



అల్లూరి హేమంత్, 3వ తరగతి, ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్, దామరమడుగు, నెల్లూరు.

పార్టీకి ఎందరు వెళ్లారు?

నేస్తాలూ!

ఇవాళ మీకు సవాల్ విసురుతుంది ఎవరనుకున్నారు? సాలీళ్లు. అవి మిమ్మల్ని ఏదో కష్టమైన ప్రశ్న అడుగుతాయంట. కానీ.. మీరు ఎంతటి ప్రశ్ననైనా ఊదేస్తారని వాటికేం తెలుసు. ఓకేనా.

'హేయ్! మేం ఒకసారి మా ఫ్రెండ్స్‌తో కలిసి ఓ పార్టీకెళ్లాం. మా మిత్రులు ఎవరనుకుంటున్నారా? పురుగులు. అక్కడ మ్యూజిక్ పెట్టి డాన్స్ చెయ్యమన్నారు. సరేనని మొదలెట్టాం. అంతేకాదు అదరగొట్టేశాం. మా డాన్స్ చాలా చాలా బావుందని మమ్మల్ని అంతా ఎంతగానో మెచ్చుకున్నారు. అసలు విషయం ఏంటంటే... మేం ఎందరం పార్టీకి వెళ్లామో మీరు చెప్పాలి. దీనికి ఒక క్లూ ఏంటంటే... ఒక్కో పురుగుకు ఆరు కాళ్లుంటాయి. ఒక్కో సాలీడుకు ఎనిమిది కాళ్లుంటాయి. పార్టీలో డాన్స్ చేసిన మా అందరి కాళ్లు కలిపి 48 వున్నాయి. ఇప్పుడు చెప్పండి? పార్టీకి ఎన్ని పురుగులు, ఎన్ని సాలీళ్లు వెళ్లాయి?'

ఏంటి ఇంతసేపా? వ్వె..వ్వె..వ్వె.. జవాబు కావాలంటే పుస్తకం తిరగేసి చూడండి.

జవాబు

నాలుగు పురుగులు (24 కాళ్లు), మూడు సాలీళ్లు (24 కాళ్లు) కలిసి పార్టీకి వెళ్లాయి. సరిపోయిందా!

వి'చిత్రం

చిన్నారులూ ఇవాళ్ల విచిత్రం నిజ్జంగానే ఓ విచిత్ర వుందర్రా! అదేంటంటే బొమ్మలో ఇద్దరు పిల్ల కనిపిస్తున్నారు కదా వాళ్లు ఏం చేస్తున్నారో తెలుసా చంకల బిడ్డను పెట్టుకు ఊరంతా వెతికినట్టు తమ తాతయ్యని ఎదురుగా వుంచుకు కొండలు, గుట్టలు వెతుకుతున్నారు. పాపం వాళ్లకు మీరేమైనా సాయ చెయ్యకూడదూ! ఏంటీ మీక్కూడా వాళ్ల తాతయ్య కనిపించలేదా! అయితే మ సమాధానం చదవండి.

జవాబు

చిన్నారులూ... పేజీ తిరగేసి చూస్తే తాతయ్య కనిపిస్తాడు. కనిపించాడా! తాతయ్య గడ్డం మీదే పిల్లవాడు కూర్చుని వెతుకుతున్నాడుకదా.

అంతర్జాతీయం



రోవర్ తీసిన అంగారక గ్రహం భూమి

జనవరి :

4 : అమెరికా అంతరిక్ష పరిశోధనా కేంద్రం (నాసా) ఒక మరమనిషిని ఉంచి ప్రయోగించిన నౌక ఉదయం గం॥ 10.22లకు ఎర్రగ్రహం అంగారక గ్రహంపై దిగింది.
– ఇస్లామాబాద్‌లో 12వ సార్క్ సమావేశాలు ప్రారంభం.
– ఇస్లామాబాద్‌లో జరుగుతున్న సార్క్ సమావేశాల్లో ప్రధాని వాజ్‌పాయ్, పాకిస్థాన్ అధ్యక్షుడు పర్వేజ్ ముషరఫ్ మర్యాదపూర్వక కలయిక.

8 : చమురు ఆదాయాన్ని సమానంగా పంచుకోవాలని సూడాన్‌లో ప్రభుత్వానికి, తిరుగుబాటుదార్లకు మధ్య కుదిరిన ఒప్పందం.

12 : మెక్సికోలో లాటిన్ అమెరికా దేశాల సదస్సు. దానిముందు లక్షలాదిమంది ప్రపంచీకరణ వ్యతిరేక కార్యకర్తల నిరసన.

13 : అంగారకగ్రహంలో నీటి అవశేషాలున్నాయని ఫొటోలు పంపిన అమెరికా రోవర్.

18 : బాగ్దాద్‌లోని అమెరికా సైనిక కార్యాలయం ఎదుట శక్తివంతమైన బాంబు పేలుడు. ఇద్దరు అమెరికన్లతో సహా 18మంది మృతి.

24 : ఇరాక్‌లో ఆయుధ తనిఖీ బృందానికి నాయకత్వం వహించిన డేవిడ్ కే రాజీనామా. సద్దాం వద్ద ఏ విధ్వంసక ఆయుధాలూ లేవని కే ప్రకటన.

25 : దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం నిరర్థకం అంటూ పెద్దఎత్తున నిరసన. భద్రతాదళాల మోహరింపు.

27 : బ్రిటిష్ బ్రాడ్ కాస్టింగ్(బిబిసి)లో ప్రసారం అయిన ఇరాక్ వార్తా కథనంపై రేగిన వివాదం. ఛీఫ్ గెవ్నె డెవిస్ రాజీనామా.

31 : హజ్ యాత్ర సందర్భంగా మక్కాలో తొక్కిసలాట. 244మంది దుర్మరణం. మృతుల్లో ఇద్దరు భారతీయులు.

ఫిబ్రవరి :

1 : హజ్ యాత్రలో జరిగిన తొక్కిసలాటలో 13మంది భారతీయులతో సహా 251మంది మృతి

6 : సెంట్రల్ మాస్కో మెట్రోరైల్వేకు చెందిన రైల్లో బాంబుపేలి 40మంది మృతి

12 : ప్రతిపక్షాలు ఇచ్చిన బంగ్లాదేశ్ బంద్ పిలుపులో హింసాత్మక సంఘటనలు

14 : ఇరాక్‌లో తిరుగుబాటుదార్ల చేతిలో 21మంది మృతి : 20మంది ఖైదీలకు స్వేచ్ఛ

16 : భారత్-పాక్ చర్చలు ప్రారంభం

24 : రష్యా ప్రభుత్వాన్ని అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బర్తరఫ్ చేసి తాత్కాలిక ప్రధానిగా క్రిస్తెంకోను నియమించారు.
–మొరాకోలో తీవ్ర భూకంపం : 300మంది దుర్మణం

27 : ప్రపంచంలోని శతకోటీశ్వరుల జాబితాను విడుదల చేసిన ఫోర్బ్స్ మాగజైన్. ప్రపంచ ధనవంతుడు బిల్‌గేట్స్, ఆసియాలో ధనవంతుడు సౌదీ అరేబియా యువరాజు బిన్ తలాన్ అస్లాద్, భారత్‌లోకెల్లా ధనవంతుడు విప్రో సంస్థ అధినేత ప్రేమ్‌జీగా ప్రకటన. జాబితాలో 'హరీపోటర్' రచయిత్రి జె కె రోలింగ్



మార్చి :

1 : రష్యా అధ్యక్షునిగా మైఖేల్ ఫ్రెడ్‌కోవ్‌ను నియమించిన దేశాధ్యక్షుడు పుతిన్
– 'ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్' చిత్రానికి 11 ఆస్కార్ అవార్డులు

2 : ఇరాక్‌లోని మొహర్రంపై అమెరికా జరిపిన బాంబింగ్‌లో 124 మంది మృతి
– పాలస్తీనా పాలిత ప్రాంతమైన గాజాలో అధ్యక్షుడు యాసర్ అరాఫత్ సలహాదారుడు జెబిన్‌ను కాల్చి చంపిన సాయుధ వ్యక్తులు

3 : అమెరికా అధ్యక్షుడు బుష్‌కు ప్రత్యర్థి అభ్యర్థిగా డెమొక్రటిక్ పార్టీ జాన్ కెర్రీగా ప్రకటన.

4 : ఇరాక్‌కు తమ దళాలను పంపబోమని రష్యా ప్రకటన

6 : క్వాలిఫైయింగ్ హాకీ టోర్నీలో పాక్ చేతిలో భారత్ ఓటమి

7 : సంస్కరణలకు వ్యతిరేకంగా టర్కీలో భారీ ప్రదర్శన.

12 : 192 మంది మృతికి కారణమైన మాడ్రిడ్ పేలుళ్ళకు తామే బాధ్యులమని ఆల్‌ఖైదా నెట్‌వర్క్ ప్రకటన

13 : పద్నాలుగేళ్ళ అనంతరం ఇటు భారత్‌లోనూ, అటు పాకిస్తాన్‌లోనూ ఎంతో ఉత్కంఠ రేకెత్తించిన తొలి వన్డే క్రికెట్ భారత్ వశం

20 : ఇరాక్‌పై అమెరికా దాడి జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రపంచం అంతటా అనేక దేశాల్లో నిరసన ర్యాలీలు

ఏప్రిల్ :

2 : ముల్తాన్‌లో పాకిస్తాన్‌పై భారత్ టెస్టు విజయం
– శ్రీలంక ఎన్నికలు

5 : ముషరాఫ్‌పై హత్యాయత్నం కేసులో ఇరువురి సైనికుల అరెస్టు

10 : తమిళపులుల్లో వర్గపోరు, చీలిక వర్గాల మధ్య యుద్ధం : తొమ్మిదిమంది మృతి

13 : టెస్టు క్రికెట్‌లో ఇంగ్లాండ్‌పై లారా రికార్డు 400 నాటవుట్

23 : మైకేల్ జాక్సన్‌పై అత్యాచారంకేసు నమోదు

మే :

8 : బాగ్దాద్‌లోని అబూగ్రాయిబ్ జైల్లో ఇరాకీ ఖైదీలను క్రూరహింసలు పెట్టిన అమెరికా జవాన్లు. ప్రపంచ వ్యాప్తంగా సంచలనం.
–శ్రీలంక ఆఫ్ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ 521 వికెట్లు సాధించి టెస్టుల్లో అత్యధిక వికెట్లతో ప్రపంచ



రికార్డు.
9 : చెచెన్యా స్టేడియంలో భారీ విస్ఫోటనం. అధ్యక్షులు కదిరోవ్‌తో సహా 23 మంది మృతి.
10 : వెనిజులా అధ్యక్షులు హ్యూగో చావెజ్‌ను హతమార్చడానికి జరిగిన కుట్ర భగ్నం.
28 : పాకిస్తాన్‌లో 1500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే మధ్యశ్రేణి క్షిపణి ఘోరి ప్రయోగం విజయవంతం.
-ఇరాక్ ప్రధానిగా అయిద్ అలావి.
29 : సౌదీలో అల్‌ఖైదా పంజా : ఒక భారతీయుడు సహా ఏడుగురు విదేశీయులహత్య

జూన్ :

2 : ఇరాక్ అధ్యక్షునిగా అమెరికా కీలుబొమ్మ ఘూజీ ఎవార్ ఎన్నిక.
7 : అమెరికా మాజీ అధ్యక్షుడు రోనాల్డ్ విల్సన్ రీగన్ కన్నుమూత.
25 : మైఖేల్ మూర్ నిర్మించిన 'ఫారన్‌హీట్ 9/11' సినిమా 900 థియేటర్లలో విడుదల. ఈ సినిమాపై అమెరికా అధికారపక్షం ఆగ్రహం.

జులై :

1 : సద్దాంపై న్యాయ విచారణ ప్రారంభం. అసలు నేరస్తుడు బుష్షేనన్న సద్దాం.
3 : వింబుల్డన్ ఫైనల్‌లో షరపోవా (రష్యా) విజయం. సెరీనా (అమెరికా) పరాజయం.
5 : ఇండోనేషియాలో తొలిసారిగా ప్రత్యక్ష పద్ధతిలో అధ్యక్ష ఎన్నికలు.
11 : అమెరికా సుప్రీం కోర్టులో సద్దాం కేసు
21 : ఇరాక్‌లో ముగ్గురు భారతీయుల నిర్బంధం

ఆగస్టు

3 : చైనాలో డెంగ్‌సియావో పెంగ్ శతజయంత్యుత్సవాలు ప్రారంభం
14 : ఏథెన్స్‌లో కన్నులపండువగా ప్రారంభమైన ఒలంపిక్స్. 29 వరకు
17 : వెనిజులాలో రిఫరెండం- అధ్యక్షుడు ఛావెజ్‌కే మెజార్టీ
19 : ఏథెన్స్‌లో డోప్‌టెస్టులో దొరికి భారత వెయిట్‌లిఫ్టర్లు ప్రతిమ, సనమాచ చాను
30 : న్యూయార్క్ సహా 50 నగరాల్లో సామ్రాజ్యవాద

2004 రౌండప్

నోబెల్ బహుమతి గ్రహీత వాంగరి మాథాయి

చైనా విప్లవ దినోత్సవ వేడుకలు

వ్యతిరేక ప్రదర్శనలు

సెప్టెంబర్ :

1 : ఇరాక్‌లో కిడ్నాపర్ల చెరలో మగ్గుతున్న ముగ్గురు భారతీయ బందీలు విడుదల.
3 : చెచెన్యాలో ఉగ్రవాదుల ఘాతుకానికి 150 మంది మృతి.
9 : పాక్‌లో ఉగ్రవాద శిబిరంపై దాడి, 80 మంది మృతి.

అక్టోబర్ :

2 : చైనాలో ఘనంగా విప్లవ దినోత్సవ వేడుకలు.
5 : బ్రెజిల్‌లో జరిగిన స్థానిక ఎన్నికల్లో లూలా నేతృత్వంలోని వర్కర్స్ పార్టీ జయకేతనం.
8 : ఇరాక్‌లో వినాశకర ఆయుధాలు లేవని అమెరికా తనిఖీ ఇన్‌స్పెక్టర్ చార్లెస్ డ్యూయల్ఫర్ ప్రకటన.
9 : కెన్యా పర్యావరణ ఉద్యమకారిణి వాంగరి మాథాయికి ఈ సారి నోబెల్ "శాంతి" బహుమతి.
19 : బిబిసి జర్నలిస్టు హత్యకు బ్లెయిర్ కుట్ర
27 : క్యూబాలో డాలర్ల చలామణి నిలిపివేస్తాం. అమెరికాకు కాస్ట్రో హెచ్చరిక.

నవంబర్ :

1 : ఉరుగ్వే అధ్యక్ష పదవిని చేపట్టిన తొలి వామపక్ష నేత బారే వాఝెజ్
3 : అమెరికా అధ్యక్షునిగా మళ్ళీ ఎన్నికైన జార్జి బుష్
7 : ఇరాక్‌లో ఎమర్జెన్సీని విధించిన తాత్కాలిక ప్రభుత్వం
11: పాలస్తీనా విమోచన పోరాటయోధుడు యాసర్ అరాఫత్ మృతి
15 : అమెరికా విదేశాంగ మంత్రి కొలెన్ పావెల్ రాజీనామా

డిసెంబర్ :

10 : ఢాకాలో బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో 435వ వికెట్ తీసుకుని కపిల్ రికార్డును అధిగమించిన భారత్ బౌలర్ అనిల్ కుంబ్లే
13 : బాగ్దాద్, ఫిలిప్పీన్స్‌లలో బాంబు పేలుళ్ళు-28 మంది మృతి
16 : బ్రిటన్ హోంమంత్రి డేవిడ్ బ్లంకెట్ రాజీనామా

న్యాయ విచారణ ఎదుర్కొంటున్న సద్దాం హుస్సేన్



జాతీయం

జనవరి :

1 : రెండు సంవత్సరాల నిషేధం అనంతరం పాకిస్తాన్ నుండి భారతదేశ విమానాశ్రయంలో దిగిన విమానం. 2001లో పార్లమెంట్‌పై తీవ్రవాద సంస్థలు లష్కరే తొయిబా, జైషే మహ్మద్ చేసిన బాంబు దాడితో వైమానిక సంబంధాలు తెగిపోయాయి.

12 : కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డే మృతి.

16 : 'మరో ప్రపంచం సాధ్యమే...అది మనదే' అంటూ డబ్ల్యుఎస్ఎఫ్ సభలు ముంబయిలో ప్రారంభం.

–ఉపాధ్యాయుల గ్రాట్యుటీ చెల్లింపును తిరస్కరిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని వ్యతిరేకించిన తొమ్మిది కార్మికసంఘాలు.

23 : తమిళనాడులోని శ్రీరంగంలో పెళ్ళిపందిరి నిప్పంటుకుని వరుడుతో సహా 52మంది దుర్మరణం.

– ఒరిస్సాలోని బాలాసోర్–చాందీపూర్ నుండి మధ్యంతర క్షిపణి 'పృథ్వి' ప్రయోగం విజయవంతం.

24 : నార్లికర్,వెంకటాచలయ్యలకు పద్మభూషణ్, గంగూలీ, ద్రావిడ్, సినీనిర్మాత గుల్జార్, అంజూ జార్జ్ తదితరులకు పద్మశ్రీ అవార్డుల ప్రకటన.

– మూడుముక్కలుగా చీలిన నేషనల్ కాంగ్రెస్ పార్టీ. చీలిక గ్రూపు నేత సంగ్మా.



25 : గణతంత్ర వేడుకలకు ఢిల్లీ వచ్చిన బ్రెజిల్ నేత లూలాతో కుదిరిన ఇరుదేశాల ప్రపంచ వాణిజ్య ఒప్పందం

– 96మందికి పద్మ విభూషణ్ అవార్డులను ప్రకటించిన రాష్ట్రపతి. ఆంధ్రప్రదేశ్‌కు ఐదు పద్మాలు.

29 : బర్డ్ ఫ్లూ భయంతో పౌల్ట్రీ దిగుమతులపై నిషేధం.

ఫిబ్రవరి :

4 : బోఫోర్స్ కేసులో రాజీవ్ నిర్దోషని ఢిల్లీ హైకోర్టు తీర్పు.

6 : లోక్‌సభ రద్దు.

–కోరాపుట్ జిల్లాలో నక్సల్స్ బీభత్సం. జైలు, ఎస్.పి. ఆఫీసు, ఠాణాలపై దాడులు. కానిస్టేబుల్ మృతి. జైలు ఎస్‌పికి గాయాలు. 200 ఆయుధాలు లూటీ

8 : హాకీ ఆసియాకప్‌ను తొలిసారి గెల్చుకున్న భారత మహిళా జట్టు

9 : ఎన్‌టిపిసి, మరో రెండు విద్యుత్ ప్రాజెక్టులను జాతికి అంకితమిచ్చిన ప్రధాని వాజ్‌పేయి.

10 : ఒరిస్సాలోని జగత్‌పూర్ జిల్లా కిల్వాలా గ్రామంలో క్రైస్తవ మహిళలపై దాడి. ఏడుగిరికి శిరోముండనం.

– తొలగించిన తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వోద్యోగులను పునర్నియమించడానికి, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు 3శాతం కరువు భత్యం పెంచడానికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జయలలిత అంగీకారం.

16 : మేనక, వరుణ్ బిజెపిలో చేరిక

21 : సానియా, లీజెల్‌హ్యూబర్ జోడీకి టెన్నిస్ డబుల్స్ టైటిల్

24 : కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మె విజయవంతం.

26 : కేంద్ర మాజీ మంత్రి శంకర్‌రావు భావూరావు (ఎస్‌బి) చవాన్ మృతి

28 : తాజ్‌మహల్‌కు 350 వసంతాలు

29 : ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన ఎన్నికల కమిషన్. అంతటా ఎలక్ట్రానిక్ ఓటింగ్ ఉపయోగిస్తామని ప్రకటన

మార్చి :

1 : లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం

– కాంగ్రెస్‌కు కర్నాటక మాజీ ముఖ్యమంత్రి బంగారప్ప రాజీనామా

– వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో భారత మహిళా క్రికెట్ జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం.

4 : కర్నాటక మాజీ ముఖ్యమంత్రి బంగారప్ప బిజెపిలో చేరిక

5 : ప్రపంచ షూటింగ్‌లో అంజలీ భగవత్‌కు కాంస్యపతకం

6 : ఎన్నికల ప్రచారం చేసుకోవడానికి ఎండిఎంకె ప్రధాన కార్యదర్శి వైగోకి పోటా కోర్టు అనుమతి.



9 : ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సినీనటి, మాజీ రాజ్యసభ సభ్యురాలు జయప్రద ములాయంసింగ్ యాదవ్ సమక్షంలో సమాజ్‌వాది పార్టీలో చేరిక.

13 : కేంద్ర మాజీ మంత్రి, ఒకనాటి సీనియర్ కాంగ్రెస్ నాయకులు విసి శుక్లా బిజెపిలో చేరిక

17 : దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న సిపిఎం ఎన్నికల ప్రణాళిక విడుదల

25 : విశ్వకవి, మానవతావాది రవీంద్రనాథ్‌టాగూర్ నోబెల్ బహుమతి కలకత్తాలోని శాంతినికేతన్ నుంచి చోరీ

27 : దొంగిలించిన వ్యక్తి బరయ్‌పరాలో అరెస్ట్

ఏప్రిల్ :

1 : గురుచరణ్ తోహ్రా కన్నుమూత

–దాణాస్కాంలో దోషులుగా 9మంది –సిబిఐ ప్రత్యేక కోర్టు తీర్పు.

–6.5 శాతానికి పెరిగిన విదేశీరుణభారం



5 : కుంబమేళాలో 18 లక్షల మంది పవిత్ర స్నానాలు

7 : రాయ్‌బరేలీలో సోనియా నామినేషన్ దాఖలు

8 : ముగిసిన నామినేషన్ల ఘట్టం

13 : ఉత్తర ప్రదేశ్‌కు చెందిన బిజెపి

నాయకుడు లాల్జీ టాండన్ జన్మదినం సందర్భంగా చీరలు పంపిణీలో తొక్కిసలాట. 21 మంది మహిళలు, ఒక బాలుని మృతి, పలువురికి గాయాలు.

-బెస్ట్ బేకరీపై మోడీ సర్కారుపై సుప్రీం కోర్టు చీవాట్లు, గుజరాత్ హైకోర్టుకూ అక్షింతలు. మళ్లీ మహారాష్ట్రలో దర్యాప్తు జరపాలని కోర్టు ఆదేశం.

- వాజ్‌పేయికి, అద్వానీకి మధ్య విభేదాలు ఉన్నాయని వాజ్‌పేయి ఒప్పుకోలు.

18 : హెలీకాప్టర్ ప్రమాదంలో సినీనటి సౌందర్య దుర్మరణం.

25 : ముగిసిన ఎన్నికల ప్రచారం

మే :

5 : ఈ ఏడాదికే మొదటిదైనా సంపూర్ణ చంద్రగ్రహణం యావత్ భారతదేశానికే కనువిందు.



13 : లోకసభ ఎన్నికల్లో ఎన్‌డిఏ అవజయం - వాజ్‌పేయి రాజీనామా.

-నాలుగు దేశాల హాకీ టోర్నీలో జపాన్‌పై భారత్ విజయం - కుప్పకూలిన స్టాక్ మార్కెట్ -329.6 పాయింట్లకు పడిపోయన సెన్సెక్స్ - ఒక్కరోజులో లక్షకోట్ల రూపాయల నష్టం.- రూపాయి విలువ 34 పైసల క్షీణత.

17 : ప్రభుత్వంలో చేరం అని వామపక్షాల ప్రకటన- బయటినుండే మద్దతు

18 : ప్రధాని పదవిని తిరస్కరించిన సోనియా.

- తమిళనాడు అన్నాడిఎంకే అధినేత జయలలిత ఉద్యోగులపై కేసులను ఉపసంహారణ.

23 : మెదడువాపు వ్యాధి నిరోధానికి వ్యాక్సిన్‌ను భారత శాస్త్రవేత్తలు రూపకల్పన.

25 : లోక్‌సభ స్పీకర్‌గా సిపిఎం ఎంపి సోమనాథ్ ఛటర్జీ ఎంపిక

-సిపిఎం పార్లమెంటరీ పార్టీ నేతగా వాసుదేవాచార్య ఎన్నిక

26 : సిఎంపి ఖరారు

27 : యుపిఎ కనీస ఉమ్మడి ప్రణాళిక విడుదల

28 : నింగికెగిసిన దేశీయ తొలి ప్రయాణీకుల విమానం సరస్.

- సామాజిక ప్రచార ఉద్యమంలో కృషి, అహింసాయుత పోరాటాలను ప్రోత్సహించినందుకుగాను ప్రముఖ నవలా రచయిత, మానవ హక్కుల కార్యకర్త అరుంధతిరాయ్ 2004 సిడ్నీ శాంతి బహుమతికి ఎంపిక.

జూన్ :

1 : వజ్రాల గనులనుతవ్వుకునేందుకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం బహుళజాతి సంస్థలకు అనుమతి.

-బిజెపి పార్లమెంటరీ నేతగా అద్వానీ ఎన్నిక

2 : 14వ లోక్‌సభ సమావేశాలు ప్రారంభం

4 : లోక్‌సభ స్పీకరుగా సిపిఎం నేత సోమనాథ్ ఛటర్జ ఎన్నిక.



10 : 1964 తర్వాత ఢిల్లీలో ఒలింపిక్ టార్చ్(జ్యోతి) రిలే.

15 : పెట్రో , గ్యాస్ ధరల పెంపు

30 : రాహుల్‌ద్రావిడ్ పద్మశ్రీ అవార్డు.

జులై :

1 : ఆత్మహత్యకు పాల్పడ్డ రైతు కుటుంబాలను పరామర్శించేందుకు ప్రధాని మన్‌మోహన్ సింగ్ కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పర్యటన.

2 : గోవా, గుజరాత్, హర్యానా, ఉత్తర ప్రదేశ్ గవర్నర్ల బర్తరఫ్

3 : పశ్చిమ బెంగాల్ స్థానిక సంస్థల ఎన్నికల్లో లెఫ్ట్ ఘన విజయం.



5 : పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం - తొలిరోజే కళంకిత మంత్రుల వ్యవహారంపై బిజెపి రగడ.

8 : పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి చిదంబరం.

9 : బెంగాల్ భూసంస్కరణలకు ఐక్యరాజ్య సమితి ప్రశంసలు.

16 : తమిళనాడు కుంభకోణం పాఠశాలలో అగ్ని ప్రమాదం - 83 మంది బడిపిల్లలు సజీవ దహనం

-ముస్లిం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే

-మణిపూర్‌లో సైన్యం వివాదం - మహిళల ఆగ్రహం - నగ్న ప్రదర్శన

17 : అత్యధిక వికెట్లు (316) తీసుకున్న భారత క్రికెటర్‌గా కుంబ్లే రికార్డు

19 : భోపాల్ బాధితులకు 1503 కోట్లు - సుప్రీం ఆదేశం

22 : ముస్లిం రిజర్వేషన్లకు హైకోర్టు బ్రేక్

ఆగస్టు :

14 : ధనంజయకు ఉరి

15 : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 1050మంది ఖైదీల విడుదల

18 : పార్లమెంటులో కొనసాగిన సావర్కర్ వివాదం

20 : హుబ్లీ న్యాయస్థానం నాన్‌బెయిలబుల్ వారెంట్. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఉమాభారతి తన పదవికి రాజీనామా.

23 : మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాబూలాల్ మరాండీ ఎన్నిక

24 : హుబ్లీకి రైల్లో బయల్దేరిన ఉమ- ఉద్రిక్తత- హుబ్లీలో నిషేధాజ్ఞలు

29 : కేరళ కాంగ్రెస్‌లో సంక్షోభం, ముఖ్యమంత్రి ఆంటోనీ రాజీనామా

సెప్టెంబర్ :

8 : 'ప్లేయర్ ఆఫ్ ది ఇయర్'గా క్రికెటర్ ద్రావిడ్‌కు గ్యారీ సోబర్స్ అవార్డ్



15 : లాంగ్ జంపర్ అంజూ బాబి జార్జ్‌కి రాజీవ్ ఖేల్ రత్న. హంపి, మిథాలీతోపాటు 13 మందికి అర్జున అవార్డుల ప్రకటన.

20 : స్వామి అగ్నివేశ్, అస్గర్ అలీ ఇంజనీర్‌లకు 'రైట్ లైవ్లీ హుడ్' అవార్డులు.

21 : ముస్లిం రిజర్వేషన్ చెల్లదని, రాష్ట్ర ప్రభుత్వ జివోను హైకోర్టు కొట్టివేసింది.

22 : షిల్లాంగ్‌లో హెలికాప్టర్ కూలి



మేఘాలయ మంత్రి సైప్రయన్ సంగ్మా, ఇద్దరు ఎమ్మెల్యేలతోసహా పది మంది మృతి.

28 : ప్రముఖ రచయిత ముల్క్‌రాజ్ ఆనంద్ మృతి.

అక్టోబర్ :

1 : ఏ.కె. గోపాలన్ శతజయంతి.

3 : ఈశాన్య రాష్ట్రాల్లో నిషేధిత నేషనల్ డెమోక్రాటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడొలాండ్ ఉగ్రవాదులదాడిలో 65 మంది దుర్మరణం.

6 : ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో నివాసాల మధ్య ఉన్న పరిశ్రమల తరలింపునకు నిరసనగా ఢిల్లీలో పరిశ్రమల యజమానుల ధర్నా. విపిసింగ్, ఏచూరి అరెస్టు.

–మహారాష్ట్ర ఎన్నికలకు

10 : ఐద్వా రాష్ట్ర పదో మహాసభలు ప్రారంభం.

14 : కేంద్రఫిలిం సెన్సార్ బోర్డు చైర్మన్ అనుపమ్ ఖేర్‌పై వేటు, కొత్త చైర్మన్‌గా షర్మిలా ఠాగూర్.

17 : మహారాష్ట్రలో ఎన్.సి.పి. కాంగ్రెస్ కూటమి విజయం.

19 : బి.జె.పి. అధ్యక్ష్య పదవి నుండి వైదొలగిన వెంకయ్యనాయుడు.

–అడవి దొంగ వీరప్పన్ మృతి.

– బి.జె.పి. అధ్యక్ష్యునిగా అద్వానీ మూడోసారి బాధ్యతల స్వీకరణ.

27 : భోపాల్ బాధితులకు నష్ట పరిహారం పంపిణీకి సుప్రీం గ్రీన్ సిగ్నల్.

నవంబర్ :

1 : మహరాష్ట్ర ముఖ్యమంత్రిగా విలాసరావు దేశ్‌ముఖ్ ప్రమాణస్వీకారం

3 : తమిళనాడు గవర్నర్‌గా సూర్జిత్‌సింగ్ బర్నాలా ప్రమాణస్వీకారం

4 : పెరిగిన పెట్రో ధరలు

5 : ఎస్సీ వర్గీకరణ చెల్లదని తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు

10 : ఉమాభారతిని ఆరుసంవత్సరాలు పార్టీ నుండి సస్పెండ్ చేసిన బిజెపి నాయకత్వం

11 : హత్యకేసులో కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి అరెస్టు



17 : భువనేశ్వర్‌లో ప్రారంభమయిన ఐద్వా జాతీయ మహాసభలు

23 : రెండురోజుల పర్యటన నిమిత్తం భారత్ చేరుకున్న పాక్ ప్రధాని షౌకత్ అజీజ్

24 : రిలయెన్స్ అధినేతలు, సోదరులు అయిన ముఖేష్ అంబానీ, అనిల్ అంబానీల మధ్య విభేదాలు

27 : మహారాష్ట్ర గవర్నర్‌గా ఎస్ ఎం కృష్ణ నియామాకం

–కేంద్ర మంత్రివర్గ విస్తరణ: సిబూ సోరెన్‌కు మంత్రిపదవి

29 : గోవాలో మొదలైన అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు

30 : కొచ్చిలో జరిగిన ప్రపంచ జూనియర్ చదరంగం పోటీల్లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు పి.హరికృష్ణకు ఛాంపియన్‌షిప్

డిసెంబర్ :

1 : పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మొదలు

3 : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్ పర్యటన

5 : సిపియం కేంద్రకమిటీ సభ్యులు, తెలంగాణా పోరాట యోధులు కామ్రేడ్ మల్లు వెంకట నరసింహారెడ్డి(వి ఎన్) మృతి

6 : తెహల్కా కేసులో బంగారు లక్ష్మణ్, జయా జైట్లీలపై ఎఫ్.ఐ.ఆర్.లు నమోదు చేసిన సిబిఐ

10 : రాజీవ్ హత్యలో చంద్రస్వామి హస్తం ఉందని సిబిఐ సంచలన ప్రకటన

11 : కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎంఎస్ సుబ్బులక్ష్మి మృతి

14 : పంజాబ్‌లో రెండు రైళ్ళు ఢీ- 38 మంది మృతి

15 : ప్రభుత్వం–మావోయిస్టుల మధ్య చర్చల అనంతరం మొదటిసారిగా విశాఖజిల్లాలో పేలిన మందుపాతర

16 : సామ్రాజ్యవాదం, యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో యంటీ వార్ అసెంబ్లీ

19 : కంచి వరదరాజ్ పెరుమాళ్ దేవస్థానం మేనేజర్ శంకర్ రామన్ హత్యకేసులో ప్రధాన నిందితునిగా భావించబడుతున్న అప్పు అలియాస్ కృష్ణస్వామి చిత్తూరుజిల్లా బాలకృష్ణాపురంలో పోలీసులకు లొంగుబాటు



కంచి స్వామీ జయేంద్ర హత్యా నేరంపై అరెస్ట్



గంధపు చెక్కల వీరప్పన్ హతం

రాష్ట్రీయం

జనవరి : 8 : వరదనీటి వల్ల దెబ్బతిన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రం పునఃప్రారంభం. గవర్నర్ సూర్జిత్‌సింగ్ బర్నాలా ప్రారంభించారు.

9 : గుంటూరుజిల్లా చుందూరులోనే కోర్టుపెట్టి విచారణ చేయాలని ప్రత్యేక జడ్జీ ఇచ్చిన తీర్పు చెల్లదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ. జిల్లాకోర్టులోనే విచారణ జరపాలని ఆదేశం.

17 : విజయనగరం జిల్లా సాలూరులో పోలీసుకాల్పులు. ఇద్దరు మృతి. ఎస్సై సస్పెన్షన్.

23 : హైకోర్టు ఆదేశం మేరకు కమిటీ నిర్ణయాన్ని ప్రభుత్వం అంగీకరించడంతో 42 రోజులపాటు సాగిన జూనియర్ డాక్టర్ల సమ్మె విరమణ.

28 : హైదరాబాద్‌లో జరిగిన సిపియం కేంద్రకమిటీ సమావేశాలు.

ఫిబ్రవరి :

5 : కాంగ్రెస్‌కు మైసూరారెడ్డి రాజీనామా

-మేడారం జాతరలో ఐదుగురి మృతి

7 : ఆంధ్రాలో ప్రధాని వాజ్‌పేయి ఎన్నికల ప్రచారం

10 : విజయవాడ నగర కమ్యూనిస్ట్ ఉద్యమంలో కీలకపాత్ర వహించిన సిపిఎం సీనియర్ నాయకులు పి.దివాకర్ కన్నుమూత

-స్టాంపుల స్కాంలో ఐఎఎస్ అధికారి కె.నర్సింహారావు అరెస్టు

11 : పుట్టపర్తిలో ప్రధాని వాజ్‌పేయి, ముఖ్యమంత్రి చంద్రబాబు ఏకాంతచర్చలు

12 : సత్యసాయిబాబాను దర్శించుకున్న ప్రధాని వాజ్‌పేయి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.

14 : నక్సలైట్లపై ప్రజలు తిరగబడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు, అవసరమైతే ప్రజలకు ఆయుధాలు ఇస్తామని ప్రకటన

16 : కాంగ్రెస్‌లో తెలంగాణా కాంగ్రెస్ విలీనం

20 : ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, కర్నాటక, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్-మే నెలల్లో నాలుగు దశలుగా జరుపుతామని ఎన్నికల కమిషన్ ప్రకటన

-నంది అవార్డుల ప్రకటన. ఉత్తమ నటుడుఅవార్డు చిరంజీవి, నాగార్జునలు ఇద్దరికి. ఉత్తమ నటిగా కళ్యాణి ఎంపిక.

22 : ఆంధ్రప్రభ మెదక్ టౌన్ విలేకరి యాదగిరి హత్య

23 : ప్రత్యూష ఆత్మహత్య కేసులో సిద్ధార్థరెడ్డికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి తీర్పు

25 : కాంగ్రెస్, టిఆర్ఎస్ పొత్తు ఖరారు

- 'దేశం'లో చేరిన మైసూరారెడ్డి

- విజయా స్టూడియో అధినేత బి.నాగిరెడ్డి మృతి

26 : ఎన్‌టిఆర్ వర్సిటీ విసిగా ఆర్.సాంబశివరావు నియామకం

-తూర్పుగోదావరి జిల్లా ఐ.పోలవరంలో తాబేళ్ల అక్రమ రవాణాదారులు అరెస్టు. 377 తాబేళ్లు స్వాధీనం

28 : జర్నలిస్టు యాదగిరి హత్యకేసు అవసరమైతే సిబిసిఐడికి బదిలీ. రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ హామీ.

మార్చి :

1 : వ్యాపారులు సిండికేట్‌గా తయారై మిర్చిధర పతనం చేయడంతో ఆగ్రహించిన రైతులు వరంగల్ ఎనుమాముల మార్కెట్‌యార్డు ధ్వంసం

– నకిలీ బిఇడి సర్టిఫికెట్ల గుట్టురట్టు – నలుగురి అరెస్ట్

6 : వ్యవసాయ పరపతి సంఘాల్లో సంస్కరణలను ప్రారంభించిన ప్రభుత్వం 6వేల మందిని తొలగిస్తూ జిఓ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

9 : కర్నాటక, ఒరిస్సాలో శిక్షణ పొందిన హిందీ పండితులు డిఎస్‌సి నియామకాలకు అర్హులేనంటూ ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ తీర్పు

11 : తిన్నది అరక్కే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటూ సంచలన ప్రకటన చేసి రైతుల ఆగ్రహానికి గురైన కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ.

12 : టికెట్ల పంపిణీ, అధినేత ఒంటెత్తు పోకడలపై పార్టీలో తీవ్ర ఆగ్రహం. పార్టీ రాష్ట్ర కమిటీలన్నింటినీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన తెరాస అధ్యక్షుడు చంద్రశేఖరరావు

16 : శాసనసభ ఎన్నికలలో సీట్ల సర్దుబాట్లపై కాంగ్రెస్‌తో సిపిఎం చర్చలు విఫలం. 16 అసెంబ్లీ, 2 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సిపిఎం.

18 : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రాష్ట్ర గిరిజన వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి మణికుమారి భర్త ఎం.



ఎన్నికల ప్రణాళికను విడుదల చేస్తున్న సిపిఎం అగ్రనాయకులు

వెంకటరాజును విశాఖజిల్లా పాడేరులో పట్టపగలు కాల్చి చంపిన నక్సల్స్

20 : నేర చరితుల్లో తెదే ఫస్ట్ అని స్పష్టం చేసిన లోక్‌సత్తా.

ఏప్రిల్ :

2 : సిపిఎం మేనిఫెస్టో విడుదల చేసిన బివి.రాఘవులు. సాగు-తాగుకే ప్రధాన్యం.

16 : పీపుల్స్‌వార్ అగ్రనాయకుడు పిళ్లా వెంకటేశ్వరరావు డిజిపి సమక్షంలో లొంగుబాటు

17 : భద్రాచలంలో వికటించిన కంటి ఆపరేషన్లు, 20 మందికి ఇన్‌ఫెక్షన్లు

-10వ తరగతి మార్కుల కుంభకోణంలో ముగ్గురు అధికారుల సస్పెన్షన్.

19 : ఎర్రంనాయుడిపై నక్సల్స్‌దాడి

మే :

11 : శాసనసభ ఎన్నికల్లో అధికార పార్టీ ఓటమి. కాంగ్రెస్ కూటమి



227 స్థానాలు కైవసం. ప్రభుత్వం ఏర్పాటు. వామపక్షాలకు తొమ్మిది స్థానాలు, టిడిపి కూటమికి 49 స్థానాలు మాత్రమే.

13 : సిపియం శాసనసభా పక్ష నేతగా నకిరేకల్ ఎమ్మెల్యే నోముల నర్సింహ్మయ్య ఎన్నిక.

14 : ముఖ్యమంత్రిగా వైఎస్ ప్రమాణ స్వీకారం- ఉచిత విద్యుత్తు ఫైలుపై తొలి సంతకం

18 : చేపమందు నిషేధించాలని ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ భార్గవ డిమాండ్

28 : రాష్ట్ర మంత్రివర్గంలో చేరతామని కెసిఆర్ ప్రకటన

జూన్ :

1 : 12వ శాసనసభ స్పీకర్‌గా కె.ఆర్.సురేష్‌రెడ్డి ఎన్నిక.

4 : సినీనిర్మాత బెల్లంకొండ సురేష్, ఆయన సహచరుడు సత్యనారాయణచౌదరిపై సినీహీరో బాలకృష్ణ కాల్పులు.

-ప్రభుత్వఆసుపత్రుల్లో వినియోగచార్జీలను (యూజర్) రద్దుచేసిన రాష్ట్రప్రభుత్వం.

16 : నక్సల్స్‌తో చర్చల ప్రక్రియ. మూడు నెలలపాటు కాల్పులవిరమణ.

23 : ఏలేరు భూ కుంభకోణాన్ని విచారించిన కమిషన్‌ను పునరుద్ధరణ.

జులై :

13 : నక్సల్స్ ప్రతినిధులు, ప్రభుత్వం మధ్య చర్చలు ప్రారంభం.

14 : శాసనసభలో రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రసంగం

18 : హైదరాబాద్‌లోని ఓ ప్రార్థనా మందిరంపై విహెచ్‌పి గూండాల దాడి

19 : ఆరుగురు దళిత రైతుల ఆత్మహత్యాయత్నం - ప్రకాశం కలెక్టరేట్‌లో ఉద్రిక్తత

22 : హైదరాబాదలో ఎస్‌డబ్ల్యుఎఫ్, అంగన్‌వాడీ, విద్యుత్ కార్మికుల భారీ ర్యాలీలు

21 : మేఘమథనం ప్రారంభం

-వార్‌పై నిషేధం ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

28 : నిషేధం ఎత్తివేత తర్వాత వరంగల్‌లో పీపుల్స్‌వార్ తొలి సభ

ఆగస్టు :

3 : విద్యుత్ ఉద్యమంలో అమరులైన ముగ్గురి కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తామని ప్రభుత్వ ప్రకటన.

7 : సంస్కరణలను కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో పనిచేస్తున్న 8వేలమంది ఉద్యోగులను తొలగిస్తూ ఆదేశాలు జారీ.

10 : స్వాతంత్ర్య సమర యోధులు తుమ్మల వెంకటసుబ్బయ్య కన్నుమూత

17 : మధుర గాయని జిక్కీ మృతి

28 : కృష్ణా పుష్కరాలు ప్రారంభం, విజయవాడలో ఆరుగురి దుర్మరణం

- విద్యుత్ ఉద్యమ అమరవీరులకు బషీర్‌బాగ్‌లో ఘన నివాళి

సెప్టెంబర్ :

8 : ముగిసిన కృష్ణ పుష్కరాలు.

20 : విశాఖ డాక్ యార్డ్‌లో అగ్ని ప్రమాదం.

అక్టోబర్ :

1 : హైదరాబాద్‌లో పీపుల్స్‌వార్, జనశక్తి బహిరంగసభ.

- ఎంసెట్ ఉండాలా? వద్దా? అనే విషయంపై ఐదుగురితో కమిటీ ఏర్పాటు.

5 : హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో ఇంజనీరింగ్ విద్యార్థి మరణం. పెల్లుబికిన ఆగ్రహం. బస్సుదగ్ధం, మెడికోల ఎదురుదాడి.

8 : ప్రముఖ సాహితీవేత్త, మార్క్సిస్టు సాహితీ విమర్శకులు త్రిపురనేని మధుసుధనరావు మరణం.

చంద్రబాబుకు ఓటమి చవి చూపిన 2004



11 : ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా టి.జ్యోతి, కె.స్వరూపారాణి ఎన్నిక.

12 : అజ్ఞాతం నుండి బయటికి వచ్చిన వార్‌నేతలు, రామకృష్ణ, సుధాకర్, గణేష్.

27 : అంగన్‌వాడీలకు 100 రూపాయల వేతనం పెంపు.

31 : రాష్ట్ర నూతన గవర్నర్‌గా సుశీల్‌కుమార్ షిండే.

నవంబర్ :

4 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌గా సుశీల్‌కుమార్ శంభాజీరావ్ షిండే ప్రమాణస్వీకారం

–ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కె కేశవరావు

10 : నంది సినీ అవార్డుల ఉత్సవం

డిసెంబర్ :

22 : 14ఏళ్ళ క్రితం జరిగిన షాద్‌నగర్ హత్యకేసులో మాజీమంత్రి ఇండ్ల రామసుబ్బారెడ్డికి యావజ్జీవశిక్ష.

: నంది టీవి అవార్డుల ప్రధానోత్సవం.

23 : మాజీ ప్రధాని, మాజీ ముఖ్యమంత్రి పి.వి. నరసింహారావు మృతి

మూగబోయిన గాన గాంధర్వం





వివిఎన్ లాల్ సలామ్

2004 రౌండప్

ఆంధ్రప్రదేశ్‌లో సొనియా గాంధీ పర్యటన



పివి ఇక సెలవు.

బాలనేస్తాలు

వీరి వీరి గుమ్మడిపండు... వీరి పేరేమి?

హేయ్! ఈ వారం మీ ముందుకు వచ్చిన తాతయ్య ఎవరో ఈపాటికే మీ చిట్టి బుర్రలో వెలిగి వుంటుంది. వెంటనే కార్డుమీద రాసి మాకు పంపితే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. మా చిరునామా: వీరివీరి గుమ్మడిపండు వీరిపేరేమి? బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

గతవారపు జవాబు: సోమనాథ్‌చటర్జీ

సరైన సమాధానాలు రాసినవారు

బి.సృజన, 7వ తరగతి, గీతాంజలి హైస్కూల్, హైదరాబాదు. కె.లక్ష్మి, 9వ తరగతి, వనపర్తి, మహబూబ్‌నగర్.వి.శ్వేత, 6వ తరగతి, నెల్లూరు. పి.హారిక, స్వాతి, సమత, 7వ తరగతి, అద్దాకుల. పి.శ్రీనాథ్, 6వ తరగతి, మహబూబ్‌నగర్. ఎం.శ్రీనివాస్‌గౌడ్, 8వ తరగతి, కమలాపురం. పి.వాసంతి, 8వ తరగతి, అద్దంకి. జి.సాయిభరత్‌రెడ్డి, 6వ తరగతి, మోదుకూరు. హెచ్.జయవర్ధన్, 10వ తరగతి, మారేపల్లి. కె.రవికౌషిక, 4వ తరగతి, చీరాల.

తేడాలు కనుక్కోండి



సంజూ వాళ్లది బాగా పల్లెటూరు. అక్కడ నెలకోసారి సంత జరుగుతుంది. అప్పుడు అందరూ అక్కడికెళ్లి తమకు కావలసినవన్నీ కొనుక్కుంటుంటారు. అడుగో మన సంజూ కూడా సైకిల్ పట్టుకుని కనిపిస్తున్నాడు కదూ. అసలు విషయమేంటంటే.. ఆ రెండు బొమ్మల్లోను 14 తేడాలున్నాయి. మీరు వాటిని కనిపెట్టాలి. సరేనా!

❋

మాస్క్ చేసేద్దాం

నేస్తాలూ... మొహానికి రకరకాల జంతువులు, పక్షుల మాస్కులు తగిలించుకుని ఎవ్వడైనా, ఎవరినైనా దడిపించారా! లేదా? ఏయ్ చెప్పడంలేదు కానీ ఆ పని చేసే వుంటారు. అవునుకదూ. సరే. ఇవాళ అలాంటి మాస్కును తయారు చెయ్యడం ఎలాగో చెప్పకుందామే.

ఏమేం కావాలంటే... కత్తెర, గమ్ టేప్ లేదా గమ్, దారం, మందపాటి అట్ట (మీ నోటు పుస్తకాలకు వుండేదైనా సరిపోతుంది).

ఎలా చెయ్యాలంటే... ముందు అట్టమీద పెద్ద సున్నా గియ్యండి. తర్వాత దాని చుట్టూ వున్న అట్టను కత్తిరించెయ్యండి.

ఇప్పుడు గుండ్రంగా వున్న అట్టముక్క మధ్యభాగం నుంచి ఏదో ఒక వైపుకు త్రికోణాన్ని గియ్యండి. దాన్ని కత్తెరతో కత్తిరించి తీసెయ్యండి. తర్వాత రెండు చివర్లను దగ్గరగా చేసి గమ్ టేప్ వెయ్యండి.

ఇహ దాన్ని మీ మొహం మీద పెట్టుకుని కచ్చితంగా కళ్లమీద రెండు సున్నాలు గీసుకోండి. ఆ సున్నాలను కత్తిరించి అట్టముక్కలను తీసెయ్యండి. ఇప్పుడు వాటి స్థానంలో రెండు రంధ్రాలు కనిపిస్తాయి.

ఇప్పుడు కళ్లు, నోరు, ముక్కు గియ్యండి (బొమ్మలో చూపించినట్టుగా).

ఇంక ఇప్పుడేం చెయ్యాలంటే.. దీని చుట్టూ కాగితపు ముక్కలను అతికించండి.

కళ్ల రంధ్రాలకు పక్కగా అట్టకు చివరన రెండు చిన్ని రంధ్రాలు పెట్టండి. దారం కట్టి మొహానికి తగిలించుకోండి. అంతే మాస్క్ రెడీ అయిపోయినట్టే. ఇప్పుడు గబాల్న ఎవరిముందుకైనా వెళ్లి ఏదో ఒక జంతువుకు మల్లే అరవండి. అంతే దడుచుకుంటారు. భలే తమాషాగా వుంటుంది. కానీ మరీ ముసలివాళ్లు, పిల్లల దగ్గరకెళ్లి మాత్రం ఇలా చెయ్యకండి. ప్రమాదం. ఓకేనా!

వచ్చే ఆదివారం మరో మంచి పేపర్ బొమ్మ తయారు చెయ్యడం గురించి చెప్పకుందామే. ❋

రక్షకుడు పుట్టిన సీన్...!

అమృత

అది ముంబయిలోని కమలా నెహ్రూ జూలాజికల్ పార్క్‌రోడ్డులో ఉన్న సెయింట్ పాల్స్ స్కూల్...

ఐదు సంవత్సరాల క్రితం...

సెమీ క్రిస్‌మస్ సంబరాలు...కేరల్స్...అన్నీ ఉత్సాహంగా ముగిశాయి.

డిసెంబర్ 24 రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో ముఖ్యమైంది పిల్లలందరూ వేయబోయే డ్రామా.

"రక్షకుడు పుట్టాడు" అనే డ్రామాకు రంగం సిద్ధమైంది.

డ్రామా అనగానే మనకు మన గ్రామాల్లోని పూర్వపు డ్రామాల రోజులు గుర్తొస్తాయి.

అప్పట్లో బాలనాగమ్మ డ్రామా ఎక్కువగా ఆడేవాళ్ళు కదా ! అందులో మాయలపకీరు, బాలనాగమ్మను కుక్కగా మార్చి తీసుకుపోయే సీన్ ఉంటుంది. ఆ సీన్ కోసం గ్రామంలోని వీధికుక్కకు బెల్లంపెట్టి మచ్చిక చేసుకునేవారు. ఆ తరువాత దాని మెడకో చిన్నతాడుకట్టి స్టేజీకి దగ్గర్లోనే కట్టేసేవారు. అర్ధరాత్రికెప్పుడో డ్రామా మొదలై మాయలపకీరు సీన్ వచ్చేది. మాయలపకీరు "హుహు... హహహ..." అంటూ వికటాట్టహాసం చూస్తూ, బాలనాగమ్మను కుక్కలా మార్చేసి తీసుకుపోతుంటాడు. ఇతని హుంకారాలు-జనం ఈలలతో కుక్క బెదిరి, గింజుకోవటం మొదలుపెట్టేది. దీంతో జనంలో కలకలం. ఈ గందరగోళంతో భయపడిన ఆ కుక్క, తాడును టుపుక్కున తెంచుకుని ఆడియన్స్‌లోకి పరుగులు తీసేదట! అప్పట్లో ఇలా చాలా చోట్ల జరిగిందని చెబుతుండేవారు.

ముంబయిలోని ఈ పిల్లల డ్రామాలో అటువంటిదేమీ జరగలేదు కానీ... ఓ పాత్రధారి తాను నటిస్తున్నానని మర్చిపోయి తీవ్రస్పందనకు గురయ్యింది.

పాత్రోచితంగా కాక తనలోని మానవీయ హృదయంతో స్పందించింది.

రిహార్సిల్‌లో నేర్చుకున్న డైలాగులు కాక తనలోని మంచితనానికి మాటలు తొడిగింది.

డ్రామా చూస్తున్న ప్రేక్షకులు, నిర్వాహకులు నిశ్చేష్టులయ్యారు.

* * *

ముంబాయిలోని కమలా నెహ్రూ జూలాజికల్ పార్కురోడ్డులో ఉన్న సెయింట్ పాల్స్ స్కూల్ పిల్లల్లో రెండు గ్రూప్‌లున్నాయి.

ఒకటి కోటీశ్వరుల పిల్లల గ్రూప్, మరొకటి లక్షాధికారుల పిల్లల గ్రూపు.

కోటీశ్వరుల పిల్లలంతా రోజుకో కారులో దిగుతుంటారు. లక్షాధికారుల పిల్లల్లో ఎక్కువ మంది గెజిటెడ్ ఆఫీసర్ల పిల్లలే. వీళ్ళు ప్రభుత్వం ఇచ్చిన అంబాసిడర్ కార్లలో స్కూలుకి వెళితే కోటీశ్వరుల పిల్లలు చిన్నచూపు చూస్తుంటారు.

అందుకే స్కూల్ బస్సులో వెళ్ళటమే కొంత గౌరవమనే భావన ఆ చిన్నారుల్లో గూడుకట్టుకుంది. దీంతో వీళ్ళంతా స్కూల్ బస్‌లోనే వెళుతుంటారు.

స్కూల్లో ఇటువంటి వాతావరణం కొనసాగటం అక్కడి ప్రిన్సిపాల్‌కు, టీచర్లకు నచ్చలేదు.

ఎకడమిక్ ఇయర్ ప్రారంభంలోనే ఈ

అంతరాలను రూపుమాపాలనే ప్రయత్నం చేశారు. కానీ వాళ్ళవల్లకాలేదు.

ఈ రెండు గ్రూపుల్ని కలపాలని ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్న సిస్టర్ సెల్వీ క్రిస్మస్ డ్రామా సందర్భాన్ని వేదిక చేసుకోవాలనుకుంది.

దొంగ చేతికే తాళం అప్పచెప్పాలనుకుంది. అందుకే రెండు గ్రూపుల నుంచి స్కూలు వాతావరణాన్ని దెబ్బతీసేందుకు నాయకత్వం వహిస్తున్న పిల్లల్ని ప్రధానంగా ఎంచుకుంది.

వాళ్ళతో "రక్షకుడు పుట్టాడు" అనే డ్రామాకు రూపకల్పన చేసింది.

వారం పదిరోజులుగా డ్రామాలో ఉన్న ఆ రెండు గ్రూపుల్లోని పిల్లలు పోటాపోటీగా వాళ్ళ పోర్షన్ బట్టీపడుతున్నారు.

స్కూల్ పిల్లలు కూడా వీళ్ళని సొంత పేర్లతో పిలవకుండా, హలో మేరి... హాయ్ జోసఫ్... హే హేరోద్... అంటూ డ్రామాలోని పేర్లతో పలకరించటం ప్రారంభించారు.

దీంతో వీళ్ళకు మరింత ఉత్సాహం కలిగింది. డ్రామాను రక్తికట్టించాలనే పట్టుదల ఆ చిన్నారుల్లో కలగటంతో అప్పటివరకూ ఉన్న అంతరాలు మర్చిపోయారు. ఒకరి కోసం మరొకరు ఎదురుచూడ్డం, తెచ్చుకున్న లంచ్ బాక్సులు షేర్ చేసుకోవటంతో, ప్రధానంగా గ్రూపులకు నాయకత్వం వహించే వాళ్లలో సఖ్యత ఏర్పడింది.

దీంతో స్కూలు వాతావరణంలో అనూహ్యంగా మార్పు వచ్చింది. మనమంతా ఒకటి... అనే భావన వాళ్ళల్లో కలిగింది.

అనుకున్న రోజు రానే వచ్చింది.

ఆ రోజు క్రిస్మస్ ఈవ్.

డిసెంబర్ 24వ తేదీ రాత్రి...

డ్రామాలో ఉన్న బుడతలంతా ముఖానికి రంగులు పూసుకుని పొడవాటి అంగీలు, వాటిమీద వల్లెవాటు... వేసుకున్నారు. పెట్టుడు మీసాలు, గడ్డాలతో గ్రీన్ రూమ్‌లో తిరుగుతున్నవారిని కన్న తల్లిదండ్రులే గుర్తుపట్టలేక పోయారు.

అమ్మగార్ల స్కూలంటే తెలిసిందేగా... సిస్టమాటిగ్గా ఉంటుంది. ఏడు గంటలకు డ్రామా మొదలవుతుందని ముందుగానే ఎనౌన్స్ చేశారు.

అనుకున్న విధంగా డ్రామా మొదలయ్యింది. కర్టెన్ పైకి లేచింది. స్టేజీమీద ఒక్క గొర్రె కనపడకపోయినా చిన్నారుల వేషధారణ చూస్తే వాళ్లు గొర్రెల కాపరులని ఇట్టే అర్థమవుతుంది. అంత చక్కగా నటిస్తున్నారు.



చలికి వణుకుతూ గుట్టగా మూలన కూర్చున్న వాళ్ళముందు సడన్‌గా ఓ తెల్లనివెలుగు తళుక్కుమంది. చిన్నపిల్లలు భయంతో వణికిపోతున్నట్లు అభినయిస్తున్నారు.

అంతలోనే వీణ మీటినట్లు, మృధుమధురంగా గొంతు వినిపించింది.

"...భయపడకుడి... దావీదు పట్టణంలో రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు..." రెప్పపాటు కాలంలో వెలుగు అదృశ్యమైంది.

"ఏంది... ఏందిర భళా... ఏంది ఏంది..." అంటూ గొర్రెల కాపరులు సంతోషంగా జానపదశైలిలో నృత్యం చేయటం ప్రారంభించారు.

ఇక చూడండీ... ఆడియన్స్ గాలరీలో కూర్చున్న చిన్నారులు విజిల్స్‌వేస్తూ, లేచి స్టెప్పులేస్తుంటే, కంట్రోల్ చేయటం ఎవరివల్లా కాలేదు.

ఒక్కొక్క సీన్ నడిచేకొద్దీ, చిన్నపిల్లలైనా చాలా బాగా చేస్తున్నారని అందరూ మనసుల్లోనే అభినందిస్తున్నారు. పతాక సన్నివేశం దగ్గర పడుతున్నకొద్దీ పాత్రధారులు డ్రామాలో లీనమై నటిస్తున్నారు.

అప్పటి వరకూ హుషారుగా ఉన్నవారి ముఖాల్లో ఆందోళన చోటుచేసుకుంది. ఇందుకు కారణం మేరి పురిటి నొప్పులు పడుతుంటే, ఆ పరిసర ప్రాంతంలో ఒక్కరు కూడా ఇంట్లోకి రానివ్వట్లేదు.

ఇంటి తలుపులు తెరుచుకుంటున్నాయి... మూసుకుంటున్నాయి.

నడవలేక అల్లాడుతున్న మేరి పాత్రధారి అద్భుతంగా నటిస్తోంది. జోసఫ్ భుజంమీద తలవాల్చి భారంగా అడుగులువేస్తోంది.

చివరి ఇంటిదగ్గర బతిమాలుతున్నాడు జోసఫ్ పాత్రధారి. ఆ తరువాత పశువులపాకలో ఏసుప్రభువును కనాల్సిన సీన్ వస్తుంది. ప్రేక్షకులకు డ్రామా చూస్తున్నామన్న భావనే లేదు. డ్రామాలో లీనమైపోయారు. నెలల నిండిన గర్భవతి మేరి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేక జోసఫ్ చేతుల్లోనుండి కిందికి జారిపోయింది.

ఈ సీన్‌చూసి, ధబేల్న తలుపు మూయాల్సిన ఇంటి యజమానురాలి పాత్రధారి ఒక్క ఉదుటున గుమ్మంలో నుండి మేరి దగ్గరకువచ్చి అక్కున చేర్చుకుని, అతికష్టంగా ఇంట్లోకి తీసుకుపోతోంది.

ఆ సీన్ చూసిన సిస్టర్ సెల్వి బిక్కచచ్చిపోయింది. తాను ఇన్ని రోజులు కష్టపడి నేర్పించిందేమిటీ... వీళ్ళు చేస్తున్నదేంటీ?... ఇంతటితో తన ఉద్యోగం ఊడటం ఖాయం... అనుకుంది.

ప్రేక్షకులు సైతం నిశ్చేష్టులయ్యారు.

క్షణాల్లో వేదికమీద లైట్లు ఆరిపోయాయి... కర్టెన్ దిగిపోయింది.

ఇంటి యజమాని పాత్ర పోషించిన బాలిక తల్లిదండ్రులకయితే అంతటి చలికాలంలో కూడా ముచ్చెమటలుపోశాయి. ఎంతో కష్టపడి ఈ స్కూల్లో సీటు సంపాదిస్తే... ఇలా అయిందేవిటని మనసులోనే మథనపడుతున్నారు.

అనలే మిషనరీ స్కూలు... ఏమవుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులంతా భయపడిపోతున్నారు.

గంభీరమైన ముఖంతో ప్రిన్సిపాల్ రూత్ సిగ్మన్ స్టేజ్ పైకి వచ్చింది. ఎలాంటి మాట వినాల్సి వస్తుందోననే భయంతో అక్కడి వారంతా నిశ్శబ్దంగా చెవులు రిక్కించి ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు.

"ఎస్... ఆ పాప చేసింది కరెక్ట్. ఇది డ్రామా అని మర్చిపోయి మానవతా దృక్పథంతో మేరిని అక్కున చేర్చుకుని, ఇంట్లోకి తీసుకుపోయింది. ఆనాడు మానవత్వం మరిచిన వ్యక్తుల కారణంగా క్రీస్తు పశువులపాకలో జన్మించాడు..." ప్రిన్సిపాల్ చెప్పుకుపోతోంది.

అందరూ హద్దుల్లేని ఆనందంతో చప్పట్లుచరుస్తున్నారు. ఆ హోరులో ఆమె చెపుతుంది ఎవరికీ వినపడట్లేదు.

సిస్టర్ సెల్వీ చేతిలో కర్చీఫ్ ఉన్న సంగతి కూడా మర్చిపోయి స్కార్ఫ్‌తో ఆనందబాష్పాలు తుడుచుకుంటోంది. ✥

డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి

వెనుక సీటు పెత్తనం

"ఆంటీ వున్నారా?" - అంటూ లోపలికి వచ్చింది మాలిని.

"ఉన్నాను. రా! మాలినీ! ఆదిత్య స్కూలుకెళ్ళాడా?" అడిగాన్నేను.

"ఆ పంపించే ఇటు వచ్చాను" మాలిని నాకెదురుగా వున్న కుర్చీలో కూర్చుంది. "ఆంటీ! రాత్రి టీవీ సీరియల్ "క్యూంకీ సాస్ భీ కభీ బహూ థీ"లో కోడలు స్మృతి ఇరానీని చూసారా!" అడిగింది మాలిని

"చూడలేదు మాలినీ ఏమైంది. స్మృతి అప్పుడు ఢిల్లీలో బిజెపి పార్టీ తరపున ఎలక్షన్లో ఎంపీగా నిలబడింది కదూ?" అడిగాన్నేను.

"అవును ఆంటీ ఆ యాక్ట్రసే. ఆమె "కోడలు స్మృతి ఇరానీ"గా ప్రసిద్ధి కదా! ఏదో డైమండ్ జ్యుయలరీ షాప్ ఓపెన్ చేయటానికని సూరత్ పోయింది. పోయింది ఊరకనే ఉండొచ్చు కద! గుజరాత్ చీఫ్ మినిస్టరు నరేంద్ర మోడీ భాయి గద్దె నుంచి దిగాలే. వెంటనే దిగకపోతే అటల్ బిహారీ వాజ్‌పేయి పుట్టినరోజయిన డిసెంబరు ఇరవై ఐదో తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్షను చేపడ్తాననీ ప్రకటించింది! ఇదేదో మబ్బులు మెరుపులు లేని పిడుగులాగా అనిపించింది అందరికీ"... చిరునవ్వు నవ్వింది మాలిని.

"స్మృతి ఇరాకి పార్టీలో ఏం పెద్దగా పాత్ర వున్నట్లుగా లేదు మరి! ఒక్కసారే ఎందుకంత ద్రౌపదిలాగా ప్రతిజ్ఞ చేసిందో?" నేనూ చిరునవ్వు నవ్వాను.

"అదే ఆంటీ విచిత్రంగా వుంది. నరేంద్రమోడీ ముఖ్యమంత్రిగా గద్దె దిగాలనీ, దిగొద్దని ఇంతకుముందే బీజేపీలో అల్లరి జరిగింది. చివరకు రాజీకి వచ్చి మోడీనే ముఖ్యమంత్రిగా వుండాలని వాజ్‌పేయి ప్రకటించాడు. ఆ సమస్య అంతటితో పార్టీలో ఒడిసిపోయింది అనుకున్నాం. కాని ఇప్పుడు స్మృతి ఇరానీ ఈ విధంగా మోడీ గద్దె దిగాలని భీష్మించుకొన్నది. అంటే పాపం ఆమె స్వతంత్రంగా ఆ నిర్ణయం తీసుకొని మాట్లాడివుండదు కద!" అంది మాలిని సందేహంగా.

"అవును మాలినీ! పార్టీలో క్రియాశీలంగా పనిచెయ్యని స్మృతి ఇరానీ ఆ విధంగా అన్నదంటే విచిత్రంగానే వుంది. అయినా ఆమెకు ఆ "క్యూంకీ సాస్ భీ కభీ బహూ థీ" సీరియల్‌లో ఒక్కతే ఏకపక్షంగా సత్యం అంటూ కోడలుగా, ఇప్పుడు కొత్తగా అత్తగానూ నిర్ణయాలు తీసుకొని డైలాగులు చెప్పిస్తున్నారేమో! నటన అలవాటే కద! ఆ అలవాటుతో గుజరాత్‌కు పోయి అక్కడ సూరత్‌లో అభిమానులు చూపిన ప్రేమాభిమానాలకు ఉప్పొంగిపోయి ఒళ్ళు మరచిపోయి ఆ విధంగా మాట్లాడిందేమో సీరియల్లోని డైలాగుల్లా!" చిన్నగా నవ్వాన్నేను.

"ఆంటీ సూరత్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి గురించి అలా ఎట్లా అంటుంది... పార్టీ వాళ్ళ ప్రమేయం లేకుండా. స్మృతి ఇరానీ అంత తెలివితక్కువది కాదనే అనుకుంటాను. అందులో ఆమె వృత్తివేరు. వృత్తితో సంబంధంలేని అంత పెద్దమాట ఎట్లా అంటుంది. స్వతంత్రంగా తనకుతానే అందంటే నేను నమ్మను" అంది మాలిని దృఢంగా.

"ఏమో! ఏ ఆవేశంలో ఏ సందర్భంలో అందో ఆ మాటలు!"

"ఆమే అన్న మాటలు టీవీ చానెల్లో చాలాసార్లు మళ్ళామళ్ళా చూపించారు. ఆంటీ! సీరియల్లో భర్త మిహిర్‌తో అత్తగారితో ఎంత దృఢంగా డైలాగు చెప్తుందో అంతే దృఢంగా ఆ మాటలు అంది. మళ్ళా తెల్లవారి పత్రికలన్నిట్లో స్మృతి ఇరానీ తానన్న మాటలు వాపసు తీసుకుందని వార్తలు వేశారు. ఇదంతా చాల విచిత్రంగా వుంది" అంది మాలిని చిన్నగా ఆశ్చర్యపోతూ.

"ఓహో! అయితే ఆమె ఆ మాటలు వాపసు తీసుకోవటం కూడా జరిగిందన్నమాట! బాగుంది ఈ మగవాళ్ళు వెనుకవుండి ఆడవాళ్ళతో ఎన్ని ఆటలు ఆడిస్తారో చూడు! సీటు వెనుక పెత్తనం అంటే ఇదే! ఆడవాళ్ళంటే కాస్తంత గౌరవం లేదు! మరీ బీజేపీ వాళ్ళకు! పాపం మంచిగా మధ్యప్రదేశ్‌లో పరిపాలన చేసుకుంటున్న ఉమాభారతిని పదవి నుంచి తొలగించేసి హిమాలయాలు పట్టించారు. కొంచెం వ్యక్తిత్వం స్వేచ్ఛలు ప్రదర్శిస్తే చాలు ఏమేమో పేర్లు పెడ్తారు. ఉమాభారతికి "ఫైర్‌బ్రాండ్" అని పేరు పెట్టారు! మళ్ళా ఆమెతో క్షమాపణ ఉత్తరాలు రాసేంత వరకు వదిలిపెట్టలేదు. ఒకప్పుడు చక్కగా ఎంపీగా, మినిష్టరుగా వున్న సుష్మా స్వరాజ్‌నూ అంతే చేసారు. సెంటర్లో మినిస్టరుగా వున్నదాన్ని తీసుకుపోయి ఢిల్లీకి ముఖ్యమంత్రిని చేశారు. అక్కడ్నుంచి బీజేపీకి సోనియాగాంధీకి వ్యతిరేకంగా బళ్ళారిలో ఎలక్షన్లో నిలబెట్టారు. పాపం సుష్మా స్వరాజ్ కన్నడం కూడా నేర్చుకొని ఎలక్షన్లలో ఉపన్యాసాలిచ్చింది. అయినా సోనియా గాంధీ హవా ముందు నిలువలేకపోయింది. కొట్టుకపోయింది. ఓడిపోయింది. ఆఖరికి ఏ పదవి లేకుండా పార్టీలో మగపెత్తనంతో మిగిలిపోయింది. పాపం అక్కడ్నుంచి ఇక్కడికీ... ఇక్కడ్నుంచి అక్కడికీ ఉరికించి సుష్మాస్వరాజ్‌ను ఆ విధంగా పదవి నుంచి ఊడపెరికి విడిచిపెట్టారు. ఇప్పుడు ఉమాభారతిని ఆడించారు. చివరకు స్మృతి ఇరానీతో ఈ డైలాగులు చెప్పించి ఏం చేయాలనుకున్నారో!" అన్నాన్నేను కాస్త ఆవేశంగానే.

"అదే ఆంటీ! నేను అనేది. ఆడవాళ్ళను మగపెత్తనంతో ఈ విధంగా ఆటలాడిస్తారు. పైగా ఆడవాళ్ళు రాజకీయాలకు తగరు అని, వాళ్ళల్లో సామర్థ్యం లేదని, వాళ్ళ నోళ్ళల్లో నువ్వుగింజ నానదు అనీ అంటారు." అంది మాలినీ ఆవేశంగానే!

"ఇంకో మాట మరచిపోయావు మాలినీ! మూడు జుట్లు కలిసివుంటాయి కాని... మూడు సిగలు ఒక్కచోట కలిసివుండలేవని! తగాదాలు పెట్టించి తమాషా చేసేది పురుష పెత్తందార్లే! ఆడవాళ్ళను వాళ్ళకేం రాదు. వాళ్ళకేం తెలియదని బద్నాం చేసేది పురుష సమాజమే!" అన్నాన్నేను మళ్ళా ఆవేశంగానే!

గా ఫ్యాక్షనెట్ల పోతది...

కాలువ మల్లయ్య

ఊరు మూడు బజార్ల కాడున్న గద్దె మీద మస్తు మందే కూసున్నరు... మంది గూడినంక మాటలకేమన్న తక్కోనా? బైస్ జేసుకుంట దునియంత తిరిగత్తున్నరు.. నరం లేని నాలికె గద ఏదంటది మాట్లాడ్తంద్రు... ఇయ్యాల్ల రేపు పోరగాండ్లు మస్తు తెలివికచ్చిరి... టీవీలాయే, రేడియోలాయే, పేపర్లాయే ఇగ తెలివికి రాకుంటేం జేత్తరని గందుకే అమెరిక నుంచి ఆఫ్రికా దాక, ఆస్ట్రేలియ నుంచి ఆసియా దాకా అన్ని సంగతులు మాట్లాడుతంద్రు... మాట్లాడుకుంట మాట్లాడుకుంట వాళ్ళు రాయలసీమ దాకచ్చింద్రు.. గా ఫ్యాక్షన్ కొట్లాటల కాడకచ్చాగింద్రు...

'వాళ్ళు ఒకల్నొకరు గంత ఘోరంగెట్ల నరుక్కుంటరు...;?'

'అట్ల నరుక్కుంటె వాళ్ళ కచ్చేదేంది..?'

"ఏమత్తదంటె వాళ్ళ పౌరుషాలు.. పట్టుదలలు... పగలు.."

"అండ్ల సచ్చెటోల్లంత సానమంది పేదోల్లే.. వాళ్ళు ఎవ్వల కోసం ఎందుకు నరుక్క సత్తున్నరో తెలువని సంగతి..."

"గా నరుక్క సచ్చెటోల్ల వనయితె వట్టిబొక్కలకు కొంద్రిగాడాశపడ్డట్టే ఉంది... సన్నొసోడ దేనికో ఆశపడ్డట్టుంది.. కల్లుబొట్టుకో... బుక్కెడు బువ్వకో... పెద్దోని కోసం చిన్నోడు సచ్చుడే ఇది.."

"ఇండ్ల తెలువన్దేముంది..? ఇక్కడ దొరలున్నట్టే అక్కడ గూడ దొరలున్నరు.. గా దొరల చేతుల్లనే ఆస్తులు.. వాళ్ళ చేతుల్లనే అధికారాలు... వాళ్ళకోసం పనిపాటలోల్లు నరుక్కసావాలె..."

"అక్కడున్న పేదరికాన్ని దొరలుపయోగించుకుంటరు..."

"గిదెంత ఘోరం మరి..."

"ఇగో... పైసలున్నోనిది రాజ్జెం.. ఒకప్పుడు మనూల్లల్ల దొరల చేతికిందుండక పోదురా..? గట్లనే దొరల చేతికింద మనుషులుంటరు.. గిదీన్నే మన కండ్లను మన చేతితోనే పొడిపించుకునుడంటరు.."

"అయినా గీ మాటలన్నెందుకు పట్టుంద్రి...గక్కడెక్కన్నో జరిగేటియి మనకెందుకు..? ఏదో చెప్పినట్టు గాలికిపోయే కంపను తలుగపెట్టుకున్నట్టే గిదంత.."

"అయ్యో..! మాట్లాడ్తెనే తప్పా..! అనంతపురంల, కడపల, కర్నూలుల గివ్వి ఇప్పుడే మొదలయినట్టు చెప్పుతరేంది కొందరు..?"

"ఎప్పుడు మొదలయినా గిది మంచిది కాదనుకో... కాని గురువింద గింజకు తన కింద చీకటి కనపడదు గద...!"

"గివ్వి రాజకీయాలోల్లు తల్సుకుంటె బందు గావా..?"

"వాటెసుకున్నదే వాళ్ళయిరి.. పేదొల్ల బలహీనతలను వాడుకుంటరాల్లు.."

"ఒగలు అధికారంలుంటె ఇంకొగలు లెక్కలుదీసి చెప్పుతారు..."

"మనిషి తెలివికి రాంది గివన్ని పోవు.."

"సరెగని గివ్వీటికంతే లేదా..? గిట్ల తలలు తెగుడేంది..?"

"రాజమల్లన్నా..! వేంం మాట్లాడుతాంటె నువ్వు సప్పుడు జేకనే వినుకుంటుంటివి... గిది మంచిదేనంటవా...?"

"మెడకాయ మీద తలకాయున్నోడెవ్వడైన దీన్ని మంచిదంటరా... ? కనేం జేసుడు...? కడుపు చించుకుంటె కాళ్ళ మీద పడుతదన్నట్టు కావట్టె... మనం ఎవ్వలను, ఎవ్వలకోసం, ఎందుకు నరుకుతున్నమో కత్తులు గండ్రగొడ్డల్లు పట్టుకోని ఉరికెటోల్లు తెల్సుకుంటె మంచిగుండు..." అన్నడు రాజమల్లు...

"మంచిగ సెప్పినవే రాజమల్లన్న... మరి గిదంతపోవాన్నంటె ఎట్ల..? జనం గిట్ల ఎన్నేండ్లు నరుక్క సత్తరు...? మరి మన ముఖ్యమంత్రి గిదీన్ని రూపుమాపత నంటున్నడు గద..! తగ్గుతదంటావా..?"

"రాజు తల్సుకున్నంక దెబ్బలకు కొదువనా చెప్పు.. వరాలకు గూడ కొదవలేదు... మనసు పూర్తిగ తల్సుకుంటె బందు మా చెయ్యొచ్చు.. ఉన్నోల్లు రెచ్చగొడితె వాళ్ళ కోసం బీదోల్లు నరుక్కోని సత్తంద్రు గద..! గిదీనికున్న మూలమేందో, బిసెక్కడుందో తెల్సుకుని తగ్గిత్తె మా ఐతది... గదేదో వీరత్వమన్నట్టు, పౌరుషమన్నట్టు సినుమాలు తీత్తంటె వడును పోరగాండ్లురుకులాడరా...?"

"సినిమాల్ల గది మంచిదని చెప్పుతలేరు గద..."

"రొండు గంటలు నరుక్కునుడు వీరోచితంగా, పౌరుషంగ సూపెట్టి ఆఖరుకు గిది మంచిది గాదని ఒక్కమాట చెప్పుతె ఏం లాభం...? గిసొంటి హింస సిన్మాలు తియ్యద్దు... వాళ్ళ కక్కడ నీళ్ళు లేవు...ఎమసాలు నడువయి...నసంత్రం వచ్చి యాభయేండ్లు దాటినా గీ నల్ల సమస్య, కరువు సమస్య పరిష్కారం గాకపాయె... అందరికి చేతినిండ పని, ఇంతంత భూమి, నీల్లుంటె దొరల కోసం ఎందుకు నరుక్క సత్తరు..?

"సరెగని గిదెట్ల పోతదంటవు... ?"

"ఏండ్లతరబడి నదుస్తుంది.. ఒక్కసారే పోదు కని గందుకున్న మూలాలను తొలగిస్తె గదే పోతది.." అన్నడు రాజు"

"నాకయితె ఒక్కటనిపిత్తది.." అన్నాడు రాజమల్లు...

"గదెందో...? చెప్పుమంటరా వద్దంటరా..?"

"ఊరిచ్చి సంపుతవెందుకు సెప్పు..?"

'గా గోదావరిఖని ఎరికేకద... గక్కడ బొగ్గుబాయిల మీద మస్తుమంది గూండాలుండిరి...పైలు పైలు కచ్చి డబ్బులు వసూలు జేసుక పాయెటోల్లు..ఎవ్వల దగ్గర ఏం కనపడ్డా గుంజుక పోదురు... దుకాణాల్లో జబర్దస్తీగా వసూలు జేత్తురు.. ఎన్నో దౌర్జన్యాలు చేసేటోల్లు. మన దగ్గర ఊళ్ళల్ల ఎట్లుండేది..?

దొరలెట్ల సాగించుకున్నరు... ? ఎంతమంది? మొగురాలకు కట్టేసి కొట్టింద్రు..? బజార్ల వంగ బెట్టి రాల్లెత్త లేదా... వాళ్ళకెదురున్నదా..

కొంచెం బస్తీ ఊళ్ళళ్ళ గూండాగిరి ఉండేది... పట్టణాల్లో గూడుండేది. లారీలతోని కొట్టుకునుడు, కత్తులతోని పొడుసుకునుడుండేది.

ఇప్పుడు గవ్వున్నున్నయా..?

"లెవ్వు... నిజమే.. ఎందుకు లెవ్వంటవు మరి... ?"

"ప్రజా ఉద్యమాలు, సంఘాలిచ్చినంక గిసొంటోల్లంత తోకలు ముడిసింద్రు, గిది నిజమా..? కాదా..? గూండాలు, రౌడీలు, దాదాలంత తోకలు ముడుసు కున్నరు.. దొరలు గూడ...

వీళ్ళు ఉతుకుడు కుతుకుడు.. దెబ్బకు దెబ్బ... వీళ్ళదేమో సిద్దాంత బలమాయే... వాళ్ళది గూండాగిరాయే... అందుకోసం అందరూకున్నరు... గవ్వి తగ్గినయి... కాదంటవా... ?"

"నిజమే... అయితేందంటవు...?"

"గా సంఘాలుగా గాల్లదిక్కు సూత్తె ఎక్కడోల్లక్కడ తోకలు ముడుసుకోని పోతరు... ఎంతయిన సిద్ధాంతబలం ముందు గూండాగిరేం జేత్తది... ?" అన్నడు రాజమల్లు.

"నిజమే...నిజమే... రాయల సీమల కూడా అట్ల జేత్తనే గీ ఫ్యాక్షన్ పోద్ది" అన్నరు కొందరు.

"ఏం జెప్పినవే రాజమల్లన్న..." అన్నరింకొందరు...

గరా గరా నడ్చుకుంటెల్లిపోయిండు రాజమల్లు...

హార్ట్ ఎటాక్‌తో తస్మాత్ జాగ్రత్త!

డాక్టర్ పి. దక్షిణామూర్తి

గుండె కండరానికి రక్తాన్ని సరఫరా చేసే కరోనరి ధమనుల గోడల్లో కొలెస్ట్రాల్ వంటి పదార్థాలు గార లాగా పేరుకుపోవడం వల్ల క్రమేణ ఆ ధమనులు కుంచించుకు పోతాయి. ఈ ధమనుల్లో రక్తప్రసారం తాత్కాలికంగా తగ్గితే 'అంజైనా' (కొద్ది నిమిషాలు ఉండే ఛాతినొప్పి) వస్తుంది.

ధమనిలో రక్తపు గడ్డ ఏర్పడి పూర్తి అవరోధం కలిగితే, దానికి సంబంధించిన గుండె భాగానికి రక్త ప్రసారం అందక 'గుండెపోటు' (హార్ట్ ఎటాక్) వస్తుంది. 'అంజైనా', 'గుండెపోటు' మొదలైన లక్షణాలకు దారితీసే 'కరోనరి' ధమనుల వ్యాధిని కరోనరి అర్టెరీ డిసీజ్ - సి.ఎ.డి. అంటారు.



అమెరికా వంటి దేశాల్లో ఇరమయ్యవ శతాబ్దం ఆరో దశకంలో ఈ కరోనరీ వ్యాధి అతి విస్తారంగా ఉంది. కొలెస్టరాల్ (రక్తంలో ఉండే కొవ్వు పదార్థం), అధిక రక్తపోటు, ధూమపానం మొదలైన వాటిని ప్రధాన కారణాలుగా వారు గుర్తించి తమ ఆహారపుటలవాట్లను మార్చుకొని బి.పి.ని, మధుమేహాన్ని అదుపులో ఉంచుకున్నారు. పొగతాగడం మానివేసి, తగిన వ్యాయామం చేయడం వల్ల గత మూడు దశాబ్దాలుగా ఆయా దేశాల్లో ఈ వ్యాధి తగ్గుముఖం పట్టిందని వైద్యులు పేర్కొంటారు.

కానీ మనదేశంలో మాత్రం నాలుగు దశాబ్దాల క్రితం తక్కువగానే కనిపించిన ఈ వ్యాధి, గత ఇరవై సంవత్సరాలుగా అనూహ్యమైన రీతిలో విజృంభిస్తున్నది. ఇక్కడ నూటికి ఎనిమిది నుంచి పన్నెండు మందికి ఈ వ్యాధి ఉందని, సుమారు నాలుగు కోట్ల మంది భారతీయులు దీనితో బాధపడుతున్నారని వైద్యనిపుణులు చెబుతున్నారు.

1990లో అమెరికాలోని ఇలినాయ్ రాష్ట్రానికి చెందిన ఎనాస్.ఎ.ఎనాస్. అనే వైద్య శాస్త్రజ్ఞుడు, అతని బృందం జరిపిన అధ్యయనంలో అమెరికాలో నివసిస్తున్న ఇతర జాతుల కంటే అక్కడ స్థిరపడిన భారతీయుల్లో, వారి సంతతిలో గుండె పోటు వ్యాధి ఎక్కువగా వస్తున్నదని కనుగొన్నారు.

వివిధ దేశాలలోని ప్రవాస భారతీయుల్లో కూడా ఈ వ్యాధి ఎక్కువగానే ఉందని సింగపూర్, ఉగాండా, దక్షిణాఫ్రికా, ఫిజీ, ట్రానిడ్, మారిషస్, బ్రిటన్ దేశాల్లో జరిగి అధ్యయనాల్లో దృఢపడింది.

అందువల్లనే జన్యుకారణాల వల్లగానీ, ఇతర కారణాల వల్ల గానీ భారత జాతిలో ఈ వ్యాధి తీవ్రంగా వస్తుందని వైద్య శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు.

అంజైనా (చిన్ననొప్పి) రాకుండా మొదట్లోనే గుండెపోటు రావడం అనేది భారతీయుల్లో అధికం. 30-39 సంవత్సరాల మధ్య ఉండే చిన్న వయస్సువారికి కూడా ఈ వ్యాధి ఎక్కువగా వస్తున్నది.

యాభై సంవత్సరాలలోపు వారిలో, అంటే ఇతర దేశాలలో కనీసం ఐదు సంవత్సరాలకంటే ముందే మన దేశస్థులకు గుండెపోటు వస్తున్నది.

గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల పొడవునా వ్యాధి విస్తరించి, శస్త్రచికిత్సకు కూడా అనువుగాని విధంగా ఉండడం, చిన్న వయస్సులోనే తీవ్రమైన కాంప్లికేషన్లకు దారి తీసే మరణాలు సంభవించడం మనదేశంలో ఎక్కువని వైద్య శాస్త్రజ్ఞులు వెల్లడిస్తున్నారు.

పాశ్చాత్యదేశాల్లో లాగా ఎల్.డి.ఎల్ (చెడ్డ కొలెస్ట్రాల్), అధిక బి.పి., పొగతాగడం, మానసిక ఆందోళనలు మొదలైన కారణాల వల్ల మాత్రమే మనదేశంలో గుండెపోటు వ్యాధి ఎక్కువ అవుతుందని చెప్పడానికి వీలు లేదని వైద్య శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. భారతీయుల్లో ఈ వ్యాధి ఎక్కువగా రావడానికి మరికొన్ని ప్రత్యేక కారణాలున్నాయని వారు అంటున్నారు.

పాశ్చాత్య దేశాల కంటే పది సంవత్సరాల ముందే, భారతీయుల్లో మధుమేహం ఎక్కువగా రావడం సంభవించిందని, మధుమేహంతోపాటు గుండె పోటు వ్యాధి కూడా మనదేశంలో విస్తృతంగా వస్తుండడం వల్ల వీటి కారణాల గురించి చాలా పరిశోధనలు జరిగాయి. 1988 లో రీవెన్ అనే వైద్య శాస్త్రజ్ఞుడు కొన్ని జీవరసాయన, జీవనక్రియా లోపాలను 'ఇన్సులిన్ రెసిస్టెన్స్ సిండ్రోమ్' లేక 'సిండ్రోమ్ - ఎక్స్' అనే పేరుతో వర్ణించాడు.

యాపిల్ పండు ఆకారంలో బొజ్జ ఎక్కువగా ఉండే స్థూలకాయం (సెంట్రల్ ఒబేసిటీ) ఈ సిండ్రోమ్ లక్షణాల్లో ఒకటి. నడుం, తుంటి నిష్పత్తి పురుషుల్లో 0.8 కంటే ఎక్కువగా ఉన్నా స్త్రీలలో 0.9 నిష్పత్తిలో వున్నా ఇటువంటి స్థూలకాయం ఉంటుందని చెప్పవచ్చు.

దీనితోపాటు రక్తంలో హెచ్.డి.ఎల్. (మంచి కొలెస్టరాల్) తక్కువగా ఉండడం, ట్రిగ్లిజరైడ్లు ఎక్కువగా ఉండడం, లైపోప్రొటీన్ (ఎ) ఎక్కువగా ఉండడం, రక్తంలో సుగర్‌తో పాటు ఇన్సులిన్ కూడా ఎక్కువగా ఉండడం, ఇన్సులిన్ ఎక్కువగా ఉన్నా దాని విధి నిర్వహణలో సామర్థ్యం లోపించడం మొదలైన

కారణాలన్నీ మూకుమ్మడిగా ముట్టడించి మధుమేహానికి, గుండెపోటు, పక్షవాతం మొదలైన రక్తనాళాల వ్యాధులకు దారితీస్తున్నాయని వైద్య శాస్త్రజ్ఞులు అభిప్రాయ పడుతున్నారు.

పాశ్చాత్య దేశాల్లో లాగా కాకుండా, భారతీయుల్లో గుండెపోటు వచ్చినవారిలో చాలా మందికి టోటల్ కొలెస్టరాల్ మామూలు స్థాయిలోనే ఉంటున్నది. అయితే టోటల్ కొలెస్టరాల్ రెండు వందల మిల్లీ గ్రాముల కంటే తక్కువ ఉంటే మంచిది. హెచ్.డి.ఎల్. (మంచి కొలెస్టరాల్) రక్తనాళాల గోడల్లో చెడ్డ కొలెస్టరాల్ మొదలైనవి పేరుకొని పోకుండా కాపాడుతుంది.

ఈ మంచి కొలెస్టరాల్ యాభై మిల్లీ గ్రాముల కంటే ఎంత ఎక్కువగా ఉంటే అంత మంచిది. జన్యువులలోని లోపాల మూలంగా భారతీయుల్లో మంచి కొలెస్టరాల్ ఉండవలసిన స్థాయి కంటే తక్కువ ఉంటున్నది. గుండెపోటు రాకుండా జాగ్రత్త పడదల్చుకున్న ప్రతి వ్యక్తి, టోటల్ కొలెస్టరాల్‌తో పాటు, ఎల్.డి.ఎల్, హెచ్.డి.ఎల్, ట్రైగ్లిజరైడ్లు కూడా వైద్యుడి సలహాతో పరీక్ష చేయించుకోవాల్సి ఉంటుంది.

రక్తంలో ట్రైగ్లిజరైడ్ల స్థాయి భారతీయుల్లో ఉండవలసిన దానికంటే ఎక్కువ ఉంటున్నది. ట్రైగ్లిజరైడ్లు ఎక్కువ అయిన కొలదీ రక్తంలో మంచి కొలెస్టరాల్ స్థాయి తగ్గిపోతూ ఉంటుంది.

భారతీయుల్లో ట్రైగ్లిజరైడ్లు నూటయాభై మిల్లీ గ్రాముల కంటే తక్కువ ఉంటే మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

టోటల్ కొలెస్టరాల్ – మంచి కొలెస్టరాల్ నిష్పత్తి 4:5 కంటే తక్కువ ఉంటే మంచిది. ట్రైగ్లిజరైడ్లు ఎక్కువ స్థాయిలో ఉంటే ఇది చెడ్డ కొలెస్టరాల్‌తో జతకట్టి రక్త నాళాల గోడల్లో పేరుకు పోవడానికి దోహదపడుతుంది. రక్తంలో ట్రైగ్లిసరైడ్లు ఉన్నవారు తీపి పదార్థాలను, మద్యం పదార్థాలను, కొవ్వు పదార్థాలను బాగా తగ్గించి, రోజువారి నడక వంటి వ్యాయామాన్ని కొనసాగించాలి.

వైద్యుని సలహాతో మితంగా చేపలను తినవచ్చు. ప్రతిరోజూ నడక వల్ల రక్తంలో మంచి కొలెస్టరాల్ పెరిగే అవకాశం ఉంది. ఆహార నియమాలు, వ్యాయామం వల్ల కూడా కొలెస్టరాల్ మామూలు స్థాయికి రాకపోతే వైద్యుడు సూచించే ఔషధాలను వాడాలి. లైపోప్రొటీన్ (ఎ) అనే ప్రొటీన్ కొవ్వు మిశ్రమ పదార్థం భారతీయుల రక్తంలో ఎక్కువ స్థాయిలో ఉంటున్నదని ఇటీవలనే శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ లైపోప్రొటీన్ (ఎ) మనం తినే ఆహారం వలన గాక, జన్యుకారణాల వల్ల (వంశపారంపర్యంగా) సంక్రమిస్తుందని వారు తెలియజేశారు.

రక్తనాళాల్లో కొవ్వు పదార్థాలు పేరుకొనేటట్లు, టోటల్ కొలెస్టరాల్ కన్నా 15 రెట్లు శక్తివంతమైనదని కనుగొన్నారు. రక్తంలో 'హోమోసిస్టీన్' అనే ఎమైనోఏసిడ్ ఎక్కువగా ఉండటం వల్ల భారతీయుల రక్తనాళాల్లో ఎల్.డి.ఎల్. పేరుకుపోయి అవరోధాలకు దారితీస్తున్నదని శాస్త్రజ్ఞులు కనిపెట్టారు.

ఈ విధంగా ఎల్.పి.(ఎ), ట్రైగ్లిజరైడ్లు ఎక్కువగా ఉండడంవల్లనూ, మంచి కొలెస్టరాల్ తక్కువగా ఉంటుంది. ఇన్సులిన్ నిరోధకత, మధుమేహ వ్యాధి, రక్తంలో హోమోసిస్టీన్ ఎక్కువగా ఉండటం మొదలైన కారణాలే భారతీయుల్లో గుండెపోటు ఎక్కువగా రావటానికి మూలమని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. ఇలాంటి జన్యు కారణాలతో పాటు, వేగమైన జీవనశైలి, పట్టణాలకు వలస, పారిశ్రామికీకరణ వల్ల కలిగే దుష్ఫలితాలు, మానసిక ఒత్తిడులు, ఆందోళనలు, నగరాల్లో ఫాస్ట్‌ఫుడ్స్, శీతల పానీయాల సేవనం, మితి మీరి ఆహారం భుజించడం మొదలైన అంశాలు కూడా దీనికి కారణాలుగా చూపిస్తున్నారు.

జన్యు సంబంధమైన కారణాలు గుండె పోటు వ్యాధికి రంగం సిద్ధం చేస్తే, వేగమైన జీవన విధానం జబ్బును బయటపడేస్తుందని చెప్పవచ్చు. జన్యుకారణాలను తుపాకీతో పోలిస్తే, జీవన శైలి మీటనొక్కడం వంటిదని వైద్య నిపుణులు ఎనాస్. ఎ ఎనాస్ అభివర్ణించారు

భారత దేశం క్షయ, కుష్ఠు, మలేరియా, టైఫాయిడ్, అతిసార మొదలైన వ్యాధులతో పోరాడుతూనే, నవనాగరిక వ్యాధులైన గుండెపోటు, మధుమేహం, అధిక రక్తపోటు, పక్షవాతం వంటి వ్యాధులతో కూడా పోరాడవలసి రావడం దురదృష్టకరమని అభిప్రాయ పడుతున్నారు.

ఈ ఆధునిక వ్యాధుల నివారణకు మితమైన సాత్వికాహారం, రోజువారీ వ్యాయామం, ఆందోళనలను దూరంగా ఉంచే మానసిక ప్రశాంతత అవసరం. పొగతాగటం, మద్యపానం, మితిమీరి తినడం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలి.

ప్రతి ఆరునెలలకొకసారి వైద్యుని వద్ద బి.పి., సుగర్, కొలెస్టరాల్ పరీక్షలను చేయించుకోవాలి. ఆ వ్యాధులు ఉన్నవారు తగిన వైద్య సలహాలను తీసుకొని వాటిని అదుపులో ఉంచుకోవాలి. చిన్న వయస్సులోనే గుండెపోటు, మధుమేహం, రక్తపోటున్నవారి కుటుంబ సభ్యులు మరింత జాగ్రత్త తీసుకొని తరచుగా చెకప్ చేయించుకోవాలి. నూతన శతాబ్దంలో కూడా ముప్పులా వ్యాపించే అవకాశాలున్న కరోనరి రక్తనాళాల వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే, ప్రతి వ్యక్తి తగిన వైద్య విజ్ఞానాన్ని కలిగి ఉండి, వైద్యులు వివరించే నివారణ విధానాలను నియమబద్ధంగా పాటించగలిగితే గుండెజబ్బులు రాకుండా అరికట్టవచ్చు.

(హెల్త్‌హెల్ప్ సౌజన్యంతో)



నవలా విమర్శ

"తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం" అనే పరిశోధన గ్రంథాన్ని వెలువరించిన డా॥ పి.సంజీవమ్మగారు తాము రాసిన విమర్శా వ్యాసాలను, ప్రసంగ వ్యాసాలను, స్మారకోపన్యాసాలను అన్నింటిని కలిపి "సాహిత్య విమర్శ" పేరుతో పుస్తకంగా వెలువరించారు.

తెలుగులో నవలా విమర్శ చాలా తక్కువ. ప్రత్యేకంగా నవల మీద విమర్శ చేసేవాళ్ళను వేళ్ళమీద లెక్కపెట్టుకోవచ్చు. అలాంటి అరుదైనవాళ్ళలో డా॥పి.సంజీవమ్మ గారొకరు. నవలా పఠనం మీద వారి ఆసక్తిని, నవలా విమర్శ మీద వారి ప్రత్యేక దృష్టిని ఈ వ్యాసాలలో గుర్తించవచ్చు. ఈ వ్యాసాలలో మార్క్సిస్టు దృక్పథంతో మొదలైన వారి విమర్శ, స్త్రీవాద దృక్పథాన్ని సంతరించుకుని మరింత నిగ్గుతేలింది.

రామప్పపంతులు, గిరీశం, కరటక శాస్త్రి వంటి లౌక్య పురుషులకు, పండితులకు లేని నీతి ఒక సాని దానికుందని "గురజాడ వారి మధురవాణి" రుజువుచేస్తుంది. అయినా వాళ్ళందరిని ఆమె ఔదార్యంతో, క్షమా దృష్టితో చూసి ఉపకారం చేస్తుంది. వేశ్యావృత్తి నిర్మూలనకు పాటుపడుతున్న సౌజన్యరావు వంటి సంస్కర్తలకు ఆమె వేసిన ప్రశ్నలు ఆలోచింపచేస్తాయి. సాహిత్యంలో స్త్రీ పాత్రలకు శరత్ ప్రాధాన్యం ఇచ్చినంతగా మరే రచయితా ఇచ్చి వుండడు. ఆయన సాహిత్యమంతా నాయికా ప్రధానమైనా, ఆ నాయికలు వ్యక్తిత్వం నిండారిన సజీవ వ్యక్తులుగా దర్శనమిస్తారు. శరత్ స్త్రీ పాత్రల ముందు దాదాపు పురుష పాత్రలన్నీ బలహీనమైనవే. స్త్రీల ప్రేమ, కరుణ, త్యాగం ముందు అందరూ ఓడిపోయినట్లుగా చిత్రించాడు రచయిత. తన నవలలన్నింటా స్త్రీ హృదయాన్ని ఆవిష్కరించాడని "శరత్ సాహిత్యంలో స్త్రీలు" అనే వ్యాసంలో నిరూపించారు. విశ్వనాథ సాహిత్యం సర్వసాధారణంగా ఆధునిక సంస్కృతిని పాశ్చాత్య సంస్కృతి అంటూ నిరసించడం తోటి, ఫ్యూడల్ సంస్కృతిని మహోన్నతంగా దర్శింపజేయడంతోటి నిండివుంటుంది. ఇందులో గతాన్ని ఆదర్శీకరించడం ప్రధానమైనది. ఆధునిక వైద్య విజ్ఞానం, విద్యా విధానం, నాగరికతలు అన్నీ విజాతీయం అంటూ నిరసించడంలో మనకు వాటి గుణాలు, మేళ్ళు ఏమీ కనిపించలేదు. జమీందారీ సంస్కృతి పట్ల వున్న మమకారం వల్ల, ఆ సంస్కృతిలో కాలదోషానికి గురియైన విషయాలు కూడా ఏవీ కనిపించలేదు. స్త్రీ విద్య, బాల్య వివాహాలు, శారదా చట్టం, వితంతు వివాహాలు మొదలైన విషయాల గురించి 'వేయి పడగలు' నవలలోని చర్చలు, అభిప్రాయాలు గమనిస్తే ఆ విషయంగా సమకాలీన సామాజిక నైతిక చైతన్యాన్ని పూర్తిగా అడ్డుకోవాలనే మొండి పట్టుదల కనిపిస్తుంది. కాలం చెల్లిన అభిప్రాయాలను సమర్థించడంలో, సంప్రదాయం పేరుతో వాటిని పునరుద్ధరించాలన్న ప్రయత్నంలో రచయిత తన పాండిత్యాన్ని, శ్రమను వృథా చేసుకున్నారని "విశ్వనాథ వేయిపడగలు- స్త్రీల పట్ల వ్యక్తమైన భావనలు" అనే వ్యాసంలో తెలియజేశారు. చలం స్త్రీ పక్షపాతి, భావుకుడు, సంవేదనా శీలి. సంప్రదాయం పేరుతో ఛాందస సమాజం, పురుష దౌష్ట్యం స్త్రీలను నికృష్టంగా అణచివుంచిన పరిస్థితికి ఆగ్రహించిన చలం, సమాజానికి తన తిరుగుబాటును తెలియజేయడానికి సాహిత్యాన్ని ఆధారంగా చేసుకున్నాడు. చలం హృదయమంతటితోనూ పరితపించే సమస్య స్త్రీ సమస్య. చలం భావనలే స్త్రీవాద సాహిత్యానికి పునాదులు. ఈనాడు ఎన్నో కోణాల నుండి, మరెన్నో సమస్యల గురించి స్త్రీవాద సాహిత్యం ఈ సమాజాన్ని ప్రశ్నిస్తుంది, నిలదీస్తూ వుంది. ఈ వారసత్వాన్ని వారు చలం నుంచి అందుకున్నారు. ఇదే చలానికి, స్త్రీవాద సాహిత్యానికి వున్న బాంధవ్యాన్ని తెలియజేస్తుంది. "తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం" అనే వ్యాసంలో 1980ల నుండి 1995 వరకు వచ్చిన స్త్రీవాద కవిత్వాన్ని, అందులో వివిధ సమస్యల నూతన కోణాల్ని ఆవిష్కరించిన కవితల విశ్లేషణను చూడవచ్చు.



సాహిత్య విమర్శ
(వ్యాసాలు)
రచన : డా॥ పి.సంజీవమ్మ, కడప జిల్లా, అభ్యుదయ రచయితల సంఘం. ప్రచురణ!
వెల : 90రూ॥; పేజీలు : 178.
ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు

జీవిత వాస్తవాల వెనుకదాగిన సామాజిక వాస్తవాల్ని, వాటి ప్రత్యేకతల్ని వెల్లడించడం వాస్తవికత. తెలుగు సాహిత్యంలో వేమన, గురజాడతో మొదలుకొని 1970ల వరకు వచ్చిన వాస్తవికవాద నవలల క్లుప్త వివరణతో "నవల - వాస్తవికత"ను సరిపుచ్చారు. 1997లో ఇచ్చిన స్మారకోపన్యాసాన్ని మరింత సమగ్రంగా రూపొందించింతే బాగుండేది. మార్క్సిస్టు మేధావులైన రచయితలు, నవలాకారులు తెలుగు సాహిత్యాన్ని ఎలా సుసంపన్నం చేశారో వివరించే వ్యాసం "తెలుగు నవల మీద మార్క్సిజపు ప్రభావం", "రచయిత చైతన్యం - సామాజిక చైతన్యం" రెండూ పరస్పరాశ్రయాలే అయినప్పటికీ, ప్రస్తుత దశలో ప్రగతిశీలమైన రచయితకు స్పందనతో కూడిన సమగ్రమైన సామాజిక అవగాహన చాలా అవసరమని తెలియజేస్తారు. "ఒక స్త్రీగా స్త్రీల కష్టాల్ని, సమస్యల్ని తప్పుకుంటూ ఆలోచిస్తూపోతేనే అభ్యుదయ నవలల్లోని స్త్రీ జీవిత చిత్రణను అర్థం చేసుకోగలిగేది" అని అంటున్న రచయిత్రి వర్గరహిత సమాజంలోనే పురుషాధిక్యత భావం సమసిపోగలదనే చైతన్యాన్ని ఇవ్వగలిగినవే అభ్యుదయ నవలలని నిర్వచించారు. ఈ కోణంలో నుండి స్త్రీల జీవితాలను వివిధ కోణాల నుండి చిత్రించిన నవలల పరిశీలన "అభ్యుదయ నవలా సాహిత్యంలో స్త్రీ జీవిత చిత్రణ" అనే వ్యాసంలో కనిపిస్తుంది. రచయిత్రుల నవలల్ని ప్రారంభం నుండి పరిశీలిస్తే కథా వస్తువును ఎన్నుకోవడంలో, పాత్ర చిత్రణలో, సమస్యల్ని విశ్లేషించడంలో ఒక క్రమ పరిణామాన్ని గమనించవచ్చు అంటూ ముందుగా పాపులర్ రచయిత్రుల నవలా ధోరణుల గురించి వివరించారు. తర్వాత అభ్యుదయ చైతన్యం కలిగిన రచయితలలో వాసిరెడ్డి సీతాదేవి, రంగనాయకమ్మలతో పాటు స్త్రీవాద దృక్పథంతో కూడిన ఓల్గా నవలల విశ్లేషణతో ముగిసిన వ్యాసం బాగుంది. కడప జిల్లా నుంచి వచ్చిన నవలల గురించి వివరిస్తూ 1925 ప్రాంతంలో కడపజిల్లా మొదటి నవలా రచయిత కిలవటాల జయరామారావు గారి నవల "రేనాటి పరుగు"ను ఆనాటి సామాజికాంశాల వెలుగులో విశ్లేషించారు. కడప జిల్లాలో అభ్యుదయ రచయితలు రాష్ట్రంలో ఉద్యమం స్తబ్దత వహించిన కాలంలో కూడా ఎంతో చైతన్యంతో సాహిత్య కృషిని కొనసాగించారని తెలుపుతూ కడప అభ్యుదయ రచయితల - కవుల పరిచయాన్ని చేశారు. సామాజిక నిబద్ధత కలిగిన కేతు విశ్వనాథరెడ్డి సృష్టించిన సాహిత్యంలో విశ్లేషణాత్మక - విమర్శనాత్మక - వాస్తవికతావాద కథనరీతి ప్రధానంగా చోటుచేసుకుందని సోదాహరణంగా వివరించారు. తర్వాత "బంగారు కథలు" సంకలనం, తంగిరాల వారి "రేనాటి సూర్యచంద్రులు" పై చేసిన గ్రంథ సమీక్షలు చోటుచేసుకున్నాయి. మొత్తానికి విమర్శ సాహిత్య పఠనాసక్తిని పెంచగలగాలి అన్న రచయిత్రి అభిప్రాయాలతో విభేదించేవారు ఉండకపోవచ్చు.

సమగ్ర అధ్యయనం, సునిశిత పరిశీలనలతో రూపొందించిన ఈ వ్యాసాలు రెఫరెన్స్ విలువలతో కూడుకొని సంజీవమ్మ గారిని విమర్శకురాలిగా నిరూపిస్తాయి. అయితే చాలా వరకు వ్యాసాలన్నీ ఒకే అంశానికి సంబంధించినవి కావడం వల్ల, అన్ని వ్యాసాలను ఒక్కసారిగా చదవడం వల్ల, రిపిటీషన్ ఉన్నట్లుగా పాఠకుడు భావించే అవకాశముంది. అందుకని వ్యాసాల ఎంపికలో కూడా జాగ్రత్త తీసుకోవాల్సిన అవసరమున్నదని రచయిత గమనించాలి.

-కె.పి.అశోక్ కుమార్

స్వీకారం



అభివృద్ధిలో ఆదివాసీలు?
రచన : పల్లా త్రినాథరావు;
వెల : 50రూ॥; ప్రతులకు: లయ, ఫ్లాట్ నెం.501, కురుపం కాసిల్, ఈస్ట్‌పాయింట్ కాలనీ, విశాఖపట్నం.

సరోజిని

మీరు నగరాలలోని రణగొణ ధ్వనులు, పని ఒత్తిడి, కాలుష్యం నుంచి ప్రశాంతతను కోరుకుంటున్నారా? అయితే సహజ సిద్ధమైన అందాల నడుమ, ప్రశాంత వాతావరణంలో గడిపేందుకు మధ్యప్రదేశ్ పర్యటనకు వెళ్తే ఒక కొత్త వాతావరణంలో గడపగలుగుతారు. ఎం.పి.కి గొప్ప చారిత్రాత్మక చరిత్ర ఉంది. అక్కడ అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి.

కనువిందు చేసే 'కాన్హా'

వాటిలో సాంచీ, ఖజురహో, మాండు, ఉజ్జయిని వంటి చారిత్రక స్థలాలు, ఓర్చా, ఓంకారేశ్వర్, మహియార్ వంటి పుణ్య క్షేత్రాలు, పంచమార్హి, కాన్హా, బాంధవఘర్ వంటి వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు ఉన్నాయి. మన అభిరుచులకు అనుగుణంగా వీటిలో ఎక్కడికైనా వెళ్ళ వచ్చు.

మధ్య ప్రదేశ్‌లో ప్రకృతి ప్రసాదించిన సుందర హరిత ప్రాంతాలు, అద్భుత ప్రకృతి దృశ్యాలతో అలరారే ప్రదేశాలు ఉన్నాయి. చక్కటి నిర్వహణలో, ఆరోగ్యవంతంగా ఉన్న వన్య ప్రాణులతో నిండి ఉన్న ఈ వన్యప్రాణి కేంద్రాలను దర్శించి ఎంతో మానసిక ప్రశాంతతను పొందవచ్చు.

పెద్ద సంఖ్యలో పులులతో, వాటి గాండ్రింపులతో ఉండే కాన్హాలో ఎంతో ఆహ్లాదాన్ని పొందవచ్చు. దీనిని 1955లో ఏర్పాటు చేశారు. దేశంలో చక్కటి పర్యవేక్షణలో, ఎంతో ఆరోగ్యవంతమైన పరిస్థితులతో ఈ కేంద్రం ఉంది.

కాన్హాలోని అద్భుత ప్రకృతిని తిలకించాలంటే ఏనుగుపై ప్రయాణించాల్సిందే. ఈ పార్కు మొత్తం 939.94 కి.మీ. విస్తీర్ణంలో ఉంది. ఇక్కడ 22 రకాల క్షీరదాలు ఉన్నాయి. ఈ కేంద్ర అన్ని రకాల వన్య ప్రాణులతో పర్యాటకులకు ఉల్లాసాన్నిస్తుంది. బ్లాక్‌బక్, చిరుతపులి, బారాసింఘా, సాంబార్, బార్కింగ్ డీర్, నక్క అడవి పంది వంటి వాటితో పాటు పెద్ద పులులు, నక్కలు, ఎలుగుబంట్లు, చారల హైనాలు, అడవి పిల్లుల వంటి అనేక జంతువులు పెద్ద సంఖ్యలో ఉన్నాయి.



ఈ జంతువులతో పాటు అనేక రకాల పక్షులను కూడా పర్యాటకులు వీక్షించే అవకాశాలు ఇక్కడ ఉన్నాయి. దాదాపు 200 జాతుల పక్షులను ఇక్కడ చూడవచ్చు. నీటి పక్షులను అక్కడ అనేకంగా ఉన్న కాలువ గట్ల మీద చూడ గలము. పార్కులోని అత్యంత సుందరమైన ప్రదేశం బామ్నీ దాదర్. అక్కడ అద్భుతమైన సూర్యాస్తమయాన్ని తిలకించే వీలుంది.

కాన్హాలోని చిక్కటి, పచ్చని అడవులను కూడా ఇక్కడి నుంచి చూడవచ్చు. ఈ అడవుల్లో కూడా అనేక రకాల జంతువులు ఉన్నాయి. ఈ పార్కులోకి ప్రవేశ సమయాలు ఉదయం 6.30 నుంచి 10 గంటలు, మధ్యాహ్నం 2.30 నుంచి 6 గంటలు. ఇక్కడ ప్రవేశ రుసుం భారతీయులకు 20 రూపాయలు, విదేశీ పర్యాటకులకు 200 రూపాయలు ఉంటుంది. ఏనుగుపై ప్రయాణించాలంటే భారతీయులకు 60 రూపాయలు, విదేశీ పర్యాటకులకు 300 రూపాయలు వసూలు చేస్తారు.

ఇక్కడకు వెళ్ళాలంటే ఫిబ్రవరి నుంచి జూన్ మంచి అనుకూలమైన సమయం. కాన్హా నాగపూర్‌కు 260 కి.మీ. దూరంలోనూ, జబల్‌పూర్‌కు 170 కి.మీ. దూరంలోనూ ఉంది. ఈ రెండు ప్రదేశాల నుంచి విమాన సదుపాయాలున్నాయి. బిలాస్‌పూర్, జబల్‌పూర్‌లు చాలా అనుకూలమైన రైలు మార్గాలు. జబల్‌పూర్ నుంచి ఈ కేంద్రానికి రోజూ బస్‌లు వెళ్ళి వస్తుంటాయి. జబల్‌పూర్, బిలాస్‌పూర్, రాయ్‌పూర్ నుంచి టాక్సీలు అందుబాటులో ఉంటాయి. మధ్యప్రదేశ్ పర్యాటక విభాగం కూడా జీపులను సరఫరా చేస్తుంది. సూర్యాస్తమయం తరువాత ఈ కేంద్రంలోకి వాహనాలను అనుమతించరు.



భారతీయ సినిమా రంగంలో వ్యాపార దృక్పథంలో రూపొందుతున్న చిత్రాలు సినిమా 'కళ'కు గొడ్డలిపెట్టులా తయారవుతున్నాయనే నిజాన్ని టాకీలు వచ్చిన మూడవ దశకంలోనే సత్యజిత్ రే గుర్తించారు. అందుకు భిన్నంగా భారతీయ సినిమాలను నవ్యమార్గం పట్టించి అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన ఘనత 'సత్యజిత్‌రే'కే దక్కుతుంది. ఈయన తీసిన కళాఖండం 'పథేర్ పాంచాలి'కి ఇది స్వర్ణోత్సవ సంవత్సరం.

యాభైఏళ్ల కళాఖండం పథేర్ పాంచాలి

హెచ్.రమేష్‌బాబు

రే బాల్యం నుంచీ స్వతహాగా చిత్రకారుడు. చిత్రకారుడుగానే ఎదగాలని రవీంద్రుని వద్ద శిష్యరికం చేశారు. కానీ ఆయన ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా శాంతినికేతన్ నుంచి ఇంటికొచ్చి ఉద్యోగాన్వేషణలో పడి ఒకానొక అడ్వర్‌టైజ్‌మెంట్ కంపెనీలో ఆర్టిస్టుగా చేరి అనతికాలంలోనే పైకి ఎదిగారు. అంతలోనే సినిమారంగం వైపు ఆయన దృష్టి మళ్ళి తొలుత 'ప్రిజనర్ ఆఫ్ జెండా' ఆధారంగా ఒక స్క్రీన్‌ప్లే రాసుకుని నాటి ప్రముఖ దర్శకుడు బిమల్ రాయ్ వద్దకు వెళితే ఆయన పట్టించుకోలేదు. తిరిగి రవీంద్రుని 'ఘర్ బైరే' కథ ఆధారంగా మరో స్క్రీన్‌ప్లే రాసుకుని ఒక నిర్మాత, దర్శకులను ఒప్పించాడు. కానీ వారి వ్యాపార దృక్పథాన్ని అనుసరించలేనని ఖరాఖండిగా చెప్పేసి బయటికొచ్చారు.

సరిగ్గా ఆ కాలంలోనే బిబూతి భూషణ్ బందోపాధ్యాయ రచించిన ప్రఖ్యాత నవల 'పథేర్ పాంచాలి'ని కుదించి బాలలకోసం దానిని మరో పేరుతో వెలువరిస్తూ, బొమ్మలు వేయమని రేకు ఇచ్చారు. అయితే అంతకు మునుపే ఈ నవలను అనేక సార్లు చదివిన ఆయనకు చిత్రాలు వేస్తున్నప్పుడు సినిమాగా తీసేందుకు చక్కగా ఈ కథ పనికి వస్తుందని గ్రహించి 'పథేర్ పాంచాలి'ని సినిమాగా తీయాలని అనుకున్నారు. ఇది జరిగింది 1945లో.

ఈ నేపథ్యంలో సినిమాకళపై పూర్తి పట్టును సాధించాలని ప్రపంచ వ్యాప్తంగా రూపొందిన అత్యుత్తమ చిత్రాలను చూడాలని మిత్రుడు చిదానంద్ దాస్ గుప్తాతో (ప్రముఖ సినిమా విమర్శకుడు) కలిసి 1949లో ఫిల్మ్ సొసైటీని స్థాపించారు. దేశంలో తొలి ఫిలిం సొసైటీ ఇదే. 1950లో ఆయన పనిచేస్తున్న అడ్వర్‌టైజ్‌మెంట్ కంపెనీ రేను లండన్‌లోని తమ ప్రధానకార్యాలయానికి పంపింది. అలా లండన్ వెళ్ళి అక్కడున్న అయిదు నెలల్లో 99 సినిమాలు చూశారాయన. జీన్ రినాయర్, విట్టోరియా డిసికాల చిత్రాలు ఆయనను బాగా ప్రభావితం చేశాయి. అయితే 1951లో భారతదేశంలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రదర్శించిన విట్టోరియా డిసికా చిత్రం 'బైసికిల్ థీవ్స్' గురించి చర్చించడం ఎంతైనా అవసరం.

ఒక నిరుద్యోగికి అనుకోని విధంగా పోస్టర్లు అతికించే ఉద్యోగం దొరికినా ఆ ఉద్యోగం సైకిల్ ఉన్నవారికే ఇస్తామని షరతు పెడతారు. ఇంట్లోని సామానులు అన్నీ అమ్మగా వచ్చిన సొమ్ముతో సైకిల్ కొని ఉద్యోగం సంపాదించుకుంటే రెండు రోజులకల్లా ఆ సైకిల్ నెవరో దొంగిలించుకుపోతారు. సైకిల్ పోగొట్టుకున్న యువకుడు, అతని ఐదేళ్ళ కొడుకూ సైకిల్ కోసం వెదుకుతుండగా నాటి యూరప్ నగరాల దారిద్ర్యాన్ని ఆ ఐదేళ్ళ కుర్రాడి కళ్ళతో మనకు డిసికా 'బైసికిల్ థీవ్స్'లో చూపించారు. రే తన చిత్రంలో 'అప్పు' కళ్ళద్వారా బెంగాలీ గ్రామీణ జీవితాన్ని మన కళ్ళకు కట్టేట్లుగా చూపించారు.

రే 'పథేర్ పాంచాలి' స్క్రీన్‌ప్లే రాసుకుని స్క్రిప్టు చేతబట్టుకుని చాలామంది నిర్మాతల వద్దకు వెళ్ళారు. సినిమా అనుభవంలేని రేను గాక మరో దర్శకుడితో అయితే తీస్తామని వారు చెప్పారు. మరికొందరు పెద్ద తారలతో తీస్తామన్నారు. రే అంగీకరించక తానే స్వంతంగా సినిమాను నిర్మించాలనుకున్నారు. కానీ మరి డబ్బు గురించిన సమస్య వచ్చి పడిందాయనకు.

రే తొలుత తన జీవిత భీమా పాలసీపై ఏడువేల రూపాయల లోన్ తీసుకున్నారు. మిత్రులు కొంత ఇవ్వగా మొత్తం తొమ్మిది వేల అయిదు వందల పెట్టుబడితో సినిమా నిర్మాణం మొదలైంది. కెమెరామెన్‌గా సుబ్రతోమిత్రా, ఆర్ట్ డైరెక్టర్‌గా వంశీ చంద్రగుప్తా, దలాల్ దత్తాను ఎడిటర్‌గా తీసుకున్నారాయన. ఇక నటీనటుల విషయానికి వస్తే ఈ చిత్రంలో ఇంద్ర ఠాకూరాణిగా చిరస్మరణీయమైన పాత్రను పోషించిన చున్ని బాలాదేవికి



రోజుకు 20 రూపాయలు మాత్రమే ఇచ్చేవారు. సుబీర్ బెనర్జీ, జమీదాస్ గుప్తాలు బాలతారలు. వీరికి పారితోషికం ఏమీలేదు. ఇలా సినిమా చిత్రీకరణ మొదలైంది.

అయితే పథేర్ పాంచాలిని తెరకెక్కించడంలో 'రే' ఎదుర్కొన్న అవాంతరాలు, కష్టాలు అన్నీ ఇన్నీ కావు. తను సేకరించిన తొమ్మిదిన్నరవేలు ఎక్కడా సరిపోలేదు. సినిమా షూటింగ్ అప్పుడప్పుడు ఆగిపోయేది. ఒక దశలో యూనిట్ సభ్యులకు తిండి పెట్టేందుకు కూడా డబ్బులు కరువయ్యేవి. దాంతో రే తన భార్య 'విజయ' నగలు తాకట్టు పెట్టారు. అప్పటికామె గర్భవతి కావడంతో సీమంతం చేస్తున్నప్పుడు అలంకరించేందుకు నగలు స్నేహితురాలి వద్ద తెచ్చుకుంది. తన అత్తగారికి (సుప్రభాదే) తెలియకుండా జాగ్రత్తపడింది. ఈ విషయాన్ని రే 1958లో న్యూయార్క్‌లో ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఈ ఇంటర్వ్యూ కటింగ్‌ను భార్యకు పంపుతూ ఈ సంఘటన వివరాలేవీ కనబడకుండా సిరా పూశారు. కానీ సుప్రభాదేకు అన్నీ తెలుసు. అయినా తెలీనట్లే ఉంది.

ఆ ఇంటర్వ్యూ కటింగ్‌ను చూసి తనలో తానే నవ్వుకుందామె.

'పథేర్ పాంచాలి' సినిమా నిర్మాణానికి తప్పనిసరై రే తను ప్రాణప్రదంగా దాచుకున్న పుస్తకాలను (లైబ్రరీ) అమ్ముకున్నారు. ఆ డబ్బూ చాలలేదు. సినిమా సగం కూడా పూర్తవలేదు. దాంతో నాటి బెంగాల్ ముఖ్యమంత్రి బి.సి.రాయ్‌తో తన తల్లికి ఉన్న పరిచయాన్ని పురస్కరించుకొని ఆయనను వెళ్ళి కలుసుకున్నాడు. తాను అప్పటి దాకా తీసిన చిత్రాన్ని ఆయనకు చూపించారు. సినిమా టైటిల్ 'పథేర్ పాంచాలి' (The Song of the road)ని బట్టి ఇదేదో డాక్యుమెంటరీలాగ ఉందని భావించి రాష్ట్ర భవనాల శాఖ నుండి నిర్మాణానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. ఆ విధంగా ఎట్టకేలకు రెండులక్షల వ్యయంతో 'పథేర్ పాంచాలి'ని పూర్తిచేశారు సత్యజిత్ రే.

అలా రూపొందిన "పథేర్ పాంచాలి" 1955లో ఆగష్టు 26న కలకత్తాలోని మూడు థియేటర్లలో విడుదలైంది. కానీ సినిమా ప్రేక్షకులు ఎప్పుడు ఏ చిత్రాన్ని ఆదరిస్తారో, త్రిప్పికొడతారో చెప్పలేని స్థితి. ఈ చిత్రం ఎలా పోతుందోననే దిగులు 'రే'లో ఉండనే ఉంది. కానీ ఆయన మిత్రులు, శ్రేయోభిలాషుల ఊహలు, అంచనాలను మించి ఈ చిత్రం అనూహ్యమైన ప్రజాదరణకు నోచుకోవడంతో భారతీయ సినిమా రంగం ఒక మహత్తరమైన మలుపు తిరిగింది. అయితే బహుశా ఏ అయిదారు వారాలు పోతుందో అనుకున్న ఈ చిత్రం థియేటర్ల యాజమాన్యానికి ఒక సమస్యగా మారింది. ముందుగా ఒప్పందం చేసుకున్న ప్రకారం అదే యేడు సెప్టెంబర్ 30న భారీ తారగణం దిలీప్‌కుమార్, దేవానంద్, బీనారాయ్‌లు నటించిన జెమినీవారి 'ఇన్సానియత్' కలకత్తాలో విడుదల కావాల్సివుంది. (ఈ చిత్రం బి.ఎ.సుబ్బారావు తెలుగు చిత్రం 'పల్లెటూరి పిల్ల' -1950కు రిమేక్). కానీ పథేర్ పాంచాలికి రోజురోజుకు ప్రేక్షకాదరణ పెరిగి 14 వారాలపాటు ఏకధాటిగా ఆడింది.

ఇంతగా ప్రేక్షకాదరణ పొందిన 'రే' పథేర్ పాంచాలిలో ఏముందీ అంటే -'పథేర్ పాంచాలి' ఒక సజీవ గ్రామజీవన కావ్యం. అందులో మనం చూసేది కేవలం దారిద్ర్యం కాదు. ఒకరకంగా ఈ చిత్రంలో కనపడిన పేదరికం భారతీయ సినీ ప్రేక్షకులను బాగా కదిలించింది. 'అప్పు' ఒక పేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన కుర్రాడు. తండ్రి అర్భకపు కవికూడా. అతడి సంపాదనతో ఇల్లు గడవటం కష్టంగా ఉంటుంది. దుర్గ అనే ఆరేళ్ళపాప అతడికి అక్క. అప్పు తండ్రి ప్రభుత్వ ఉద్యోగం దొరుకుతుందని కలలు కంటూ ఆ ఉద్యోగంతో తన కుటుంబం సంతోషంగా ఎలా గడుపుతుందని ఊహించుకుంటాడు. కానీ ఉద్యోగం రాదు. బీదరికంలో మగ్గుతుంటారు. చిరిగిన బట్టలు వేసుకుని దుర్గ వీధిబడిలో చదువుతుంటుంది. పక్కింటి వారు దుర్గపై నెక్లెస్ దొంగతనం నేరం వేస్తారు. ఇంట్లోని ముసలమ్మ (చున్ని) చచ్చిపోతుంది. దుర్గ జ్వరంతో బాధపడుతూ మరణిస్తుంది. దాంతో అప్పు సంసారం కష్టాలపాలై బ్రతుకు దెరువుకై ఊరు వదిలి బెనారస్ వెళ్ళడంతో కథ ముగుస్తుంది. ఈ కథ నవలలో సగం మాత్రమే. 'పథేర్ పాంచాలి'లో గల మానవత్వం, భావనా ప్రధానమైన అంశాలు, జీవన వాస్తవాలు నన్ను ఆకర్షించాయి. అందుకే సినిమా తీసేందుకు దాన్ని ఎన్నుకున్నాను. అయితే నవలను సగం కన్నా ఎక్కువగా నేను తీయలేకపోయాను. కుటుంబం బెనారస్ వెళ్ళడంతో సినిమాను ముగించానని రే చెప్పుకున్నారు.

పథేర్ పాంచాలి సినిమాగా ఎంతగా సంచలనం సృష్టించిందో అది నవలగా వచ్చిన కాలంలో కూడా సంచలనాన్నే సృష్టించింది. బబూతి భూషణ్ చందోపాధ్యాయ రాసిన ఈ నవల 1930లో ఒక ప్రముఖ బెంగాలి పత్రికలో ధారవాహికగా ప్రచురితమైంది. రచయిత పుట్టి పెరిగిన గ్రామీణ వాతావరణం అంతా ఒక ఆత్మకథలాగా వ్రాశారు. ఇందులో కథ ఏదీ లేదని మొదట పత్రికల వారు కూడా ఒప్పుకోలేదు. పాఠకుల ప్రతిస్పందన మేరకే కొనసాగిస్తామని చెప్పారు. కానీ అనూహ్యంగా అప్పు-దుర్గల కథ పాఠకులకు నచ్చింది. సీరియల్ పాపులర్ అయింది. ఏడాది తరువాత పుస్తకంగా వెలువడి బెస్ట్ సెల్లర్ జాబితాలో చేరిపోయిందీ "పథేర్ పాంచాలి" నవల.

"పథేర్ పాంచాలి"కి వచ్చినన్ని అవార్డులు ఆయనకు మరే చిత్రానికి రాలేదంటే అతిశయోక్తి కాదు. కేన్స్ చిత్రోత్సవంలో 'బెస్ట్ హ్యూమన్ డాక్యుమెంట్', రాష్ట్రపతి ఉత్తమ చిత్రం అవార్డు, ఎడెన్‌బరో, మనీలా, శాన్ ఫ్రాన్సిస్కో, బెర్లిన్, వాంకోవర్, న్యూయార్క్, టోక్యో, డెన్మార్క్‌లలో జరిగిన చిత్రోత్సవంలో పాల్గొని పురస్కారాలను అందుకుంది.

అయితే 1956లో జాతీయ అవార్డులలో పథేర్ పాంచాలితో పోటీ పడినది బి.ఎన్.రెడ్డి తెలుగు చిత్రం 'బంగారుపాప. ఆనాడు తప్పిపోయిన స్వర్ణం మనకు నేటికీ రాకపోవడం విచారించదగిన విషయం. రే అప్పు కథ కొనసాగింపుగా 'అపరాజిత' (1956), 'అపూర్ సంసార్'గా ట్రయాలిజీని రూపొందించారు. ఏది ఏమైనా భారతీయ సినిమా రంగంలో నూతనాధ్యాయానికి శ్రీకారం చుట్టిన పథేర్ పాంచాలి సెల్యులాయిడ్ అనే పదానికి సరైన నిర్వచనంగా నిలిచిపోయింది. ✤

యుద్ధం × యుద్ధం

(హైదరాబాద్‌లో జరిగిన 'యుద్ధ వ్యతిరేక అసెంబ్లీ' సందర్భంగా)



యుద్ధం యుద్ధం యుద్ధం... వద్దుర
వద్దుర వద్దుర వద్దుర... యుద్ధం
యుద్ధం యుద్ధం యుద్ధం... చెయ్యర
చెయ్యర చెయ్యర విముక్తి... యుద్ధం

ప్రపంచ జాతుల పీడించెడిది
దేశదేశముల శాసించెడిది
అగ్రరాజ్యముల కండకావరము
అమెరికవాడి దురాక్రమణమూ
దాని పేరె సామ్రాజ్యవాదమూ
యుద్ధానికి పర్యాయపదమురా

యుద్ధం యుద్ధం యుద్ధం... వద్దుర
అమెరికవాడి యుద్ధం... వద్దుర
వద్దుర వద్దుర వద్దుర... యుద్ధం
సామ్రాజ్యవాదుల దోపిడీ... యుద్ధం
యుద్ధం యుద్ధం యుద్ధం... వద్దుర
వద్దుర వద్దుర వద్దుర... యుద్ధం

యుఎన్‌వోకె ఎసరు పెట్టిన
అమెరిక వాని సాకులు గోతులు
అఫ్ఘను రాజ్యము ఆక్రమించెరా
ఇరాకుపైనా యిరుచుకుపడెరా
ఇరాను కొరియా యుక్రేనులపై
ఇసపు చూపులతో యికలిస్తోందిర
యుద్ధం యుద్ధం యుద్ధం చెయ్యర
ఎనుపడేగ పెడరెక్కలు నరకగ
చెయ్యర చెయ్యర చెయ్యర... యుద్ధం
అమెరికవాడి పీచమణచగా
యుద్ధం యుద్ధం యుద్ధం... చెయ్యర
చెయ్యర చెయ్యర విముక్తి యుద్ధం

యుద్ధం యుద్ధం యుద్ధం చెయ్యర

ప్రపంచ దోపిడిదారుల బిడ్డలు
ఉగ్రవాదమూ మతతత్వాలూ
పరాధీన పరిపాలకులెందరొ
బానిస కొలువుకు కుదురుకున్నరూ
బహుళ జాతులా బందిఖానాలో
బడుగుదేశముల నడుములు విరిచే

విషాన్ని చిమ్మెడి కసాయి కత్తుల
యుద్ధం యుద్ధం యుద్ధం... వద్దుర
దళారి దండుల కిరాయి కొడుకుల
యుద్ధం యుద్ధం యుద్ధం... వద్దుర
వద్దుర వద్దుర వద్దుర... యుద్ధం

ద్రవ్య పెట్టుబడి ఎగుమతి... యుద్ధం
యుద్ధం యుద్ధం యుద్ధం వద్దుర
ప్రపంచ మార్కెట్ భూతం... యుద్ధం
యుద్ధం యుద్ధం యుద్ధం వద్దుర
కారుచౌక శ్రమ దోపిడి... యుద్ధం
యుద్ధం యుద్ధం యుద్ధం వద్దుర
సహజ సంపదల దొంగల యుద్ధం
యుద్ధం యుద్ధం యుద్ధం వద్దుర

ఆత్మహత్యలూ ఆకలిచావులూ
యుద్ధం యుద్ధం యుద్ధం వద్దుర
నిరుద్యోగమూ నిప్పుల వర్షం
యుద్ధం యుద్ధం యుద్ధం వద్దుర
పడమటి గాలిలా వలస బతుకులు
యుద్ధం యుద్ధం యుద్ధం... వద్దుర
నెర్రల నేలలు విచ్చిన నోరులు
యుద్ధం యుద్ధం యుద్ధం వద్దుర

పరోక్ష యుద్ధపు పరాకాష్టలు
సహించమంటూ సమరభేరియై
చెయ్యర చెయ్యర చెయ్యర యుద్ధం
అల్లూరి నడిపించిన యుద్ధం
యుద్ధం యుద్ధం యుద్ధం చెయ్యర
భగత్‌సింగ్ నినదించిన యుద్ధం
చెయ్యర చెయ్యర విముక్తి యుద్ధం
శాంతి సమతలు సాధ్యం చేయగ
యుద్ధం యుద్ధం యుద్ధం చెయ్యర
స్వతంత్ర విముక్తి విప్లవ యుద్ధం

-దివికుమార్

న్యాయసలహా

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

అన్న ఉద్యోగంపై మాకు హక్కులేదా?

మేము ముగ్గురం అన్నదమ్ములం. మా నాన్నగారి ఉద్యోగం మా పెద్దన్నయ్యకు ఇచ్చారు. నెలకు రు.14,000 వరకూ జీతం వస్తుంది. ప్రస్తుతం మా పెద్దన్నయ్య మా తల్లిదండ్రుల్ని, మమ్మల్ని చూడకుండా స్వార్థంతో తండ్రి ద్వారా సంక్రమించిన ఉద్యోగం తనొక్కడే అనుభవిస్తూ వేరే కాపురం పెడతానంటున్నాడు. పూర్వం అతడి ఉద్యోగానికి నామినీ పేర్లుగా మా పేర్లుండేవి. ప్రస్తుతం అతని భార్యా పిల్లల పేర్లు రాయించుకున్నాడు. మా పెద్దన్నయ్యకు తండ్రి ద్వారా సంక్రమించిన ఉద్యోగంలో మాకు వాటా పెట్టనంటున్నాడు. మాకు మా పెద్దన్నయ్య ఉద్యోగంపై అధికారం ఉందా? న్యాయం జరగగలదా? సలహా ఇవ్వగలరు.

– ఒక సోదరుడు, విశాఖపట్నం

మీ నాన్నగారి ఉద్యోగం మీ అన్నయ్య గారికి వచ్చినా ఉద్యోగం అతడికే వర్తిస్తుంది. ఆ జీతంలో, ఉద్యోగంలో మీరు ఎటువంటి వాటాను న్యాయపరంగాను, చట్టపరంగాను పొందలేరు.

అంగన్‌వాడీ టీచర్ల ప్రమోషన్

1992 నుండి అంగన్‌వాడీ టీచర్ ఐసిడిఎస్‌గా పని చేయుచున్నాను. పది సంవత్సరాలు ఉన్న వారు సూపర్ వైజర్‌కు అర్హులు అని జి.ఓ. ఉంది. కావున సి.డి.పి.ఓ. గారు పది సంవత్సరాలు సూపర్‌వైజర్ పోస్టుకి దరఖాస్తు చేసుకోమని చెప్పారు. సూపర్‌వైజర్ ఉద్యోగం కొరకు తేది 14-9-2003 పరీక్ష రాశాను. హాల్ టిక్కెట్ నెం.1445. ఈ ఉద్యోగాలలో వికలాంగులకు 3 శాతం రిజర్వేషన్ చేయలేదు. పై విషయం పురస్కరించుకొని హైదరాబాద్‌లో అధికారులను సంప్రదించగా కనీసం మాట్లాడటానికి కూడా అవకాశం ఇవ్వలేదు. మా వికలాంగులకు మాట్లాడే హక్కు లేదా?

17వ తేదీన వికలాంగుల కమిషనర్ గార్కి విన్నపం చేయగా కేసు నమోదు చేశారు. నెం.128/17-11-2003. ఇంతవరకూ న్యాయం జరగలేదు.

తేది 4-9-2004న మరోసారి కమీషనర్‌గారికి విన్నపం చేయగా న్యాయం చేస్తానని చెప్పారు. కావున నా యందు దయ వుంచి పై విషయంపై మీ అమూల్య న్యాయసలహా ఇస్తారని ఆశిస్తున్నాను.

– డి.సుశీల, అమ్రాబాద్, మహబూబ్‌నగర్ జిల్లా

రిజర్వేషన్ అమలుపరచకుండా ఉద్యోగాలు భర్తీ చేయకూడదు. అలా చేసినట్లయితే మీరు ఈ పాటికే కమిషనర్‌గారిని కలిశారు కాబట్టి మరొకసారి గవర్నమెంట్‌కు (సంబంధిత శాఖ మంత్రికి) ఓ దరఖాస్తు పంపించి 15 రోజులు అయ్యాక హైకోర్టులో రిట్‌పిటిషన్ వేయవచ్చు. దాంతో కమిషనర్ గారు త్వరగా మీ కేసు విషయం తేల్చే అవకాశం ఉంటుంది.

ఎక్స్‌పెటేడ్ పిటీషన్

నా తాలుకు కేసు సర్వీసు లేటరు హైకోర్టు రిట్టు నిమిత్తం వేసినాము. 99వ సం॥లో హైకోర్టు లీగల్ సర్వీస్ అథార్టీ వారి ద్వారా వేసినాము. గాని నేటి వరకు జడ్జిమెంట్ యివ్వలేదు. (లీగల్ సర్వీస్ అథార్టి నెం. ఆర్.ఒ.సి.నెం 2669 ఎల్.యస్.ఎ./99 తేది 8-10-2001 రిమైండర్) కావున తమ న్యాయ సలహాల ద్వారా నాకు తమరు దయచేసి తెలపగలరు. ఎందుకింత జాప్యం జరిగినది. సరైన సలహ ఇప్పించ గలరు.

– బర్లి జగన్మోహనరావు,
పెదకురంగి, విజయనగరం జిల్లా

మీరు లీగల్ సర్వీసెస్ అథారిటీ వారిని కలిసి మీ తరపున వాదిస్తున్న న్యాయవాది ఎవరో తెలునుకోండి వారిని సంప్రదించి త్వరగా విచారించ మని 'ఎక్స్‌పెటేడ్' పిటిషన్ దాఖలు చేసినట్లయితే మీకు త్వరగా న్యాయం జరగగలదు.

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :
న్యాయసలహా
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం.1,
అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

హ్యాపీ బర్త్‌డే

(26-12-2004 నుంచి
1-1-2005వరకు)

లక్ష్మీవెలుగొండారెడ్డి
9సం॥, 30.12.1995
రామలక్ష్మమ్మ-శ్రీనివాసరెడ్డి
పెద్దారవీడు-ప్రకాశం

రాహుల్ కృష్ణ
డిసెంబర్-31
లక్ష్మి-హరిబాబు
నెల్లూరు

సుమంత్ కుమార్
4సం॥, 31.12.2000
సోమలక్ష్మి-వెంకటేశ్వర్లు
హాలియా-నల్లగొండ

ఉజ్మషేక్
1సం॥, 1.1.2003
మెహ్రూన్‌షేక్-మహ్మద్‌షేక్
కిషన్‌బాగ్-హైదరాబాద్

భవాని
1సం॥, 1.1.2003
అన్నపూర్ణ-శ్రీనివాసరావు
వేమవరం-ప్రకాశం

పి.సాకేత్
5సం॥, 1.1.1999
రజని-దామోదర్
రాంనగర్-హైదరాబాద్

ప్రవలిక
జనవరి-1
సరళ-సంజీవరావు
ముంగమూరివీధి-నెల్లూరు

ఉజుమాసుల్తానా
జనవరి-1
మెహరున్నీసా బేగం-షేక్‌లాల్‌మహ్మద్
కుప్పానగర్-మెదక్

ఆర్. రిషి
4సం॥, డిసెంబర్-2000
ఉమాదేవి-రమణారావు
కృష్ణలంక-విజయవాడ

ప్రభాస్ (బంటి)
భారతి-వీరేష్
కురుమర్తి-నల్లగొండ

కె. అరవిందు
5సం॥, డిసెంబర్-1999
తాయమ్మ-రాముడు
కొసిగి-కర్నూలు

తారభ్ అజీజ్
3సం॥, డిసెంబర్-2001
ఫాతిమా-అజీజ్
విశాఖ

ఎం. శోభాబాయి
లక్ష్మీబాయి-లక్ష్మీనాయక్
గచ్చలకొండ-ప్రకాశం

శ్రీనివాసనాయక్
లక్ష్మీబాయి-లక్ష్మీనాయక్
గచ్చలకొండ-ప్రకాశం

భగత్‌సింగ్
వినోద-రాంబాబు
వెంకటాయపాలెం-ఖమ్మం

ఇమ్రాన్
నూర్‌జహా-అన్వర్
బి.వి.నగర్-నెల్లూరు

లెనిన్‌బాబు(నరేష్)
సరోజ-నాగేష్
చిట్యాల-నల్లగొండ

ప్రణీత్ చందన్
వసంత కళ్యాణి- ప్రసాద్
సింహాచలం, విశాఖపట్నం

తేజారెడ్డి (పింటు)
2సం॥, 30.12.2002
పద్మ-రాజిరెడ్డి
దమ్మన్నపేట-వరంగల్

రమ్య
2సం॥, 28.12.2002
శారద-హేమసుందరరావు
కొప్పు-శ్రీకాకుళం

వరుణ్‌కుమార్
సుజాత-వాసు
సింహాచలం, విశాఖపట్నం

నిఖిలేష్‌కుమార్
సుజాత-వాసు
సింహాచలం, విశాఖపట్నం

నిఖి
రమాదేవి-రామకృష్ణ
సింహాచలం, విశాఖపట్నం

కైమా లడ్డూ

కావలసిన వస్తువులు:

మటన్ కైమా	: పావు కిలో
శనగపిండి	: పావు కిలో
పంచదార	: పావు కిలో
యాలకుల పొడి	: రెండు టీ స్పూన్లు
పచ్చ కర్పూరం	: చిటికెడు
కిస్మిస్	: 50 గ్రాములు
జీడిపప్పు	: వంద గ్రాములు
నెయ్యి	: పావు కిలో

తయారు చేసే విధానం:

కైమా కొద్దిగా కడిగి నీళ్ళన్నీ పిండి కొద్దిగా నెయ్యివేసి ఆవగిల వేయాలి. బాండీలో కొంచెం నెయ్యి వేసి కాగిన తరువాత కిస్మిస్, జీడిపప్పు వేయించుకోవాలి. అవి తీసేసి ఆ నెయ్యిలో కైమా వేసి దోరగా వేయించాలి. మిగిలిన నెయ్యి కూడా పోసి శనగపిండిని జారుగా కలుపుకొని బూందీ దూయాలి. పంచదార కొద్దిగా నీళ్ళలో వేసి పొయ్యి మీద పెట్టాలి. తీగపాకం రాగానే కైమా వేయాలి. కొద్దిగా తెర్లనిచ్చి బూందీ, జీడిపప్పు, కిస్మిస్, యాలకుల పొడి, పచ్చ కర్పూరం వరుసగా కలిపి పొయ్యి ఆపెయ్యాలి. ఈ మిశ్రమం ఆరిన తరువాత లడ్డూ చుట్టుకోవాలి. ఈ లడ్డూ విడిగా వారం రోజులు నిల్వ ఉంటాయి. ఫ్రిజ్ అయితే 15 రోజులు నిల్వ ఉంటాయి. చెబితే తప్ప ఈ లడ్డూలో కైమా ఉన్నదని తినే వాళ్ళకు తెలియదు.

మటన్ ఫ్రై

కావలసిన వస్తువులు:

మటన్	: పావు కిలో
పెద్దఉల్లి	: పెద్దవి రెండు
అల్లం	: 25 గ్రాములు
చిన్న ఉల్లి	: మూడు రెబ్బలు
గరం మసాలా	: మూడు స్పూన్లు
ఎండు కొబ్బరి	: చిన్న చిప్ప
కొత్తిమీర	: సరిపడినంత

తయారుచేసే విధానం:

మటన్ ఆవగిల వేసిన తరువాత సరిపడా నూనె, కొద్దిగా నెయ్యి వేసి దానిలో మటన్ బాగా ఫ్రై చేయాలి. అది బాగా వేగిన తరువాత వేరే పెట్టి ఉల్లిపాయలు సన్నగా తరిగి దోరగా వేయించాలి. అవి పక్కన పెట్టాలి. ఆ తరువాత అల్లం, చిన్నఉల్లి, కొబ్బరి మెత్తగా నూరి బాండీలో మిగిలిన నూనెలో ఈ నూరిన పదార్థం, ఉప్పు, పసుపు, కారం, గరం మసాలా వేసి కొద్దిగా వేగిన తరువాత మటన్ వేసి ఫ్రైలాగా వేయించాలి. దించబోయే ముందు కొత్తిమీర చల్లుకోవాలి. జీడిపప్పు కూడా వేసుకోవచ్చు. పొడిపొడిగా ఈ ఫ్రై విడిగా తినడానికి కూడా బాగుంటుంది. మటన్ వాసన రాదు.

- గణేశుని స్వరాజ్యలక్ష్మి, గుంటూరు